# సంగీతజ్ఞానము...

## (తధల సంపుటి)



శ్రీమతి శ్రీగిరిరాజు విజయలక్ష్మి

సున్నితమనస్కురాలినైన నేను నాకు తెల్సిన వ్యక్తుల అవహాస్యాన్నీనూ, ఏ కష్టాన్నీ భరించలేను. మానవజన్మనిచ్చి, జీవితాన్ని, ప్రకృతినీ పరిశీలించగల్గే అదృష్టాన్నిప్రసాదించి కష్టసుఖాల్లో మర్చిపోకుండా ఉండగల్గేశక్తినిచ్చినభగవంతునికి సదా వినమ్రురాలినై ఉంటాను. నిస్వార్థంగా, నిజాయితీగా జీవించాలనేది నా జీవితాశయం.

చావు పుట్టుకలు సహజం కాబట్టి చావునెవరూ ఎప్పుడూ తప్పించుకోలేరు కాబట్టి, బాధలేని మరణాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటాను.

శ్రీమతి శ్రీగిరిరాజు విజయలక్ష్మి
కేరాఫ్ శ్రీ పోలవరం సుందరరామయ్య
3.6.5/ఎ, బాకారమ్,
హైద్రాదాద్-500 020.

ప్రతులు = 200
వెల : 20 రూపాయలు

ప్రచురించిన సంవత్సరము : 1994

# ముందుమాట

శ్రీశ్రీశ్రీశ్రీశ్రీ చందలూరు మహాలక్ష్మమ్మ అమ్మణ్ణివారి దయతో యీ నా "సంగీత జ్ఞానమూ........" కథల సంపుటిని ప్రచురించుకోగల్గటం సంభవించింది.

ఈ కథలన్నీ వాస్తవ జీవితానికి దర్పణాలు. సాహిత్యపరంగా ప్రారంభం లోనూ, మధ్యమధ్యలోనూ ముగింపునకూ కల్పనను జోడించటం జరిగింది.

ఏ విద్యఅయినా సరే నేర్పే గురువులకు సంకుచిత భావాలుండకూడదని. నా "సంగీత జ్ఞానము" ద్వారా చెప్పటం జరిగింది. (P. 1-6) ఆ కథ మొదటి స్థానాన్ని పొందటం, దానికి పతివాడ సుధాకర్ స్మారక బహుమతి లభించటం నాకు సంతోషాన్ని కల్గించిన విషయం. మిత్రుడు సి. హెచ్. ప్రసాద్ "గుంటూరు ఎక్స్‌ప్రెస్" అనే దినపత్రికను ప్రారంభిస్తూ నన్ను రచనలు పంపమని కోరినప్పుడు పత్రిక పెడితేకల్గే సాధకబాధకాలను వివరిస్తూ అతని పత్రికకు సరిపడే వీలుగా కుదించి వ్రాసిన కథ "దీపాల వెలుగు''. ఆ తర్వాతవీనూ. (P. 7-8)

యుక్త వయస్సులో యువతీ యువకులు పరస్పరం ఆకర్షితులవటం సహజాతి సహజం. సుందరి అనుకున్నట్లు అది మానసిక వ్యభిచారమూ కాదు, మదపిచ్చీ కాదు మనదేశ సాంప్రదాయాలు అలా ఉండటంవల్ల సుందరి అలా అనుకున్నది తప్ప, అందులో వింత ఏమీలేదు. (P. 9-10) ''శిశు'' కథలో కరణాల దౌర్జన్యాలకు బక్క రైతులేకాక మరికొందరు దిక్కులేని స్త్రీలు ఎలా మోసపోతారో వివరించటం జరిగింది. (P. 11-12) మనకన్ని విధాలా ఉపయోగపడే జంతువులను మనం ప్రేమించాలి తప్ప హింసించకూడదని చెప్పే ఉద్దేశ్యంతో ''బుజ్జి'' కథ వ్రాశాను. (P. 13-22)

తల్లిదండ్రుల్ని ముఖ్యంగా కొడుకులూ, కొడుకుల్ని బట్టే కోడళ్ళు ఎలా ''ట్రీట్ చేస్తున్నారో" చూపే కథ ''ఓ యింటి కథ''. (P. 23-25)

ఆర్థిక స్వాతంత్ర్యం ఉండీ భర్తలలో హింసింపబడే భార్యల కథే "బొమ్మా—బొరుసూ". (P. 26-29)





# స్వపరిచయం

పుట్టిన ఊరు : గుంటూరు

స్వగ్రామం : పోలవరం, అద్దంకి తాలూకా.

ఎలిమెంటరీ చదువు : పోలవరం, రాజానగరం, గుంటూరు.

హైస్కూల్, కాలేజీ : రెడ్డివారితాళ్ళూరు, విశాఖపట్నం, గుంటూరు

ఉద్యోగం : నీటిపారుదలశాఖ (హైద్రాబాద్) లో సూపరింటెండెంట్‌గా.

ఇతర వివరాలు : "వ్యాస సుమమాల" అనే వ్యాస సంపుటిని ప్రచురించటం జరిగింది.

లలితకళలన్నింటిపట్ల ఆసక్తి. చిత్రకళలో, గేమ్స్‌లో, వ్యాసరచన పోటీలలో, సంగీతంలో, కుట్లు, అల్లికలు వగైరాలలో బహుమతులు పొందటం సంభవించింది. వివరాలన్నీ విపులంగా "వ్యాససుమమాల" లో వ్రాయటంవల్ల మళ్ళీ యిందులో వ్రాయటంలేదు. అన్ని పత్రికలలోనూ నా వ్యాసాలూ, కథలూ, సమీక్షలూ, లేఖలూ, కవితలూ, కార్టూన్లూ, ఫోటోలు, ముగ్గులూ, వగైరాలూ ప్రచురించబడినాయి.

ఎవరే మేలు చేసినా వారికి ఆజన్మాంతం కృతజ్ఞత ప్రకటిస్తూ ఉండాలని నా ఉద్దేశ్యం. కృతఘ్నురాలిగా మిగిలిపోగూడదని కోరుకుంటానెప్పుడూ.

సున్నితమనస్కురాలినైన నేను నాకు తెల్సిన వ్యక్తుల అపహాస్యాన్నీనూ, ఏ కష్టాన్నీ భరించలేను. మానవజన్మనిచ్చి, జీవితాన్ని, ప్రకృతినీ పరిశీలించగల్గే అదృష్టాన్ని ప్రసాదించి కష్టసుఖాల్లో మర్చిపోకుండా ఉండగల్గేశక్తినిచ్చినభగవంతునికి సదా వినమ్రురాలినై ఉంటాను. నిస్వార్థంగా, నిజాయితీగా జీవించాలనేది నా జీవితాశయం.

చావు పుట్టుకలు సహజం కాబట్టి చావునెవరూ ఎప్పుడూ తప్పించుకోలేరు కాబట్టి, బాధలేని మరణాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటాను.

[illegible]


**శ్రీమతి శ్రీగిరిరాజు విజయలక్ష్మి**

కేరాఫ్ శ్రీ పోలవరం సుందరరామయ్య

3655/ఎ, బాకారమ్,

హైద్రాబాద్-500 020.



ప్రతులు = 200

వెల : 20 రూపాయలు

ప్రచురించిన సంవత్సరము : 1994


[illegible]

[illegible]

# ముందుమాట

శ్రీశ్రీశ్రీశ్రీశ్రీ చందలూరు మహాలక్ష్మమ్మ అమ్మణ్ణివారి దయతో యీ నా "సంగీత జ్ఞానమూ........" కథల సంపుటిని ప్రచురించుకోగల్గటం సంభవించింది.

ఈ కథలన్నీ వాస్తవ జీవితానికి దర్పణాలు. సాహిత్యపరంగా ప్రారంభం లోనూ, మధ్యమధ్యలోనూ ముగింపునకూ కల్పనను జోడించటం జరిగింది.

ఏ విద్యఅయినా సరే నేర్పే గురువులకు సంకుచిత భావాలుండకూడదని. నా "సంగీత జ్ఞానము" ద్వారా చెప్పటం జరిగింది. (P. 1–6) ఆ కథ మొదటి స్థానాన్ని పొందటం, దానికి పతివాడ సుధాకర్ స్మారక బహుమతి లభించటం నాకు సంతోషాన్ని కల్గించిన విషయం. మిత్రుడు సి. హెచ్. ప్రసాద్ "గుంటూరు ఎక్స్‌ప్రెస్" అనే దినపత్రికను ప్రారంభిస్తూ నన్ను రచనలు పంపమని కోరినప్పుడు పత్రిక పెడితేకల్గే సాధకబాధకాలను వివరిస్తూ అతని పత్రికకు సరిపడే వీలుగా కుదించి వ్రాసిన కథ "దీపాల వెలుగు''. ఆ తర్వాతవీనూ. (P. 7–8)

యుక్త వయస్సులో యువతీ యువకులు పరస్పరం ఆకర్షితులవటం సహజాతి సహజం. సుందరి అనుకున్నట్లు అది మానసిక వ్యభిచారమూ కాదు, మదపిచ్చీ కాదు మనదేశ సాంప్రదాయాలు అలా ఉండటంవల్ల సుందరి అలా అనుకున్నది తప్పు. అందులో వింత ఏమీలేదు. ''[illegible]'' కథలో (P. 9–10) ''శిస్తు'' కథలో కరణాల దౌర్జన్యాలకు బక్క రైతులేకాక మరికొందరు దిక్కులేని స్త్రీలు ఎలా మోసపోతారో వివరించటం జరిగింది. (P. 11–12) మనకన్ని విధాలా ఉపయోగపడే జంతువులను మనం ప్రేమించాలి తప్ప హింసించకూడదని చెప్పే ఉద్దేశ్యంతో ''బుజ్జి'' కథ వ్రాశాను. (P. 13–22)

తల్లిదండ్రుల్ని ముఖ్యంగా కొడుకులూ, కోడుకుల్ని బట్టే కోడళ్ళు ఎలా ''ట్రీట్ చేస్తున్నారో'' చూపే కథ ''ఓ యింటి కథ''. (P. 23–25)

ఆర్థిక స్వాతంత్ర్యం ఉండీ భర్తలతో హింసింపబడే భార్యల కథే "బొమ్మా–బొరుసూ". (P. 26–29)

అన్ని శాఖల్లోనూ పాతుకుపోయిన అవినీతిని సి. ఎ. జి. వాళ్ళు జల్లెడపట్టి ఆడిట్ పేరాలుగా ఆవిర్భవింపజేస్తారు. దానికి ఆయా శాఖలకు సంబంధించిన అధికారులూ, సిబ్బందీ ఆ పేరాలకు జవాబులివ్వటం, పరిష్కారాలు చేయటంలాంటి విషయాలను ఎత్తిచూపే కథ "పబ్లిక్ అకౌంట్స్ కమిటీ". (P- 38-34)

పరాయి మగవాళ్ళేకాదు మోసంచేసేది, వరుస అయిన వాళ్ళు కూడా ఎంతో పవిత్రంగా బ్రతకాలనుకునేవాళ్ళను కూడా ఘోరంగా వంచించగలరనే నిజాన్ని చాటి చెప్పటం "లలిత" కథలో జరిగింది. (P. 35-46)

తల్లులు త్యాగానికీ, అనురాగానికీ ప్రతీకలు. 'తల్లి' పేరుకు కళంకం తెచ్చి కన్న పిల్లలనే క్రూరంగా హింసించే రాక్షస మనస్తత్వంగల తల్లులకు ప్రతీక వనజ పాత్ర. ఆ తల్లి కథే "తల్లే రాక్షసైతే". (P. 47-52)

ఆఫీసుల్లో బాస్‌లు తమ క్రింది ఉద్యోగినులను మనసులో కోరిక పెట్టుకుని ఎలా హింసిస్తారో తెలియజెప్పే కథ "సుశీల". (P-53-58)

అసూయ, పగ అక్కచెల్లెళ్ళ మధ్య కూడా ఎంతటి కల్లోలాన్ని సృష్టించ గలదో వివరించే కథ "కృష్ణవేణమ్మ". (P-59-67)

ఆఫీసర్ల దగ్గరుండే స్టెనోగ్రాఫర్లు తమ అధికారాన్ని ఎలా దుర్వినియోగం చేస్తారో తలా ఒక కథచెప్పి అనిహాస్యధోరణిలో వివరించటం సంభవించింది "బ్రతక నేర్చిన కథల కాణాచీ" లో. (P. 68-75)

పనిమనుషులు లేనిదే సమాజం ముందుకు నడవదు మన దేశంలో అని తెలియజేసే కథలాంటిది "పనిమనుషులు." (P- 76-78)

నా తల్లి పోలవరం వెంకట సుబ్బమ్మగారంటే నాకు అమితమైన ప్రేమ. ఆమెకు అనుకోకుండా క్యాన్సర్ వ్యాధి సోకింది ఆమెకు డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధతో వైద్యంచేసి, ఆమె జీవిత కాలాన్ని పొడిగించడంలో కృతకృత్యులయ్యారు. వారికి కృతజ్ఞతలు తెలియజేసుకోటాన్కి, నర్సింగ్ హోమ్ అంటే ఎలా ఉండాలో,

డాక్టర్లు అంకిత భావంతో రోగులకు ఎలా సేవలందించాలో అనే విషయాలను కొంతవరకు తెలియజెప్పే కథ "వైద్యోనారాయణోహరిః" మందులగురించీ ఆస్పత్రి వాతావరణంగురించీ వ్రాసి పేజీలు నింపితే పాఠకులకు విసుగు కల్గగలదని భావించి కథకు పరిపూర్ణత చేకూరుతుందని భావించి ప్రేమనుకూడా జోడించటం జరిగింది కథలో. పత్రికలవారు కోరినట్లు స్థలాభావాన్ననుసరించి కుదించి వ్రాశాను యీ కథలన్నీ. అన్ని వృత్తులలో టీచరు వృత్తి పవిత్రమైనదైనప్పటికీ, వైద్య వృత్తి ప్రాముఖ్యతను ఆకాశానికెత్తిన ప్రయత్నం యీ కథకనుబంధంగా యిచ్చిన వచన కవిత "వైద్య బ్రహ్మలు".

మొదటినుండీ యిప్పటివరకూ, కొందరు వ్యక్తులవల్ల, కొన్ని సంఘటనలవల్లా నేను డిప్రెస్ కాబడ్డాను. ఆ డిప్రెషన్ నన్ను కొన్ని మానసిక శారీరక బాధలకు లోనుచేసింది. నా శక్తికి మించే యీ ప్రచురణకు పూనుకోవటం జరిగింది. ఇహముందు ముందు ఏ రచనలు చేయగలనో పరిస్థితులు, ఆరోగ్యం ఎంతవరకు అనుకూలిస్తాయో, దైవ సంకల్పమెలా ఉంటుందో చెప్పలేను.

ప్రముఖులలో పరిచయాలు బహు తక్కువ కాబట్టి ముందుమాట వగైరాలు వ్రాయించటాన్కి సాహసించలేకపోయాను. నీతులు చెప్పటమేకాదు ఆచరణలో చూపాలనే ఆశయం నాది.

[illegible]

సర్వేజనాః సుఖినోభవంతు

శ్రీమతి శ్రీగిరిరాజు విజయలక్ష్మి
కేరాఫ్ శ్రీ పోలవరం సుందరరామయ్య
365/ఎ, బాకారమ్,
హైద్రాదాద్-500 020.

# సంగీతజ్ఞానమూ........

శ్రీమతి శ్రీగిరిరాజు విజయలక్ష్మి

"స రి గ మ ప ద ని స"

"స రి గ మ ప ద ని స"

సరళీస్వరం మొదటిపాదంలోని ఒక్కొక్క స్వరాన్ని విడివిడిగా మాష్టారు చెప్పిన విధంగా ఖచ్చితంగా పలికింది సంగీత.

"స ని ద ప మ గ రి స"

"స ని ద ప మ గ రి స"

రెండో పాదాన్ని కూడా అపశృతులు లేకుండా పలికిందామె.

"అబ్బ వెంటనే ఎంత చక్కగా అనేసిందో! చేరింది ఈ రోజే అయినా మొదటి సరళీస్వరం మూడు కాలాల్లో పలకడానికి వారం రోజులు పట్టింది గదే మనకు" గుసగుసగా అనుకున్నారు అక్కడున్న అమ్మాయిలు కొందరు సంగీత వైపు ఆసక్తిగా చూస్తూ.

అరగంటసేపు ఆ స్వరాన్నే మళ్ళీ చెప్పించారు మాష్టారు సంగీతతో.

మిగిలిన అర్ధగంటా కబుర్లతో కాలక్షేపం చేయించారు మాష్టారు.

పాఠం చెప్పే కాలం రోజూ కొకగంట. పేరుకు గంటేకాని, చెప్పేది అరగంటకూడా వుండేదికాదు.

ఒక రోజు వీణ, మరొక రోజు గాత్రం. అలా వుండేది పాఠం చెప్పడం.

పది సరళీస్వరాలు, జంటస్వరాలు, అలంకారాలూ, స్వరజతులూ, గీతాలూ, వర్ణాలూ నేర్చుకోవడడం పెద్ద కష్టంగా ఏమీ అన్పించలేదు సంగీతకు.

సంగీతజ్ఞానం చిన్నతనం నుండే ఉందామెలో. వాళ్ళ అమ్మమ్మ పాడే ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు, తల్లిదండ్రి శుక్రవారాలు అమ్మవారివద్ద పాడే

పాటలు పసితనంనుంచి వినడంవల్ల చక్కగా పాడే జ్ఞానం కలిగింది ఆమెకు. ఒకటి రెండుసార్లు వింటేచాలు, కష్టంగా వున్న ఏ బాణీ అయినా సరే ఠక్కున పట్టేసేది.

పెద్దయింతర్వాత స్కూల్లో, కాలేజీలో మంచి గాయనిగా పేరు తెచ్చు కున్నది సంగీత. కానీ శాస్త్రోక్తమైన సంగీతాన్నభ్యసించాలని కలలు గనేదామె.

బాలమురళీకృష్ణ, ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, ఎం.ఎల్. వసంతకుమారి, డి.కె. పట్టమ్మాళ్ల గాత్ర తీరులంటే మక్కువ.

విదేశీయుడైనా భారతీయ కర్నాటక సంగీతంలో నిష్ణాతుడైన జాన్‌హిగ్గిన్స్ భాగవతార్ ఆమెకు ఆదర్శప్రాయుడు.

వాళ్ళందరిలాగా సంగీత విద్వాంసురాలు కావాలనే కోరిక ఆమె అంతరాంత రాలను తొలుస్తుండేది.

కానీ తండ్రి గతించడంతో బంధువుల దయాదాక్షిణ్యాలలో బ్రతకవలసి రావడంవల్ల, చదువుకోవడమే ఘనమైపోయింది.

ఆ తర్వాత కుటుంబ పోషణార్థం ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సంగీతం నేర్చుకోవాలనే తహతహ మాత్రం ఆమెను వదల్లేదు.

ప్రస్తుతం ఆర్థికంగా స్వతంత్రురాలు కాబట్టి ఏదో ఒక ఖర్చు తగ్గించుకుని అయినాసరే సంగీతం నేర్చుకోవాలని నిశ్చయించుకున్నది.

ఆ ఊళ్ళోవున్న కొంద్దరు సంగీతకారులలో శేషాచార్యులుగారు సంగీతం బాగా చెప్పగలరని తెలియడంతో వారివద్ద సంగీతం నేర్చుకోవడానికి ఉపక్ర మించిందామె.

''రఘువంశ సుధాంబుధి చంద్ర శ్రీ....'' ను మాష్టారితో సమానంగా కలిపి వీణపై వాయిస్తోంది రేఖ.

రేఖ వాళ్ళు బాగా డబ్బుగలవారు. వాళ్ళ అమ్మానాన్న అప్పుడప్పుడు మంచి నేయి, స్వీట్లు రెండు మూడు డబ్బాలలో తెచ్చి మాష్టారికిచ్చి, ఆయనను బాగా పొగిడి వెళ్ళేవాళ్ళు

"అబ్బెబ్బే ఎందుకండీ ఇవన్నీనూ ...."అంటూ మొహమాటంగా తీసుకొనే వారు మాష్టారు.

రేఖ ప్రోగ్రెస్ గురించి ఆమె తల్లిదండ్రులడిగితే, "దానికేమండీ బంగారం. ఇట్లా చెప్పగానే అట్టా అల్లుకు పోగలదు'' అంటూ ఆకాశానికెత్తేసేవారు రేఖను.

* * *

స్వరాలు, గీతాలు, వర్ణాలూ, కృతులూ అంటూ నాలుగు విభాగాలుగా విభజించారు విద్యార్థినులను.

తన బ్యాచ్ లో కొంతమంది తనతో కలిసేదాకా తర్వాత పాఠం చెప్పేవారు కాదు సంగీతకు మాష్టారు.

వృథా కాలాయాపనవల్ల నిరాశగా అన్పించేదామెకు. ఆర్థిక ఇబ్బందులు లేనివారు కాలయాపనకు తట్టుకోగలరేమోకానీ, మాష్టారు నేర్పుతున్న సంగీతం త్వరగా ఒంటబడుతున్నప్పుడు ఎందుకలా చేస్తారు మాష్టారు అని అనిపించేదామెకు తను నెలనెలా డబ్బు కట్టడానికి ఎంత యిబ్బంది పడుతుందో గుర్తొచ్చి.

ఈ రోజు పాఠం చెబుతారో లేక పోచికోలు కబుర్లతో కాలక్షేపం చేస్తారో నని ఏరోజుకారోజు గండంలా వుండేది కానీ, హాయిగా అన్పించేది కాదామెకు.

వాళ్ళ గేదెల గురించీ, అవి పేడవేసే విధానం గూర్చి వాళ్ళకు లేకలేక కలిగిన కొడుకు లోకాయి గురించి, సాటి సంగీతం మాష్టార్ల సంగతులూ, ఇలా ఎన్నో అర్థంపర్థంలేని సంగతులతో కాలం గడిపే వారాయన.

ఆయనకు డబ్బులు రావడం ముఖ్యం. దానికై పాఠాలు సాగదీసి కాలాన్ని పొడిగించాలి. అదీ సంగీతలాంటి మధ్యతరగతి వాళ్ళమీదే ఆయన ప్రయోగం. రేఖలాంటి డబ్బున్నవాళ్ళ వద్ద ఆయన పప్పులుడకవు. వాళ్ళంటే భయం. అంటే

డబ్బు మీద గౌరవం. డబ్బులేకపోతే దుబ్బుకు కొరగానీ లోకంలో అన్పించేది సంగీతకు.

❀ ❀ ❀

"పరాకేల సరస్వతీ...." పాడుతున్నది సంగీత ఒకరోజు శృతిబాక్స్‌లో శృతివేసుకుంటూ, ఒక్కో సంగతీ విడివిడిగా పలుకుతూ.

అప్పుడే మాష్టారికోసం ఎవరో వచ్చారు. "ఎవరా అమ్మాయి! తారస్థాయిలో పంచమాన్ని అంతచక్కగా అనగల్గుతున్నది. కంఠం కూడా అద్భుతంగా వుంది" అన్నారాయన.

"అనుమంద్ర స్థాయిలో కూడా అంత బాగానూ అనగలదు" అంటారేమో మాష్టారు అనుకున్నది సంగీత. కానీ "ఆ....ఫలానా ఆఫీసులో పన్చేస్తుందీ" అంటూ నాన్చారు మాష్టారు.

ఆదే రేఖలాంటి పలుకుబడీ, డబ్బుగల వారమ్మాయయితే పొగిడి పొగిడి కీర్తించేవారే, "గురువులు పొగడకూడదు. కానీ ప్రతిభగలవారి గూర్చి కాస్త ప్రోత్సాహకరంగా మాట్లాడితే తప్పు లేదు కదా" అన్పించిందామెకు.

మాష్టారెప్పుడూ మాటలతో కృంగతీసేవారామెను. "అందంగా, బొమ్మలా వీణ పట్టుకు కూర్చుంటావు కానీ, కదలికే లేదు" అంటూ నిరుత్సాహపరిచేవారు అలా అనాల్సిన అవసరం లేకపోయినా.

వీణమీద పడిపోతూ, పూనకం వచ్చినట్టు ఊగిపోయే కదలికలు ఆమెకయిష్టం. మరీ రాయిలా బిగుసుకుపోకుండా గమకానికి తగ్గట్లు పాడేటప్పుడు కాస్త కదలికవుంటే చాలని ఆమె అభిప్రాయం.

❀ ❀ ❀

"తెలిసి రామ చింతనతోనామము....", "సామజ వరగమనా....", "ఎంత నేర్చినా", "సంగీతజ్ఞానము....భక్తివినా,...." మొదలైనవి తనకూ నేర్పమని అడిగింది మాష్టార్ని సంగీత; రేఖా, రాధా, రాణి వాళ్ళకు అవి నేర్పుతుంటే.

మాష్టారెంత త్రొక్కి పెట్టినా, కాలయాపన చేసినా ప్రస్తుతం కృతుల విభాగంలోకి అడుగు పెట్టింది కాబట్టి.

"నీకేం వస్తాయవి? సంగీత సముద్రాన్ని అంత తొందరగా ఒక్కసారే మధించాలన్న తొందరయితే ఎట్లానే నీకు. వాటిల్లో కొన్ని స్పీడుగా పాడాల్సి వస్తాయి, నీవేం పాడగలవు?'' అంటూ నలుగురి మధ్య మాష్టారు చులకనగా మాట్లాడేసరికి అవమానభారంతో తల భూమిలోకి కృంగిపోతే బావుణ్ణనిపించింది సంగీతకు.

సంగీతం మానేస్తే బాగుణ్ణన్పించింది మొదటిసారిగా. టైపు నేర్చుకోవడమూ, ఆఫీసులో పనీ, సంగీతం క్లాసులకు రావడమూ, మళ్ళీ సాధనా క్షణం విశ్రాంతి లేకుండా అయింది. తరచూ జ్వరం వస్తుండేది. తల్లి కోప్పడేది సంగీతం మానెయ్యమని. ఆ డబ్బులు దేనికో ఒకదానికి వస్తాయనేది.

❊ ❊ ❊

ఒక రోజు.... కలవారమ్మాయి, ఆస్త్మా పేషెంట్ జానకికి 'రాగాలాపన' ఎలా చేయాలో బోధిస్తున్నారు మాష్టారు. తనకూ హరికాంభోజి, దేవమనోహరి, ఖమాస్, శుద్ధధన్యాసి, హంసధ్వని, పుష్పలతిక, నాట కురంజి, బేగడ, సామ, బౌళి మొదలైన రాగాలలో చాలానే కృతులు నేర్పారు కాబట్టి ''జానకి ఎంత కష్టపడుతున్నదో తనకైతే అలా అన్పించకపోను" అని అనుకున్న సంగీత యింటికి రాబోయేముందు "మాష్టారూ! నాకూ నేర్పరా" అని ఆసక్తిగా, జాలిగా అడిగింది.

"నీకా! అప్పుడే రాగాలాపనా, స్వరకల్పనలూనా! మరో రెండేళ్ళు పడుతుంది నీవా స్టేజీకి రావాలంటే, అయినా నేర్పేవాడిని నాకు తెలియదా! ఎవరికెప్పుడు ఏది నేర్పాలో. నీది మరీ ఆకాశానికి నిచ్చెనలు వేసే వ్యవహారంలాగుందే చూస్తే, ఇట్లా చాలాసార్లు నన్నెదిరించావ్. ఇలా అయితే నా దగ్గర కుదరదు..... మానెయ్యొచ్చు" గట్టిగా అరిచారు మాష్టారు ఉక్రోషంగా.

"అవును ఎందుకు కుదురుతుంది? నేతి డబ్బాలూ, వగైరాలు మీ ఇంటికి చేరవేయలేదుగా మరి. నేను చక్కగా పాడగలిగినా సాటివాళ్ళు ఇంకా నేర్చుకోలేదని ఒక్కో విభాగంలో పాతేసి వుంచేవారు. ఏనాడూ ప్రోత్సహించేలా మాట్లాడక

పోయినా, వ్యంగ్యపు వాక్కులతో క్రుంగదీశారు కదలిక లేదు, అది లేదు, ఇది లేదు అంటూ. వృద్ధిలోకి రావాలన్న నా ఆకాంక్షను మీరు ఎప్పటికప్పుడు తుంచుతూనే వచ్చారు. గురువులెప్పుడూ శిష్యుల చురుకుదనాన్ని బట్టి విద్య నేర్పాలిగానీ, వారి ఆర్థిక స్తోమతును బేరీజు వేసుకునిగాదు. శిష్యులు తమను మించిపోతారని ఏ గురువైనా అణగద్రొక్కటంచేస్తే విద్వాంసులెక్కడ తయారవుతారు మాస్టారూ! ఊబిలో కూరుకుపోతారుగానీ...." అని పైకనలేదు సభ్యత అడ్డొచ్చి. ఆయన మానెయ్యమని తెగేసి అన్న తర్వాత ఇంకా క్లాసులకు రావటమూ కష్టమే. ఉబికి వస్తున్న కన్నీటిని బలవంతంగా అపుకుంటూ, తడబడే అడుగులతో గేటు బయట వరకూ వచ్చి, ఒక్కసారి వెనుదిరిగి చూసింది మాష్టారివైపు - 'ఇంతవరకైనా కాస్తంత సంగీతజ్ఞానం కలిగించిన మీకు నా కృతజ్ఞతలు. సెలవు' అనే భావన కన్నుల్లో కదలాడగా.

❀ ❀ ❀

సంగీతజ్ఞానమే భగవంతుని దరిచేరే సాధనమని నమ్మి, ఎన్ని ఒడిదుడుకులెదురైనా వివాహం కూడా చేసుకోకుండా శేష జీవితాన్ని సంగీత సాధనలో తరింపచేసుకోవాలనీ, విద్వాంసురాలవ్వాలనీ కలలుగన్న ఆమె ఆశల వటవృక్షం గురువు నిరాదరణతో కూకటి వేళ్ళతో కూలిపోయింది.

( ఆంధ్రజ్యోతి వీక్లీ, తేది. 18-6-1986 )

(తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి మినీ కథల పోటీలో
(రూ. 250/-లు) మొదటి బహుమతి పొందిన కథ)

( పతివాడ సుధాకర్ స్మారక బహుమతి (116/-రూ.) కూడా అందుకున్న కథ )

మినీకథ

# దీపాల వెలుగు

''హలో సరూ!''

"హాయ్ సుధా! ఏమిటీ విశేషం. ప్రొద్దున్నే ఫోన్ చేశావ్."

"విశేషమా! ఏం లేదోయ్! మరీ........"

"ఏవిటీ మరీ. నాన్చేదు. స్పష్టంగా చెప్పు సుధా''

"మరేమో...." కినుక్కున నవ్వింది సుధ.

''ఏవిటోయి నీ వేళాకోళం! ఏప్రిల్ ఫస్టుకూడా కాదీరోజు. నస్పెన్సులో పెట్టక త్వరగా చెప్పేసెయ్.''

"ఇక చెపుతున్నా కాచుకో. ఏమిటంటే...." మధ్యలోనే ఆగిపోయింది సుధ.

"కొంపతీసి పెళ్ళిచూపులు కాలేకదా! చెప్పటానికి సిగ్గేసి నాన్చుతున్నట్లున్నావు. ఇంకో క్షణమాలస్యమైంతంటే ఫోన్ పెట్టేస్తానంతే" అని చివరి అస్త్రంగా బెదిరించింది సరోజ.

ఇక లాభంలేదనుకొని, "మా అన్నయ్య సుధాకర్ తెలుసుగదా! వాడు ఓ పత్రిక ప్రారంభించబోతున్నాడు దీపావళికి. అది చెబుదామని ఫోన్ చేశాను నీకు."

"ఓస్ అంతేనా! ఇప్పుడు పత్రికలు ప్రారంభించటం, అవి పురిట్లోనే సంధి కొట్టినట్లు ఆగిపోవటం చాలా చాలా చూస్తూనే ఉన్నాం గదా! ఎందుకూ అనవసరంగా మీ అన్నయ్యకంత శ్రమ...."

''మా అన్నయ్య సంగతి నీకు తెలీదా? వాడి ఆశయాలూ, ఆదర్శాలూనూ. ఏదైనా పని తలపెడితే దాని అంతు చూడందే వదలడు గదా! వాడు.''

''వెరైటి శీర్షికలు పెట్టి మామూలుకు భిన్నంగా పత్రికా రంగంలో ఒక నూతన ఒరవడిని తీసుకరావాలన్నదే వాడి ఉద్దేశ్యం.''

"ఇంకేం విప్లవ రచయిత్రివి నువ్వు వున్నావు గదా! ప్రత్యేక తరహా రచనలు చెయ్యాలంటూ, ఆ పత్రికలనూ ఈ పత్రికలనూ దేబిరించనవసరం లేకుండా యింక గుప్పిద్దువుగాని నీ రచనా బాణాలు పాఠకుల మీద మీ పత్రికలో."

"ముందు కంగ్రాట్స్ చెప్పకుండా ఏమిటోయ్ నీ గొడవ?"

"అయితే అందుకో ముందుగా దీపావళి శుభాకాంక్షలు. నీకూ, మీ అన్నయ్యకు.

రచయిత్రిగా నీవు, సంపాదకునిగా మీ అన్నయ్య సాహిత్య రంగంలో ప్రత్యేక స్థానాన్ని అలంకరించాలని నా ప్రగాఢ ఆకాంక్ష. సరేనా! ఇంక ఉంటానే. బై ...." అంటూ ఫోన్ పెట్టేసింది సరోజ.

సరోజ అభినందనలతో పరవశించిపోతున్న సుధ కళ్ళల్లో అనేక దీపాల వెలుగును చూచి ఆనందించాడు వీరిద్దరి ఫోన్ సంభాషణ వింటూ ప్రక్కనే ఉన్న సుధాకర్.

( గుంటూరు ఎక్స్‌ప్రెస్, తేది. 4-11-1983 )

# చూపుల వేట
## మినీకథ

అయ్యర్ హోటల్ ప్రొప్రయిటర్ కుమార మంగళం. తొమ్మిదో సంతానమూ, చివరిదయిన సుందరి అంటే ఆయనకు పల్లమాలిన ప్రేమ. సుందరి ఆడింది ఆట, పాడింది పాటగా సాగుతుండేది.

ఇంట్లో ఎవరన్నాకూడా భయభక్తులులేని సుందరికి కాస్త ఊహ తెలిసిన్పటి నుండే సెక్స్ వాంఛలు చాలామందిలోలాగే మొదలయ్యాయి. ఏదేదో చేసుకుంటూ తనలో తానే తృప్తిననుభవించేది.

యుక్తవయసు వచ్చిరాకముందే కంటికి కాస్త నదురుగా కన్పించే యువకులను చూస్తూ ఆ చూపులవల్ల ఏర్పడే ఒక విధమైన పరవశత్వంతో హాయిని పొందుతుండేది.

స్కూల్లో చేరిన తర్వాత చూపులవేట మరీ అధికమైంది.

కొన్నాళ్ళు ఒకరిని అదేపనిగా చూసేది. అవతలతను కళ్ళు కలపగానే ఒళ్ళంతా విద్యుత్ ప్రవహించినట్లయి అంతు తెలియని లోకాలకెళ్ళిపోయి, ఆ కలల్లో అతనితో విహరించేది.

ఒకర్ని గురించిన ఊహల్లో ఉన్నప్పుడు పక్కా పతివ్రతలా మరొకర్ని తన ఆలోచన దరిదాపుల్లోకి రానిచ్చేదికాదు.

ప్రక్కింటి మోహన్, ఫిఫ్త్‌ఫాం చదివే శ్రీనివాస్, కొందరు మాష్టార్లు, ఎదురింటి కుర్రాడు, యిలా చాలా మందితో మానసిక వ్యభిచారం చేసేది.

తను చూస్తున్న వాళ్ళెవర్నయినా తన క్లాసమ్మాయి చూస్తున్నట్లు గమనిస్తే చాలు, ఈర్ష్యతో మండిపోయేది వాళ్ళకు తనేదో స్వంత భార్య అయినట్లు.

చూపుల ప్రహసనంతోనే సరిపెట్టుకునే తత్వమామెది.

సీత, సావిత్రిలాంటి మహాపతివ్రతల చరిత్రగల భారతదేశపు గడ్డపై పుట్టటం వల్లనో, ఏమో ఎవరితోనూ శారీరక సంబంధాలు పెట్టుకోవటానికి ముందంజ వేయలేకపోయేది.

దానికి తగ్గట్టు ఆమె చూపుల తూపులకు బలయ్యే మగవాళ్ళు సభ్యతకల వాళ్ళు కావటం, ఏదోలే చూపుల గొడ్డు అని సరిపెట్టుకుని అదో యవ్వనపు సరదాగా తీసుకున్న వాళ్ళునూ

ఈ మధ్య కొత్తగా ఆ ఊళ్ళో పెట్టిన బ్యాంకులో పనిచేసే దామోదరరావును గమనించటం, అతను పూటకూళ్ళ శివమ్మ యింట్లో భోంచేసి వెళ్ళేటప్పుడు యింటి ప్రక్క సందులో నిలబడి మిత్రులతో కలిసి రూమ్‌కెళ్ళే అతనిముందే తనవివశత్వాన్ని అరమోడ్పు కన్నులద్వారా, శరీర కదలికలద్వారా ప్రదర్శించటం మొదలు పెట్టింది.

దామోదరరావు రోజూ చూస్తూనే ఉన్నాడు సుందరి అవస్థంతా.

పెళ్ళయి "పడక" సుఖాలు రుచిమరిగినవాడు మరి. ఒకరోజు ఓ చూపు చూద్దామని మిత్రులకు కాస్త దూరంలో నడుస్తూ వెనక్కి తగ్గి సుందరికి గజం దూరంలో నిలబడి మెల్లగా,

"ఏయ్ ! రాత్రికి రమ్మంటావా !'' అన్నాడు.

అటువంటి పరిస్థితిని ఎన్నడూ ఊహించని సుందరి అలాంటి అసభ్యకరమైన మాటలకు చీదరపడి, తనపై తనకే అసహ్యంవేసి, ఒక్కసారి తన మదపిచ్చెంత దూరం పోయిందోనని జ్ఞానోదయం కలిగి, స్థాణువై, తేరుకుని, దడదడలాడే గుండెతో పెరట్లోగుండా లోపలకు పరుగెత్తి, తలుపేసుకుంది.

దాంతో సుందరి సెక్స్ చూపుల ఉదంతానికి బ్రేకు పడింది.

( గుంటూరు ఎక్స్‌ప్రెస్ ది. 1-12-83 )

శ్రీమతి శ్రీగిరిరాజు విజయలక్ష్మి

# శిస్తు

ఎటు చూసినా చిమ్మచీకటి, చెవులు చిల్లులుపడేలా కీచురాళ్ళ అరుపులు కప్పల బెకబెకలూను.

వాన తుంపర మొదలైంది.

వెంకాయమ్మకూ, పేరిగాడికీ మధ్య నడుస్తున్నాడు పదకొండేళ్ళ రాము. అతనికా వాతావరణం అంతులేని భయాన్ని, చెప్పలేని నిరాశనూ కల్గిస్తున్నది,

దూరంగా దయ్యాల్లా పెద్ద పెద్ద చెట్లు. సరుగుడుతోపు దగ్గరకు వచ్చారు. కొరివి దయ్యాలేమో ! వెలుగుతూ, ఆరుతూ ఉన్నాయి.

వాళ్ళిద్దరూ అతనిని పట్టించుకోవటంలేదు. ముందు నడుస్తున్నారు వడివడిగా.

ఏ కొరివి దయ్యమో వెనుకనుండి వాటేసుకుంటుందేమోనని వణికి పోతున్నాడు రాము.

ప్రొద్దుటినుండీ ఏమీ తినకపోవటంవల్ల చాలా నీరసంగా ఉందతనికి. అడుగులు తడబడి, వాళ్ళకంటే వెనకబడిపోతున్నాడు.

అయినా ఫస్ట్‌ఫారంలో చేరాలంటే ఎంట్రన్స్ పరీక్షకు కూర్చోబెట్టాలిగానీ, ఎవరినో సలహా అడగాలని యీ వెంకాయమ్మ యీ ఊరెందుకు తీసుకొచ్చిందో ! తీరా వెళ్తే ఆ సలహాదారులేడు. ఇదిగో వస్తాడు, అదిగో వస్తాడని సత్రంలోనే పొద్దుపోయేలా చేసింది. ఈ రాత్రికిక్కడే పడుకుండిపోతే బాగుణ్ణనిపించింది రాముకు. తింటానికి ఏమీ పెట్టించలేదు పాపిష్టిది. అమ్మ యీవిణ్ణెందుకు నమ్ముతుందో ! "కరణం శిస్తు కట్టమన్నాడు. నాలుగయిదేళ్ళనుండీ కట్టటంలేదుటగా" అంటూ దబాయిస్తున్నది అమ్మను యీ మధ్య. అమ్మవద్ద డబ్బుల్లేవులాఉంది. ఏవిటో చాలా రహస్యంగా సంప్రదిస్తున్నది అమ్మతో వెంకాయమ్మ.

ఆ పేరిగాడొకడు గార పళ్ళూ వాడూ. ఏంటోలా చూస్తుంటాడు అమ్మ వేపు. కంపరం పుడుతుంది తనకు అలాంటప్పుడు. నాన్నే బ్రతికుంటే ఏ

కష్టాలూ ఉండేవికావు. వాళ్లపంచనా, వీళ్లపంచనా పడుండాల్సి వచ్చింది ఏ ఆధారమూలేక.

అయినా ఒకళ్లనడిగేదేంటి? ప్రక్కనే హైస్కూల్ ఉన్న ఊరికెళ్ళి, ఫస్ట్ ఫారంలో ఎలా చేరాలో వివరాలు కనుక్కుంటాను అని ధృఢంగా అనుకున్నాడు రాము.

రాత్రి రెండు ఝాములయినట్లుంది. అమ్మా! ఊర్లోకొచ్చేశాం అబ్బ! రాను, పోను పదిహేనుమైళ్ళ నడక, కాళ్ళు గుంజుతున్నాయి. వెళ్ళి అన్నం తిని, అమ్మ దగ్గర వెచ్చగా పడుకోవాలి.

ఒక్క పరుగున వెళ్లి తలుపుకొట్టబోయాడు. రెక్కపట్టుకుని, యీడ్చుకు పోయింది వెంకాయమ్మ, ఎదురుగా ఉన్న ఆవిడ యింట్లోకి. వెళ్తూ తమ యింటి వేపు చూశాడు, తలుపు ఓరగా తెరుచుకుంది. తెల్లటి బట్టలు వేసుకున్న ఓ పురుషాకారం నాలుగిళ్ల అవతల ఉన్న కరణం యింటివేపు వేగంగా పోవటం కళ్ల పడింది. ఆ చిన్న మనసుకేదో అర్థమయినట్లయి, జుగుప్సతో మనసంతా నిండి పోయింది. నిద్రపట్టలేదిక.

ఫస్ట్ ఫారంలో చేర్పించే వివరాలడగాలనే వంకతో తనను ఊరు దాటించింది ఎందుకో కూడా లీలగా బోధపడింది రాముకు.

"శిస్తు" గురించిన ప్రస్తావన వెంకాయమ్మ అమ్మ దగ్గఱ ఎప్పుడూ ఎత్తగా మరి వినలేదు రాము.

( గుంటూరు ఎక్స్‌ప్రెస్ తేది. 6-1-'84 శుక్రవారము )

❀ ❀ ❀

# బుజ్జి

''బుజ్జి వచ్చిందా !" ఆదుర్దాగా అడిగాను మా ఆవిడను ఆఫీసునుండి వస్తూనే.

"ఈ రోజూ రాలేదండీ'' దీనంగా జవాబిచ్చిందావిడ. ఉసూరుమంటూ కుర్చీలో కూలబడ్డాను.

ఎటు పోయిందో ఏవిటో పిచ్చిముండ ! ఎవరైనా ఎత్తుకెళ్ళిపోయారో ! ఏమో ! తినటానికని, ముదనష్టపు వెధవలు. అయినా యిదే దొరికిందా తినటానికి. ముద్దొస్తూ ముద్దొస్తూ మురిపెంగా ఉండే వాటినెలా తింటారో! దరిద్రం – ఇట్లాంటి పన్లు చేస్తారు కాబట్టే వెధవలకు జన్మంతా బీదరికమే పిల్లుల్నెత్తుకుపోయి తినేవాళ్ళ గురించి గొణుగుతూనే ఉన్నదామె.

✽✽✽

అసలు మా యింటికి బుజ్జి ప్రవేశమెలా జరిగిందంటే—

నేను ఆఫీసునుండి వస్తున్నానొకరోజు.

బుజ్జి పిల్లి పిల్లను కొందరు కుర్రాళ్ళు ఎటుపోతే అటు తరుముతున్నారు.

అది దిక్కుతోచక పరుగెడుతున్నది అటూ, యిటూ. పెద్ద కుక్క ఒకటి దానిని పీకటానికి ఎగబడి వస్తున్నది.

అదంతా చూస్తున్న నేను గబుక్కున ఆ పిల్లి పిల్లను ఎత్తుకున్నాను. లేకుంటే కుక్కవాతపడిపోయేదే అది.

దాన్ని యింటికి తెచ్చి డాబాపై వదిలిపెట్టాను.

మా ఆవిడ ఏ పనిలో ఉందో చూడలేదు.

నేనిలా యింటికొచ్చానో లేదో వర్షం పడటం మొదలైంది.

డాబా పైకెళ్ళాను. అది వర్షంలో తడిసిపోతుందేమో ? తెద్దామని.

అది నాకంటే ముందే ఛెంగు ఛెంగున క్రిందికిదూకి వచ్చి మంచం క్రింద దూరింది.

మా ఆవిడ చూడనే చూసింది.

"పిల్లులంటే నాకు ఎలర్జి. ముందు దాన్ని బయటపడేయకపోతే నేనూరుకోనని'' చిందులు త్రొక్కిందావిడ.

మంచం క్రిందకు చీపురుకట్ట చూపించి, బెదిరించి తోలింది. వర్షంలో తడిసిపోతూ....అరుస్తోందది పాపం!

"అదేమంటుందని, బెదురుగొడ్డులా అట్లా చేస్తావ్‌దాన్ని" అంటూ కోప్పడ్డాను

ఆవిడ కసరటం, అయినా అది యింట్లోకి వస్తూ ఉండటం కొన్ని రోజులు గడిచిందా తతంగం.

కాల క్రమేణా మా ఆవిడకు కూడా మచ్చికై పోయిందది.

"బుజ్జి....బుల్లి...." అంటూ ముద్దుగా పిలుస్తుండేది దాన్ని ఆవిడ

అది ఎంత దూరంలో ఉన్నా ఆమె బుజ్జీ అని పిలవగానే మ్యావ్.... మియావ్ అంటూ గెంతుతూ వచ్చి, ఆవిడ కాళ్ళకు చుట్టుకుని తిరుగుతుండేది.

ఎలుకలకోసం బయటకెళ్తే ఏ కుక్కలైనా పీకుతాయేమోనని మాంసం కొనుక్కొచ్చి పెడుతుండేవాడిని. ఉదయం మాంసం, సాయంత్రం వేయించిన చేపల ముక్కలుతెచ్చేవాడిని. "బ్రాహ్మణులం యిదేం ఖర్మండీ! అని ముందు విసుక్కున్నా ఆ తర్వాత వేయించిన చేప ముక్కల్లోని ముళ్ళన్నీ తీసి, శుభ్రంగా పొడిగాచేసి, నలిపి పెట్టేది దానికి మా ఆవిడ.

అదీ ముద్దుగా చిన్నపిల్లలా మారాం చేసేది.

కుర్చీలలో, మంచంమీదా, దానిష్టమొచ్చినచోట హాయిగా పడుకునేది.

దోమతెర కడితే, అందులో దూరి తనొక్కతే పొడవుగా, మంచం మధ్యలో పడుకునేది.

దాన్ని లేపటం యిష్టంలేక చలిగా ఉన్నాసరే మేమిద్దరం దోమలు కుడుతున్నా భరించి, కింద పడుకునేవాళ్లం.

❀ ❀ ❀

కాస్త పెద్దదయింది బుజ్జి. స్నేహాలు ఎక్కువయ్యాయి దానికి.

సాటి పిల్లులతో కలిసి ఎటో వెళ్ళిపోతుండేది.

ఆడ పిల్లులకోసమో ఏమో వెతుకుతూ వెళ్ళి, ఒక్కోసారి ఐదారు రోజులు రావటం మానేసేది.

మా ఆవిడ మరీ దిగులుపడి పోతుండేది అలాంటప్పుడు.

ప్రతి డాబామీదకూ, గోడలవేపూ కళ్ళు చికిలించుకుని చూస్తుండేది కన్పిస్తుందేమోనని.

"అయ్యో! ఎలుకలకోసం కూర్చుని, ఏ డ్రయినేజ్ గోతిలోనో పడిపోయి ఉంటుందేమో" అని బాధపడేది.

పిల్ల వెధవలూరుకోరు గదా! రాళ్ళతో కొట్టటం, తరమటం చేస్తుంటారు పిల్లుల్ని.

పెద్దవాళ్ళు వారించరు అలాంటి పిల్లల చేష్టలను. పైగా వాళ్ళే, పిల్లులంటే పులులో, సింహాలో, దయ్యాలో, భూతాలో అన్నట్లు చిన్నప్పటినుంచి పిల్లలలో ఒక విధమైన భయాన్ని కల్గిస్తుంటారు.

అందుకే పిల్లలు వాటిని కొట్టి, తరిమి, అవి అటూ, యిటూ పరుగెత్తుతుంటే చూసి పైశాచిక ఆనందాన్ని పొందుతుంటారు.

మూగ జీవాలపట్ల అలా అలా వాళ్ళలో క్రూరభావం పెంపొందుతుంటుంది వయసు పైబడేకొలది.

అన్నం మిగిలిపోయినప్పుడు కాస్త పెరుగులోనో, మజ్జిగలోనో ఉప్పు వేసి కలిపిపెడితే చక్కగా తినిపోతాయి పిల్లులు.

అలా వాటిపట్ల జాలి ప్రదర్శించి, మనకున్నంతలో వాటికి కొద్దిగా అన్నమదీ పెడితే అవి దొంగతనంగా కిటికీగుండా దూకి యింట్లో చొరబడి పాలుత్రాగే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయిగదా! అనన్పిస్తుంది నాకు.

పిల్లులుండబట్టే ఎలుకలబారినుండి రక్షించబడుతున్నాం మనం. లేకపోతే దేశమంతా ఎలుకలమయమై దిక్కుతోచక అలమటించిపోతారు జనం.

మనుషుల పురోగతికి సహకరించే మూగజీవులపట్ల జాలిచూపే అనవాయితీ లేదు జనాలకు.

అందుకే మనుషులు జాలిలేకుండా తరిమికొడతారు కాబట్టే అవి ముఖ్యంగా ఆడపిల్లులు పిల్లల్ని తీసుకుని యిళ్ళు మారుస్తుంటాయి.

వాటికి సురక్షిత ప్రదేశం దొరికితే ఎందుకలా చేస్తాయి? ఈ మనుషులవల్ల వాటికి రక్షణలేదు అని నాకు బోలెడు జాలి వాటిమీద.

ఏదో యింత ఎంగిలికూడో, ఏదో తిని జాలిగా యిళ్ళముందు పడుండే కుక్కలంటేనూ, తమ స్వార్థంకోసం క్రూరాత్ములైన మనుషులు, తల్లి దగ్గర పాలు త్రాగనీయకుండా, తిండిపెట్టకుండా నిలువునా ఎండబెట్టితే, ఆకలికి తాళలేక అరచి అరచి చచ్చిపోయే గేదె దూడలంటేనూ....

రేపు జరగబోయే ఫంక్షన్‌కు ముందే తెచ్చి కట్టిపడేసిన మేక దాని చావునూహించుకుంటూ చూసే దీనమైన చూపులూ, అరుపులూ అంటే కూడా గుండెలు అవిసేటంతటి బాధకు గురవుతాను నేను.

❋ ❋

ఒకసారి పది రోజులతర్వాత వచ్చింది "బుజ్జి" ఎక్కడికోవెళ్ళి.

వస్తూనే మా యిద్దరి కాళ్ళవద్ద పడుకుని తన ముందు కాళ్ళు రెండూ మా యిద్దరి కాళ్ళ మీద మార్చి మార్చి వేస్తూ. మూగ చూపులు చూసింది క్షమించమన్నట్టుగానో ఏమో! మరి.

అట్లా మూడు నాలుగుసార్లు ఎటో పోవటం, కొన్నాళ్ళకు రావటం చేస్తుండేది. బాగా చిక్కిపోయి ఉండేది అలాంటప్పుడు.

మిగతా పిల్లులతో కలిసి, సరదాగా ఎటో వెళ్ళిపోయి, మళ్ళీ ఇల్లు వెతుక్కోలేక అట్లా కొన్ని రోజులకు వస్తుందేమో అనుకునేవాడ్ని నేను.

ఎందుకంటే పల్లెటూళ్ళలోలాగా విశాలంగాకాక యిరుకుగా అడ్డదిడ్డంగా ఉంటాయి గదా సిటీలో యిళ్ళు.

దానికిబ్బందవుతుందని యిద్దరం కలసి కనీసం సినిమాకుకూడా వెళ్ళటం మానేశాం.

ఎక్కడికన్నా వెళ్ళాల్సి ఉంటే ఒకళ్లం యింట్లో ఉండి మరొకరం వెళ్ళే వాళ్లం.

మాంసం, చేపలకూ దాని ఖర్చు రోజుకు పదిరూపాయలదాకా అయ్యేది జీతం చాలక చిన్న చిన్న అప్పులుకూడా చేసేవాడ్ని.

ఈ మధ్య బుజ్జి వెళ్లి నెలదాటింది

అది వెళ్ళినరోజు ఉగాది పండుగ.

మడిలో ఉండి దానికి మాంసం తేవటం ఆలస్యమైంది నాకు.

మామూలుగా ఆలస్యమైనా తెచ్చిపెట్టేదాకా నిద్రపోతుండేది.

ఆరోజెందుకో పదే పదే కాళ్ళు పట్టుకున్నది.

సాయంత్రం వెళ్లటమే ఇహ మరి రాలేదు.

దానిమీద చెప్పలేని ప్రేమ మా యిద్దరికి.

పిల్లలుకూడా లేరేమో! ఈ మధ్య అది అసలే రాకపోయేసరికి మా ఆవిడ మరి మంచం పడుతుందేమో అన్నంతగా రోగిష్టిదానిలా తయారయింది.

'పిల్లలు లేకపోతే పిల్లుల్ని పెంచుకో' మనే సామెతను నిజంచేస్తూ, కడుపున పుట్టిన బిడ్డ దేశాలుపట్టిపోతే ఎంత దుఃఖం కలుగుతుందో అంత బాధని మేమిద్దరం అనుభవించాము.

బుజ్జి వెళ్ళిపోయిందనే దిగులుతో వరండాలోనుండి బయటకు చూస్తూ కూర్చున్నాను ఒక సెలవురోజు.

నా కోలీగ్ మోహనమూర్తి మా యింటికి వస్తూ కనిపించాడు.

వస్తూనే "ఏమిటోయ్ అంత డల్‌గా ఉన్నావు?" అంటూ పలకరించాడు.

బుజ్జి సంగతి చెప్పాను. మనసులో బాధ ఒకరితో చెప్పుకుంటే పొందే ఉపశమనంలాంటిది కలిగింది.

వింటూనే పకపకా నవ్వాడు.

''ఓయ్ నీ పిచ్చిగూలా! పిల్లి పోయిందని జీవితమే ఐపోయినట్లు దిగులు పడేవాళ్ళను నిన్నే చూస్తున్నాను. దానికి మీ యింట్లో అంతవరకే ఋణమున్నది పోయింది అంతే.'' అని తేల్చిపారేశాడు

నాకు చటుక్కున ఒక విషయం తట్టింది.

''అయితే మూర్తి! అలా 'కర్మ' సిద్ధాంతాన్ని అన్నింటికి వర్తింపచేసుకోరెందుకోయ్ మనుషులు యాక్సిడెంట్‌లో పోతేనూ, ఆత్మహత్యలు చేసుకుంటేనూ, హత్యకావింపబడతేనూ, రేప్‌కు గురికాబడతేనూ అలా జరగాల్సుంది కాబట్టి జరిగిందని అనుకోరేం మరి! వాటి గురించి ఎంక్వైరీలు, అరెస్టులు ఎన్నో చేయిస్తారు గదా! అట్లా అనుకోకపోబట్టే 'బుజ్జి' గురించి నేను అంతులేని దిగులుపడుతున్నాను" అన్నాను బాధగా.

"సరేలే ఎవరి పిచ్చి వారికానందం. పిచ్చి ముదిరింది....తలకు రోకలి చుట్టమన్నట్లుంది నీ వ్యవహారం. కాస్త మార్పుగా ఉంటుంది. అలా తిరిగి వద్దాం పద" అంటూ బలవంతంగా బయటకు తీసికెళ్ళాడు మూర్తి.

కాలచక్రంలో మూడు నెలలు గడిచిపోయాయి.

బుజ్జిని అంత ప్రేమగా చూసినా అది వెళ్ళిపోవటానికి ఒక కారణం ఉందనిపించింది నాకు.

ఒక్కో వీధిలో ఒక్కో గండు పిల్లే ఉండి, ఆ ఒక్కతే ఆ వీధిలో ఉండే ఆడ పిల్లుల్తో జత కట్టాలని రూలేమో! ఐదారు యిళ్ళ అవతల ఉండే గండుపిల్లి

(యీ బుజ్జి తండ్రే) బుజ్జిని చిన్నగా ఉన్నప్పుడు మూతులు నాకి ముద్దుపెట్టుకుని ప్రేమగా చూసేది. పెద్దదయిన "బుజ్జి" (వాటిల్లోఎదుగుదల చాలా త్వరగా జరిగిపోతుంది) తన తోటి ఆడపిల్లులతో జతకట్టటం గమనించిన గండుపిల్లి బుజ్జి రాత్రిపూట షికారు కెళ్ళినపుడు చావగొట్టేది. మేమెంత తరిమినా వాటిని విడదీయటం మావల్ల అయ్యేదికాదు.

ఇలా అది వెళ్తుందనగా యీ గండుపిల్లి పగలుకూడా బుజ్జిని చావగొడుతుండేది, అది బయటకు వెళ్తే.

అందువల్లకూడా అదెటో వెళ్ళిపోయిందనిపించింది నాకు.

నేను గమనించిన మరో విషయం పిల్లులలో వరసావావిలు ఉండవు. అన్న చెల్లెలితో, తండ్రి కూతురితో యిలా జతకడతాయి. ఆ ఋతు సమయంలో ఆడపిల్లి రెండు, మూడు గండుపిల్లులతో తిరుగుతుంది. ఆ యీర్ష్యవల్ల గండుపిల్లులు బొచ్చంతా పీక్కుని రక్తం కారేలా ఉన్నుకుంటాయి. ఆడపిల్లి మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు చూస్తుండిపోతుంది.

పిల్లి మసలిన ఇల్లు కదా! అవి వాసన ద్వారా అన్నీ గ్రహించగలవు కాబట్టి మా యింటికి కొన్ని పిల్లులు వస్తూపోతుండేవి, ముఖ్యంగా రాత్రులప్పుడు. వాటికి వినికిడి శక్తి అపారమే.

అన్నం, పెరుగు కలిపిపెడితే ఏవో తినిపోతుండేవి, అంతేగాని, దొంగతనంగా పాలు త్రాగటమూ, పెరుగు తినటమూ చేసేవికావు. "బుజ్జీ" అంతే. పెడితే తప్ప ఎదురుగా ఉన్నా ఎగబడేదికాదు.

మాంసం, చేపల ఖర్చు లేదిప్పుడు, అయినా బుజ్జిలేని లోటు మాకు అత్యంత బాధాకరమే.

ఆ రోజు ఎందుకో బాగా వర్షంగా ఉన్నది.

ఒక తెల్ల పిల్లి బొద్దుగా, అందంగా ఉన్నది. రెండు చిన్నపిల్లుల్ని తీసుకుని మా యింటికి వచ్చింది లోపలకు పిలిస్తే తప్ప రాలేదది.

బుజ్జిగా, ముద్దుగా ఉన్నాయని మా ఆవిడ యింట్లోకి తెచ్చింది వాటిని.

"మాంసం అలవాటు వీటికి చెయ్యొద్దు అప్పులపాలవుతాం'' అని ఆవిడ ఎంత మొత్తుకున్నా వినకుండా, మళ్ళీ తెచ్చి పెట్టటం మొదలెట్టాను నేను.

తల్లి పిల్లి వాటికి రోజూ ఎలుకలను తెచ్చి యిచ్చేది అది తినకపోతే వాటి భాషలో కోప్పడేది అది. అది తిని, ఈ మాంసం తిని, వాటికి పడకనో ఏమో కక్కటం, యిల్లంతా ఏరగటం చేసేవి.

ఒక్కోరోజు తెల్లవారేసరికి మంచం క్రింద అంతా ఏరుగుళ్ళుండేవి. ఇల్లంతా కంపు లేచిపోయేది.

వానల రోజులు పొడి మట్టి దొరకటం దుర్లభం కదా!

ఇనుప బొచ్చెల్లలో మట్టిబోసి, మూలల్లో పెడితే, వాటిల్లో దొడ్డికి కూర్చునేవి ఆ పిల్లి పిల్లలు రెండూ. పెద్ద పిల్లి ఎటూ బయటకెళ్ళుతుంది.

ఇల్లంతా తుడిచీ, తుడిచీ ఎప్పుడూ తడి, లసలస, ఇల్లంతా ఏరుగుళ్ళు అదంతా తుడవలేక మా ఆవిడ నన్ను తిట్టిపోసేది మాంసం తెచ్చిపెట్టొద్దని.

"అలవాటయిం తర్వాత అవి ఊరుకుంటాయా! పీక్కుతినవూ తెచ్చిపెట్ట మని" అని కసిరేవాడిని నేనావిడను.

"మీ మూర్ఖత్వం మీదే కాని, ఎదుటి మనిషిని అర్ధంచేసుకోరు గదా" అంటూ విసుక్కునేదావిడ.

ఆ పిల్లులేరిగే పెంట వాసనతో, నాలుగు నెలలు సరిగా నిద్రలేక, నరక బాధపడ్డాము.

ఆ పిల్లుల తల్లి మళ్ళీ గర్భిణి.

ఇప్పుడున్న పిల్లలు వుట్టబోయే పిల్లలకు ఎక్కడ అడ్డువస్తాయోనని, ఆ తల్లి వాటిని దగ్గఱకు రానీయకుండా "బుస" కొట్టేది, ఎక్కడైనా వెళ్ళిపొమ్మనే సూచనగా.

అంతవరకూ కడుపులో పెట్టుకుని, పాలిచ్చి, కంటికి రెప్పలా చూసిన తల్లి అట్లా దరి చేరనివ్వకపోయేసరికి పిల్లికూనలు బిక్కమొహాలేసుకుని, చూస్తుండేవి దీనంగా తల్లివేపు.

నా గుండె తరుక్కుపోయేది అదంతా చూస్తుంటే

"మీ దొట్టి ఆడమనసని" కోప్పడేది మా ఆవిడ నన్ను.

నెలలు గడిచిపోయాయి "బుజ్జి" ముండ వెళ్ళి. ఈ మధ్య ఒకటే గుర్తొస్తున్నది. అట్లా అని దాన్ని మర్చిపోయిందెప్పుడుగనక.

పిల్లుల పిచ్చి నాకెంతవరకు పోయిందంటే పత్రికలలో వాటి గురించి ఏది వ్రాసి ఉన్నా చదివేవాడిని అత్యంతోత్సాహంతో. నా ఆత్మీయుల గురించిన సమాచారం చదివానన్న సంతృప్తిని పొందేవాడిని.

ఏ పిల్లిని చూసినా "బుజ్జి" తలంపుకు వచ్చి నా సంబంధీకులను చూసినంత ఆనందం పొందేవాడిని.

ఒకరోజు యిప్పుడున్న పెద్దపిల్లి, దానికి కొద్దిదూరంలో రెండు పిల్లి పిల్లలూ గడపలో కూర్చుని ఉన్నాయి.

పెద్ద పిల్లెందుకో ఎదురింటి గోడపైకి చూస్తూ.... ''ఊఁ" అంటూ మూలుగుతోంది.

"మ్యావ్" అనే మాటను వివిధ సందర్భాలలో రకరకాలుగా భావాన్ని వ్యక్తం చేస్తాయ్ పిల్లులు.

"ఏమున్నదా అక్కడ" అని అటు చూస్తూ భ్రమాస్పడిపోయాను.

అక్కడ ఉన్నదెవరోకాదు మా బుజ్జి. బంగారు రంగులో ఉన్న మా బుజ్జి బుల్లి.

పిలిస్తే వచ్చేదే!

వస్తే అదీ, ఇదీ కొట్టుకుంటాయి. గోలవుతుంది.

అదొచ్చిందని పిటిని వెళ్ళగొట్టలేము. అది వెళ్ళినప్పటినుంచీ యివి బాగా అలవాటయ్యాయి మాకు.

మా ఆవిడ చూడలేదు బుజ్జినిప్పుడు. చూస్తే పిలిచేదే. అదంటే ఆవిడకమిత మైన ప్రేమ.

ఆవిడ దొడ్లో అవతలింటావిడతో మాట్లాడుతోంది.

నేను బుజ్జినే చూస్తున్నాను

అదీ నన్ను చూస్తున్నది.

ఐదు నిమిషాలు గడిచాయి.

ఏమనుకుందో ఏమో లేచింది బుజ్జి

ఒక్కసారి నావేపు పిల్లలవేపూ జూసింది.

ఎందుకో నాకు గుండె బరువెక్కినట్లయింది, దాని చూపులు చూస్తుంటే.

వెనక్కి తిరిగి చూడకుండా గోడమీద నడుస్తూ వెళ్ళిపోయింది గమ్యం తెలియని బాటసారిలా.

నాకు దుఃఖమాగిందికాదు.

మగాణ్ణనే విషయం మరచి వెక్కి వెక్కి, కదలి కదలి ఏడ్చాను.

కొన్నేళ్ళు కాలగర్భంలో కలసిపోయాయి. కాని మా "బుజ్జి" ని మాత్రం మళ్ళీ మేము చూడలేకపోయాము.

శ్రీమతి శ్రీగిరిరాజు విజయలక్ష్మి

( 13-19 డిసెంబరు, '85 ఆంధ్రసచిత్రవారపత్రిక )

# ఓ ఇంటి కథ

మనిషెత్తు లోతు తవ్వి, పైన ఐదడుగుల ఎత్తులో లేపిన గనెట్ రాళ్ళ కట్టడం పూర్తయింది పిల్లర్లతో పనిలేకుండా. అంత పెద్ద గొయ్యి నింపడానికి చాలా మట్టి అవసరమైంది

"ఈ పనంతా ఒక ఎత్తు. క్యూరింగ్ వేయడం మరో ఎత్తూనండయ్యా. మా పోరగాడ్ని పెట్టుకుంటే సరి. రోజుకు 12 రూపాయిలియ్యాల్సొస్తది" అన్నాడు మేస్త్రీ కొండయ్య శ్రీహరిరావుతో.

"రోజుకు పన్నెండా! ఒట్టిగా నీళ్ళు కొట్టటానికి" ఆశ్చర్యంగా అన్నాడు శ్రీహరిరావు.

''మేం కొడతాంలే నాయనా నీళ్ళు. ఓ వారం పదిరోజులేకదా!'' ఒకే సారిగా అన్నారు అక్కడే ఉన్న శ్రీహరిరావు తల్లీ దండ్రీ.

"మీ వల్లేమవుద్దమ్మా ముసలాళ్ళు పాపం! పెద్ద బిల్డింగ్ కట్టబోతూ వంద రూపాయలకాడ చూసుకుంటారా ఎవరైనా" అన్నాడు కొండయ్య నిష్ఠూరంగా.

''కాదులే కొండయ్యా! వంద మిగిలినా మిగిలినట్లే కదా! పెద్ద ఖర్చులో వున్నాడు పిల్లాడు'' అన్నారా వృద్ధ దంపతులు.

''సరే మీ యిష్టం" అనెళ్ళిపోయాడు కొండయ్య.

మేస్త్రీ కొండయ్యన్నా మీవల్లేమవుతుందన్నాడు కానీ, కొడుకు శ్రీహరిరావు మాత్రం మాటవరసకయినా వద్దనలేదు.

బావిలో నుండి ముసలాయన చేతులొణుక్కుంటూ నీళ్ళు తోడుతుంటే, పడుతూ లేస్తూ నడుములు గుంజుతున్నా మోకాళ్ళు పట్టుకుపోతున్నా లెక్కచేయకుండా ఫౌండేషనంతటినీ అరంగారంగా నీటితో తడుపుతుండేది సీతమ్మ.

అదొచ్చిందని వీటిని వెళ్ళగొట్టలేము. అది వెళ్ళినప్పటినుంచీ యివి బాగా అలవాటయ్యాయి మాకు.

మా ఆవిడ చూడలేదు బుజ్జినిప్పుడు. చూస్తే పిలిచేదే. అదంటే ఆవిడకమితమైన ప్రేమ.

ఆవిడ దొడ్లో అవతలింటావిడతో మాట్లాడుతోంది.

నేను బుజ్జినే చూస్తున్నాను

అదీ నన్ను చూస్తున్నది.

ఐదు నిమిషాలు గడిచాయి.

ఏమనుకుందో ఏమో లేచింది బుజ్జి

ఒక్కసారి నావేపు పిల్లలవేపూ జూసింది.

ఎందుకో నాకు గుండె బరువెక్కినట్లయింది, దాని చూపులు చూస్తుంటే.

వెనక్కి తిరిగి చూడకుండా గోడమీద నడుస్తూ వెళ్ళిపోయింది గమ్యం తెలియని బాటసారిలా.

నాకు దుఃఖమాగిందికాదు.

మగాణ్ణనే విషయం మరచి వెక్కి వెక్కి, కదలి కదలి ఏడ్చాను.

కొన్నేళ్ళు కాలగర్భంలో కలసిపోయాయి. కాని మా "బుజ్జి" ని మాత్రం మళ్ళీ మేము చూడలేకపోయాము.

శ్రీమతి శ్రీగిరిరాజు విజయలక్ష్మి

( 13-19 డిసెంబరు, '85 ఆంధ్రసచిత్రవారపత్రిక )

( [illegible]
[illegible]
స్వీకరింపబడినది)

# ఓ ఇంటి కథ

మనిషెత్తు లోతు తవ్వి, పైన ఐదడుగుల ఎత్తులో లేపిన గనెట్ రాళ్ళ కట్టడం పూర్తయింది పిల్లర్లతో పనిలేకుండా. అంత పెద్ద గొయ్యి నింపడానికి చాలా మట్టి అవసరమైంది

"ఈ పనంతా ఒక ఎత్తు. క్యూరింగ్ వేయడం మరోఎత్తూనండయ్యా. మా పోరగాడ్ని పెట్టుకుంటే సరి. రోజుకు 12 రూపాయిలియ్యాల్సొస్తది" అన్నాడు మేస్త్రీ కొండయ్య శ్రీహరిరావుతో.

"రోజుకు పన్నెండా! ఒట్టిగా నీళ్ళు కొట్టటానికి" ఆశ్చర్యంగా అన్నాడు శ్రీహరిరావు.

''మేం కొడతాంలే నాయనా నీళ్ళు. ఓ వారం పదిరోజులేకదా!'' ఒకే సారిగా అన్నారు అక్కడే ఉన్న శ్రీహరిరావు తల్లీ దండ్రీ.

"మీ వల్లేమవుద్దమ్మా ముసలాళ్ళు పాపం! పెద్ద బిల్డింగ్ కట్టబోతూ వంద రూపాయలకాడ చూసుకుంటారా ఎవరైనా" అన్నాడు కొండయ్య నిష్ఠూరంగా.

''కాదులే కొండయ్యా! వంద మిగిలినా మిగిలినట్లే కదా! పెద్ద ఖర్చులో వున్నాడు పిల్లాడు'' అన్నారా వృద్ధ దంపతులు.

''సరే మీ యిష్టం" అనెళ్ళిపోయాడు కొండయ్య.

మేస్త్రీ కొండయ్యన్నా మీవల్లేమవుతుందన్నాడు కానీ, కొడుకు శ్రీహరిరావు మాత్రం మాటవరసకయినా వద్దనలేదు.

బావిలో నుండి ముసలాయన చేతులొణుక్కుంటూ నీళ్ళు తోడుతుంటే, పడుతూ లేస్తూ నడుములు గుంజుతున్నా మోకాళ్ళు పట్టుకుపోతున్నా లెక్కచేయ కుండా ఫౌండేషనంతటినీ ఆరంగారంగా నీటితో తడుపుతుండేది సీతమ్మ.

ఇల్లు లింటల్ లెవెల్ కొచ్చింది. ఆ తర్వాత స్లాబ్ వేశారు. చెక్క విప్పిన తర్వాత రెండు కోటింగ్‌ల ప్లాస్టరింగు, తర్వాత ఫ్లోరింగు, కరెంటు ఫిట్టింగ్స్, వాటర్ కనెక్షన్లూ, బోర్‌వెల్ వేయించడం, మోటారు బిగించడం....ఒకటేమిటి అన్నీ చకచకా అయిపోయాయి. ఇల్లు అన్ని హంగులతో పూర్తయి అందంగా తయారైంది. త్వరగా పనవుతుందని కూలీలతోపాటు మాల్ అందించడం దగ్గర నుంచీ ప్లాస్టరింగు అయింతర్వాత, రంగులు వేసిం తర్వాత గోడలకు నీళ్ళు కొట్టడం లాంటి పనులన్నీ చేశారు శ్రీహరిరావు తల్లీ దండ్రి.

"ఎందుకమ్మా ఈ వయసులో మీకీ కష్టాలు చూస్తూ కూర్చోక" అనేవాడు కాదు శ్రీహరిరావు.

ఎవరూ దగ్గరలేకపోతే పనివారు సరిగా చేయరని ఎండకెండుతూ కూర్చుని పన్లు చేయించారు ఆ ముసలివాళ్ళిద్దరూ ఓపికలేకపోయినా.

ఒక మంచి ముహూర్తాన మాఘమాసంలో గృహప్రవేశమయ్యారు శ్రీహరిరావు దంపతులు, సత్యనారాయణస్వామి వ్రతం జరుపుకున్నారు. అత్తమామలకు, బావ మరుదులకు, భార్య తరపు వారందరికీ ఘనంగా బట్టలు పెట్టాడు శ్రీహరిరావు.

తన కొడుకు, కోడలు, మనుమలూ, మనుమరాండ్రు చల్లగా, హాయిగా వుంటే చాలనుకున్న ఆ పిచ్చి వృద్ధ దంపతులు కొడుకు వాళ్ళందరి ముందూ తమను పట్టించుకోకపోయినా బాధపడలేదు. పనివాళ్ళకంటే హీనంగా బట్టలు కట్టుకున్న వాళ్ళిద్దరూ తెరవెనుక వంటపన్లూ, కడుగుడు పన్లులాంటివాటిలో తల మునకలై పోతున్నారు. అతిథులంతా భోజనాలైంతర్వాత వెళ్ళిపోయారు. ముఖ్యులే వున్నారు. కాస్త నడుం వాలుద్దామని, వరండాలోవున్న మెత్తని సోఫాపై కూర్చోబోయింది శ్రీహరిరావు తల్లి సీతమ్మ.

"అయ్యయ్యో! అక్కడ పడుకోకే....మాసిపోతుందది. బోల్డు డబ్బుపెట్టి కొన్నది మరి" గాభరాగా అన్నాడు శ్రీహరిరావు ఆఫీస్ కొలీగ్స్ ముందు. ఎందుకో మనసు చివుక్కుమన్నది సీతమ్మకు.

ఆ రోజునుంచే తల్లినీ, తండ్రినీ చీటికి మాటికీ కసురుకునేవాడు శ్రీహరిరావు. వాళ్ళు నడిస్తే ఖరీదైన ఫ్లోరింగు మాసిపోతుందని తిట్టేవాడు. కొడుకే గౌరవించక పోతే కోడలసలు లెక్కచేస్తుందా? ఆవిడా సాధించేది సందు దొరికితే. ఇంటికొచ్చిన వాళ్ళకు వీళ్ళు తన తల్లిదండ్రులని చెప్పుకోడానికే సిగ్గుపడేవాడు శ్రీహరిరావు.

అవునుమరి. తాజ్‌మహల్ గురించి చెప్పుకుంటారు గానీ దాన్ని అంత అందంగా మలచిన కార్మికుల గురించి ఎవరైనా అనుకుంటున్నారా? తన అందమైన ఇంటికోసం వాళ్లెంత శ్రమించారో ఇప్పుడు శ్రీహరిరావుకు అనవసరం.

ఇల్లు కట్టబోయే ముందు సిమెంటు, ఇనుప సామాన్లు, చెక్కలూ పెట్టుకోవ డానికి ఒక రేకుల గది వేశారు. దాంట్లోకి బలవంతంగా నెట్టాడు తల్లినీ, తండ్రినీ శ్రీహరిరావు వాళ్ళుంటే ఇంటి అందం చెడిపోతుందంటూ.

ఇల్లు కట్టేటప్పుడు పడ్డ శ్రమకు సరైన వైద్యంలేక బలమైన ఆహారంలేక, ఆదీ వేళకులేక కదలలేని స్థితికొచ్చారు వాళ్ళు. కొడుకు నిరాదరణ మరింత క్రుంగ దీసింది వాళ్ళనక్కడనుంచి కూడా వెళ్ళగొట్టాలని ఈ ఇల్లే అమ్మాలనుకుంటు న్నానని బెదిరించేవాడు వాళ్ళని. పస్తులతో ఎముకల గూళ్ళలా తయారయ్యారు వాళ్ళు.

"మనిద్దరం ఎటైనా వెళ్ళిపోదామండీ! ఏ అనాథ శరణాలయంలోనో చేరి పోదాం" అన్నదొకరోజు ప్రాణం విసిగిపోయిన సీతమ్మ భర్త పరంధామయ్యతో.

"ఇదేమైనా సినిమానా గమ్యం తెలియని బాటసారుల్లా దూర తీరాలకు సాగి పోవడానికి? ఇది జీవితమే పిచ్చిదానా! పండుటాకుల్లాంటి మనం ఏ క్షణాన రాలిపోతామో మనకే తెలియదు. అనాథ వృద్ధుల శరణాలయంలో చేరిపోవడం అంత సులభమనుకున్నావా? చేరి మనవాడి పరువుతీయడం భావ్యమా? చెప్పు. మన జీవితాలిలా గడిచిపోవల్సిందే వాడెట్లా ఆడిస్తే అట్లా.... ఈ బ్రతుకులింతే ఇహ...." నిస్సహాయంగా అంటూ ఎండిపోయిన పుల్లలాంటి కుడిచేయి చాచి ఎముకల గూడు లాంటి సీతమ్మను ఓదార్పుగా దగ్గరకు తీసుకున్నాడు పరంధామయ్య.

( న్యూఏజెన్సీ కథల పోటీలో 150 రూపాయలు బహుమతిగా అందుకున్న కథ )

( ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక తేది. 8-12-89 )

# బొమ్మా–బొరుసూ

"కామాక్షమ్మొదినా! అయ్యవారు ఎంత మంచివారూ....మా అమ్మాయి తెలుగులో పూర్ అని ట్యూషన్ పెట్టించాం కదా! నెలయింది. జీతమివ్వక పోతే మర్యాదగా ఉండదని మా పెద్దపిల్లతోనే పంపించానమ్మా. 'ఆ....ఎందుకు? వద్దులే....వుంచండి" అంటూ తిప్పి పంపాడు మారాజు...." వింతగా చెప్పింది రాజేశ్వరమ్మ పక్కింటి కామాక్షమ్మతో.

"ఆయనగారి భార్య మాత్రం మిర్రి మిర్రిగా చూసిందట మా అమ్మాయివేపు" మళ్ళీ తనే అన్నది రాజేశ్వరమ్మ

"మొగుడు డబ్బులు తీసుకోలేదని అయుంటుందిలే ఆ చూపు. ఉద్యోగం వెలగబెడుతోందిగా, మళ్ళీ మొగుడి సంపాదనెందుకు? ఓ పిల్లా....పీచా....ఏమన్నానా....ఏం ఖర్చులుంటాయ్ గనుక" మూతి మూడు వంకర్లు తిప్పుతూ అన్నది కామాక్షమ్మ. జీతం, గీతం అన్నీ మొగుడ్ని తన్ని లాక్కునే రకం ఈ కామాక్షమ్మ ఊళ్ళో వాళ్ళకో రూలు తనొక్కర్తికే ప్రత్యేక రూలు అనుకునే తత్వం ఆవిడది.

తెలుగు టీచర్‌గా ఉద్యోగంకాక, ట్యూషన్లు చెబుతాడు త్రిపురాంతకశర్మగారు.
"ఆయనకేమండీ! దేముడు—వంచిన తల ఎత్తడు. ఆడవాళ్ళను చూస్తే మరీనూ....'' నోరు గంపలాగా తెరచి, మెచ్చుకోలుగా అన్నాడు ఆ వీధిలోనే వుండే చిన్నారావు–మాష్టారి గురించి.

"అవునండీ! మొన్నటికి మొన్న మా ఆవిడ యాభై రూపాయలివ్వబోతే, "వద్దు వద్దంటూ" ఇరవై రూపాయలే తీసుకున్నాడు. పాపం! ఎంత మంచి వారో మాష్టరుగారు...." లొట్టలేస్తూ చెప్పాడు లోకేశ్వరరావు.

"ఆయనకేమండీ! వాళ్ళావిడ కూడా సంపాదిస్తోంది. మనమిచ్చే ట్యూషన్ రాళ్ళు (డబ్బులు) ఒక లెక్కా...." అని పొగుడుతూ తన ఐదుగురి పిల్లలకూ ఉచితంగా ట్యూషన్ చెప్పించుకునే ఏర్పాటు చేసుకున్న శరభయ్యగారి ఉవాచ.

"మొన్నటికి మొన్న మా ఇల్లు కడుతున్న మేస్త్రీ భార్యకు అడగ్గానే రెండొందలిచ్చారట. వాళ్ళు మళ్ళీ ఇస్తారో లేదోగాని వేరేవాళ్ళ పనివాళ్ళన్నా ఎంత అభిమానమో! మాష్టారికి" శరభయ్య భార్య వెంకటరత్నమ్మ అన్నది.

ఇలా మాష్టారుంటే బస్తీలోనూ, ఆ బస్తీ వాళ్ళకు తెల్సిన వాళ్ళూ, త్రిపురాంతకశర్మ బంధువులూ–అందరూ ఆయన ఉదార స్వభావాన్ని ప్రశంసించేవారు.

* * *

"ఓ రెండు రూపాయలివ్వండి బస్‌కు" బృహతి అభ్యర్థన.

"మొన్ననేకదే ఇచ్చింది. ఏం చేస్తున్నావే ముండా డబ్బులన్నీ" భర్తగారి దబాయింపు అనాగరిక పద్ధతిలో.

జీతమంతా భర్త చేతిలోపోసి. ఆఫీసుకెళ్ళేటప్పుడు రోజూ అతనిచ్చే చిల్లర కోసం బృహతి పడే అవస్థ వర్ణనాతీతం.

"ఇహనుంచి నేనివ్వను. మన ఎదురింటి మనోహరరావు మీ ఆఫీసే కదా! నీకు రోజూ బస్‌కూ కాఫీకీ కావాల్సిన చిల్లర డబ్బులతనివద్ద తీసుకో నీ జీతం రాగానే ఇచ్చెయ్" అంటూ ఇహ వింత ఆర్డరు పాస్ చేశాడు ఆమె భర్త.

మనసు చంపుకుని మనోహరరావుని డబ్బులడిగేది. తన ఆఫీసులో పన్చేసే ఆ లెండరు సింహాద్రి వాళ్ళింటికి దగ్గర్లోనే వుంటాడు. అతనివద్ద తన భర్త వేలకు వేలు అప్పులు చేస్తుంటే వడ్డీలు కట్టలేకా, అసలు తీర్చలేకా నానా యాతనపడేది బృహతి.

నాటకాల పిచ్చి వుండేది బృహతి భర్తకు. అందులో ఆడవాళ్ళ కరుణా కటాక్షంకోసం జీతం డబ్బులూ, బృహతితో అప్పులు చేయించి తెచ్చిన డబ్బులూ వెదజల్లేవాడు. వీడి ఆడపిచ్చి గమనించి వాళ్ళు మరీ గుంజేవారు తమ హొయలతో

అతన్ని కవ్విస్తూ. ఆడగాలి తగిలితే చాలతనికి ఇంకే ఇతర కార్యక్రమాలు అక్కరలేదు. తలెత్తి ఇరుగు పొరుగు ఆడవాళ్ళను చూడదు. కానీ, దొంగ చూపులు చూసి తృప్తిపడతాడు.

"ఒ సేవ్ చచ్చిందానా, రేపీపాటికి నాకు ఐదువేలు కావాలి. తెచ్చియ్యి లేక పోతే ఇంట్లో బట్టలూ, ఇల్లూ తగలబెట్టి పారేయగలను" అంటూ ఆర్డర్ వేశాడు ఓ రోజు.

ఇలాంటి వేలెన్నో ఇచ్చింది బృహతి. ఆఫీసులోనూ, తన పుట్టింటివారి ద్వారానూ అతనడిగినప్పుడల్లా అప్పులు తెచ్చి యిస్తుండేది అతనికి భయపడి. పెద్ద మొత్తాల్లో వడ్డీలు కట్టలేక చిట్‌లు వేసేది. ఆ చిట్‌లు కట్టలేక మళ్ళీ అప్పులు తేవడం ఇలా కుడితిలో ఎలుకలా సతమతమవుతున్న ఆమెను "నీ జీతమంతా ఏం చేస్తున్నావే మిడిసిపాటు లంజా...." అంటూ వికృతంగా తిడుతూ లెక్కలడిగేవాడు అతను, మగవాడినన్న దురహంకారంతో. తల్లీ, తండ్రీ చిన్నతనంలోనే గతించా రతనికి. అతను పెరిగిన వాతావరణం సరిగాలేక మొండిగా క్రూరంగా తయార య్యాడతను.

"అప్పులిచ్చేవాళ్ళకు" ఆమెపట్ల జాలిలేదు. వాళ్లకు కావల్సింది వడ్డీ. ఆ అప్పులు చేయించటానికి కారకుడైన బృహతి భర్తంటేనే వాళ్ళకు అభిమానం.

"ఎప్పుడూ డబ్బులు తెమ్మని మొగుణ్ణి వేధించుకు తింటోంది కాబోలు. భరించలేక తిడుతుంటాడు ఆ మహానుభావుడు" అని ప్రక్క ప్రక్క ఇళ్ళవాళ్ళు తన గురించి అనుకోవడం విన్నది బృహతి.


ఎవరికి నిజం చెప్పినా నమ్మరని తనలో తనే కుమిలిపోతుంటుంది ఆమె.

"ఏంటి ఆలోచన, ఐదువేల సంగతి ఆలోచించు" అని కర్కశంగా అన్న భర్తను. చూస్తూ-"అదుకు ఆలోచిస్తున్నాను. నీకోసం అప్పులుచేసి అవి తీర్చలేక ఛస్తున్నానని, నా జీవితమంతా ఇలాగే గడిచిపోయేట్టున్నదని. అసలైన భారతనారిని కాబట్టి, సంస్కృత పండితుడు, సంస్కారవంతుడైన మా నాన్న పరువు కాపాడడం

కోసం నిన్నొదిలిపోకుండా, నీ చేత అవమానం భరిస్తూ బూతులు తింటూ పడి వున్నాను. నీవు పెట్టే హింసలు భరిస్తూనూ బయట అందరితో మంచివాడనిపించుకోవడంకోసం ఉచిత సేవలందిస్తున్నావు. నీ ఆడపిచ్చి కనిపెట్టే అందరూ నిన్ను తమ అవసరాలకు వాడుకుంటున్నారు. ఇంట్లో వంటలు కమ్మగావున్నా ఏదో వంకలు పెట్టి తినకుండా, హోటళ్ళపైబడి మేస్తూ అప్పులు కొండంతలుగా చేస్తున్న నిన్ను ఈ రోజుల్లో కూడా ఎవరు భరిస్తారురా....శుంఠా" పైకనలేని పాతివ్రత్యం అడ్డురాగా మనసులోనే తిట్టుకుంది బృహతి.

"ఏం నిన్న చెప్పింది గుర్తుందా! సాయంత్రానికల్లా ఐదువేలు కావాలి. ఎక్కడతెస్తావో నీ యిష్టం. ఎవరి దగ్గర పడుకుంటావో నీ ఇష్టం. నాకు మాత్రం డబ్బు కావాలి. లేకపోతే నా సంగతి తెలుసుగా ఏం చేస్తానో...." అంటూ తలుపులు విసురుగా బాదుతూ చెప్పులేసుకుని బయటకు నడిచాడు, ఊరిమీద బలాదూర్గా తిరగడానికి బయటివారి దృష్టిలో దేముడు, బృహతి పాలిట కాలాంతకుడైన త్రిపురాంతకశర్మ మాష్టారు.

(వనితాజ్యోతి, సెప్టెంబరు, '90)



ఆంధ్రపత్రిక సంక్రాంతి అనుబంధం

# పబ్లిక్ అకౌంట్స్ కమిటి

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ చిదంబరంగారు ఠీవిగా హాలులోకి అడుగు పెట్టారు.

అధికారపక్ష సభ్యులూ, ప్రతిపక్ష సభ్యులూ, మహా గణకులూ, వారి సిబ్బంది, చిన్న పెద్ద సిబ్బంది, చిన్న పెద్ద ఇంజనీర్లవారికి సంబంధించిన క్లరికల్ సిబ్బందీ_అందరూ గౌరవసూచకంగా తమ స్థానాలలోంచి లేచి నిలబడ్డారు.

ఛైర్మన్‌గారు తన సీట్లో ఆసీనులు కాగానే అందరూ ఎవరి సీట్లో వారు గాభరా గాభరాగా కూర్చున్నారు.

అది ఎయిర్ కండిషన్డ్ హాల్ అయినప్పటికీ చెమటలు పడుతున్నాయి, కొందరు ఇంజనీర్లకు ఏ ఉపద్రవం ఎదుర్కోవలసి వస్తుందోనని.

ఇంతలో వేడి వేడి నెస్‌కేఫ్‌లొచ్చాయి. అందరూ సేవించారు.

మిస్ అప్రోప్రియేషన్స్‌కు సంబంధించిన ఆడిట్ పేరాపై చర్చ మొదలైంది.

"కుక్కుటరావు పేట డివిజన్‌లో అగ్ని ప్రమాదం సంభవించి రెండు వేల రూపాయల ప్రభుత్వ ఆస్తికి నష్టం వాటిల్లింది. ఆ ప్రమాదానికి కారకుడైన వాచ్‌మన్ పిచ్చయ్య నుండి ఆ డబ్బు వసూలు చేస్తామన్నారు ఎక్స్‌ప్లనేటరీ నోట్‌లో చేశారా? లేదా?" అని ప్రశ్నించారు ఛైర్మన్‌గారు.

"ఆ రికవరీకి సంబంధించిన చర్యలు తీసుకోవడం జరుగుతోంది" అన్నారు చీఫ్ ఇంజనీరుగారు.

"ఆ వాచ్‌మన్‌కొచ్చే జీతమే వేయి రూపాయలలోపు వుంటుంది సాధారణ రికవరీలు కొన్నుంటాయి. వాటికితోడు యిదొకటా పాపం! ఆ అర్భకుడికి. వాడు మాత్రమేం చేస్తాడు? ఎండాకాలం కనుక ఏ నిప్పురవ్వో ఎగిరొచ్చి ఆ

హట్ పైబడి అది కాలిపోయుంటుంది. ప్లేట్ ఆఫ్ చేస్తేపోలా ఈ అపాయంబును. కోట్లు కోట్లు ప్రభుత్వ ధనం ఎన్నో విధాల దుర్వినియోగమౌతున్న ఈ రోజుల్లో రెండు వేల రూపాయల గురించి ఈ పేరాలేమిటి? కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు. ఇంత స్టాపు కాయితాల ఖర్చు, ప్రతిచిన్న నివేదికకోసం విపరీత కాలాయాపన.... ప్చ్....ఏవిటో! ఈ తతంగాలు" ఆ పేరాలు గీల్ చేసి హెడ్ గుమాస్తా సుబ్బారావు ప్రక్కనున్న మరో క్లర్కు చలపతిరావుతో అన్నాడు.

"రూపాయైనా సరే ప్రభుత్వ లెక్కంటే లెక్కే. కాయితాలమీద అవన్నీ సక్రమంగా జరగాల్సిందే. రూపాయికోసం పది రూపాయిల స్టేషనరీ ఖర్చయినా సరే....ఇహ....కోట్ల విషయమంటారా....మీరన్నట్లు లెక్కలోకి రావుగదా!" సర్వ గర్వంగా అన్నారు చలపతిరావు.

ఆ తర్వాత....

"ఆడిట్ పేరా 4. బుక్‌లో 28వ పేజీ...." ఛైర్మన్‌గారి కంచు కంఠంనుండి ఆ మాటలు వెలువడగానే గబగబా పేజీలు త్రిప్పటం మొదలెట్టారు అధికార్లందరూ.

"దయ్యాల నదివద్ద కట్టిన అనకట్ట కొట్టుకుపోవటానికి కారణాలు చెప్పారు. కానీ అవి అంత సమర్థనీయంగా లేవు" అన్నారు ఛైర్మన్‌గారు చీఫ్ ఇంజనీర్‌గారి వేపు చూస్తూ.

సదరు ఇంజనీరుగారు గొంతుకేదో అడ్డంపడ్డట్లుంటే సవరించుకుని, "మట్టిని పరీక్షచేసే సాంకేతిక విభాగంవారి సూచనల మేరకే అక్కడ అనకట్ట నిర్మాణం జరిగింది. కానీ ఆ మధ్య ఉధృతంగా వచ్చిన వరదలకు అది కొట్టుకుపోయి నష్టం సంభవించింది. దాని రిపేర్స్ కోసం రివైజ్డ్ ఎస్టిమేట్ తయారుచేయబడింది. ఆ పనిని మరొక కాంట్రాక్టర్ కప్పగించడం జరిగింది. అందువల్ల ఆ పనికి ఉద్దేశించిన దానికంటే ఎక్కువ ఖర్చు ఈ విషయంలో అయింది'' అంటూ అతకని స్టేట్ మెంట్ ఒకటి పారేశారు కమిటీ ముందు.

"నాదొక చిన్న డౌటు. సాయిల్ టెస్టింగ్ స్టేజిలోనే రెండు, మూడు ట్రయల్ పిట్స్‌వేసి, పరీక్ష జరపాలికదా! ఆ ఒక్కచోటే చేసి, అక్కడే నిర్మాణం జరపబట్టే గదా! ఆ ఆనకట్టకు అంత మేజర్ రిపేర్స్ అవసరమైంది. వరదలకు తట్టుకోలేకుండా నిర్మిస్తే ప్రభుత్వ ధనం ఎంతగా దుర్వినియోగమవుతుందో మీకర్థం కానీ విషయమా!" బల్ల గుద్దినట్లు పాయింట్ లేవదీశాడు ఉడుకు రక్తపు ప్రతిపక్ష సభ్యుడొకరు.

"మా పరిధులకు కట్టుబడి మేం అవసరమున్నంత వరకే సాయిల్ టెస్ట్ జరిపిస్తాం. వరదలవల్ల అది చాలా భాగం కొట్టుకుపోవడం జరిగి వుండవచ్చు" అన్నారు చీఫ్ ఇంజనీరుగారు. ఆ జవాబు ఆడిట్ వాళ్ళనుగానీ, మెంబర్లనుగానీ అంతగా సంతృప్తిపరిచినట్లులేదు.

"తక్కువ రకపు సిమెంటు వాడకం, ఇసుక పాలెక్కువవటంకూడా ఒక కారణం కదా! ప్రాజెక్టు పనుల్లో ఇవి మామూలేగా...." అరచినట్లన్నాడా ప్రతిపక్ష సభ్యుడు. అతనికి తెలుసు తన ప్రశ్నకు జవాబు సరిగ్గా రాదని, "మా టెక్నికల్ డిఫికల్టీస్ మాకున్నాయంటూ'' మసిపూసి మారేడు కాయ చేస్తారనీను.

"పందులగుంట వాగువద్ద చెరువు తవ్వారు. దానికి వేసిన కరకట్ట కొట్టుకు పోతే చర్యలు తీసుకోవటంలో జాప్యం జరిగి వృథా వ్యయమైందని పేరా 4—6 తెలుపుతోంది. దానిపై ప్రస్తుతం మీరేం చెబుతారు?'' అన్నారు ఛైర్మన్‌గారు తత్సంబంధిత ఇంజనీరుగారితో.

"ముందు అగ్రిమెంటు కుదుర్చుకున్న కంట్రాక్టరు రేట్లు వద్ద గొడవలు తేవడంతో పని సరిగా చేయకపోవడంతో అట్లా జరిగింది. అందుకే ఆ పనిని మరొక ఏజన్సీ కప్పగించడం జరిగింది. ఆ ఏజన్సీ చేసిన అవకతవకలవల్ల అధిక వ్యయమైంది. అవకతవకలకు బాధ్యులైన అధికార్లపై చర్య తీసుకోవటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి'' అంటూ మొహం తుడుచు సమాధానం చెప్పారు ఇంజనీరుగారు.

ఆ పి. ఎ. సి. మీటింగులో అందరి మధ్య హోరాహోరీగా మాటల యుద్ధాలు జరిగాయి. ఎన్నోసార్లు పోస్టుపోనయి, ఎందరెన్నో పరుగులు పెట్టించిన ఆ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ మీటింగ్ అన్ని పేరాలమీద చర్చలు జరిగిన తర్వాత ముగిసింది.

ఈ పి.ఎ.సి మీటింగ్ వ్యవహారం చూడాలని వచ్చిన సుబ్బారావు ఫ్రెండయిన మరో సెక్షనుకు సంబంధించిన హనుమంతరావుకు ఎన్నో సందేహాలొచ్చాయి.

"ఏమిటిరా? ఈ కాకిగోలంతా" అన్నాడు సుబ్బారావుతో.

"అయితే దీని గురించి చెప్తా విను. మొదటగా ఆడిట్‌వారు సంబంధిత ఆఫీసులను ఇన్స్పెక్ట్ చేసి, అబ్జక్షన్స్ రైజ్ చేస్తారు. నెలలు, సంవత్సరాల తరబడి ఆ అబ్జక్షన్స్ ఆఫీసుల్లో జీడిపాకంలా సాగి, కాలవ్యవధి అయిపోయి, ఆడిట్ పేరాగా అవతరిస్తాయి. ఇవన్నీ పుస్తక రూపంలో ముద్రితమై పి. ఎ. సి. మీటింగ్‌లో చర్చకు వస్తాయి. విషయం ఏదున్నా ఏ డిపార్ట్‌మెంటులోనైనా పద్ధతులొకటిగానే వుంటాయి. ఎక్కడికక్కడ వీలున్నంతవరకు సర్దుబాట్లు జరుగుతుంటాయి.

గండివద్ద చెరువుల గురించీ, ఉద్దేశించిన పని ఎస్టిమేటూ, డిజైనింగ్‌ల ఆలస్యం వల్ల సకాలంలో పూర్తికాకపోవడం దానిపై వృథా వ్యయం, సాయిల్ టెస్టింగు లోపాలవల్ల కూలిపోయిన కట్టడాలపై, టెండర్ల పిలుపులోని అక్రమాల గురించీ-యిలా ఎన్నింటిపైనో కమిటీవారు సిఫార్సులు చేస్తారు. కొంతకాలం వాటిపై ఆఫీసుల్లో ఫైళ్ళు నడుస్తాయి. ఈలోగా అవినీతిపరులైన అధికారులు సిబ్బంది తమ పలుకుబడి నుపయోగించి కష్టాలనుండి బయటపడటమో, రిటైర్ అవటమో, కాలం చేయటమో సంభవిస్తుంది.

ఇంజనీర్లకూ, కాంట్రాక్టర్లకూ లాలూచీలు మామూలేకదా! వారికి అమాత్యుల అండదండలూ వుంటాయి నిస్వార్థంగా వీరంతా శ్రమిస్తే ఏ ప్రాజెక్టూ అల్లాయ మ్కురాలు కాదు, వాళ్ళంతా కోట్లానుకోట్ల ఆస్తులూ సంపాదించలేరు.


అయితే ఏ నష్టం జరిగినా, సకాలంలో పంటకు నీరందక నష్టపోయేది రైతు సోదరుడే. ఆ నష్టం ఆర్థిక వ్యయంపై దెబ్బతీస్తుంది ఉత్పత్తి తగ్గటం ద్వారా.

బహుళార్థసాధక ప్రాజెక్టు పనుల్లో అవినీతి, అక్రమాలు యథేచ్ఛగా సాగిపోతుంటే ఇటువంటి కంటి తుడుపు పబ్లిక్ అకౌంట్స్ కమిటీలేమి చేస్తాయి?

ఈ (అ) ప్రజాస్వామిక వ్యవస్థలో దోషులు శిక్షింపబడటం జరుగుతుందా! అనేది చిదంబర రహస్యమే." అంటూ ముగించాడు సుబ్బారావు.

( ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక తేది. 22-8-91 )

( న్యూజెర్సీవారు నిర్వహించిన కథల పోటీలలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ )



# లలిత

కిటికీలోంచి రోడ్‌వైపు చూస్తూ గదిలో కూర్చున్న లలితను ఓ మనోహర దృశ్యం ఆకట్టుకున్నది.

అందంగా ఉన్న భార్యాభర్తలు నడిచి వెళ్ళుతున్నారు ఏ సినిమాకో, మరెక్కడికో. ఆ భార్య చేతిలో పండంటి బాబు కేరింతలు కొడుతున్నాడు. తన సర్వస్వం బాబేనన్నట్లు మురిసిపోతూ చూస్తున్నదామె వాడివైపు. ఇదంతా గర్వంగా చూసుకూంటూ ప్రక్కనే హుందాగా నడుస్తున్నాడు ఆమె భర్త.

"తనకీ జన్మకా అదృష్టం లేదుకదా!'' అని కుమిలి కుమిలి దుఃఖించింది లలిత. మామయ్యవల్ల మలినపడిన తన శరీరాన్ని మరొకరికప్పగించటానికి యిష్టపడని లలిత అవివాహితగానే ఉండిపోయింది.

ఆమె తమ్ముళ్ళు పెళ్ళిళ్ళయి ఉద్యోగరీత్యా వేరే ఊళ్ళలో స్థిరపడిపోయారు. ముసలి తల్లి మాత్రం లలితవద్దే ఉంటున్నది.

ఆమె మామయ్య వేరే కులపు వితంతువుని ప్రేమించి (కాదు కామించి) పెళ్ళి చేసుకున్నాడు, ఆవిడవద్ద తన మోసపు పప్పులు ఉడక్కపోవటంలో.

తనెన్నడూ మర్చిపోలేని గతంలోకొకసారి తొంగిచూసింది లలిత మనసు.

* * *

"లలితా మామయ్య పిలవటంలేదూ యిందాకట్నించి వెళ్ళవేం?'' కసిరింది సుశీల పిండి రుబ్బుకుంటూ లలితను.

''అమ్మో నాకు సిగ్గు నేపోను" గారాబాలుపోతూ అన్నది ఐదేళ్ళ లలిత తల్లి చాటుగా నిలబడి.

మిలటరీ మామయ్యంటే లలితకు విపరీతమైన భయం. మిలటరీలో పనిచేసే సుశీల తమ్ముడు రవి. సంవత్సరానికి ఒకసారి వస్తాడు సెలవులకు. సెలవుల

రెండు నెలలూ యీ అక్కా బావల వద్దే ఎక్కువగా గడుపుతాడు. మిగిలిన అక్కయ్యలకు ఆస్తిపాస్తులెక్కువే ఉన్నా అభిమానాలుతక్కువ. డబ్బున్నా లేక పోయినా ఆప్యాయంగా చూసే సుశీలక్క అంటే రవికి ప్రాణం.

లలిత ఎఱ్ఱగా, బొద్దుగా, ముద్దుగా ఉంటుంది. రవికి యీ పిల్లంటే చాలా యిష్టం. దగ్గరకు పిలిస్తే సిగ్గు సిగ్గంటూ వచ్చేదికాదు. తీరా సెలవులయిపోయి యింక వెళ్తాడనగా మాలిమి అయ్యేది రవికి.

లలితకు ఐదేళ్ళే అయినా తెలివితేటలు ఎక్కువ, పెద్ద పెదనాన్న పొట్టమీద కూర్చొని, "శరణంభవ కరుణామయ'' అంటూ ముద్దుగా తెరంగాలవీ పాడేది.

ఒకసారి ఏవో పనులమీద వాళ్ళ నాన్న కనిగిరి వెళ్ళుతుంటే గొడవచేసి తనూ వెళ్ళింది. "భక్తపోతన" "మదాలస" సినిమాలు చూశారక్కడ. మర్నాడు కనిగిరినుండి బస్‌లో బయల్దేరారు. బస్‌దిగి మాగాణిగట్ల వెంట ఊర్లోకి నడిచి వస్తున్నారు. మోటబావి ప్రక్కగా తుమ్మ చెట్లకు వేళ్లాడుతున్న గిజిగాడి గూళ్ళను ఆసక్తిగా చూస్తూ నడుస్తోంది లలిత.

"అమ్మా" భక్తపోతనలో లక్ష్మిలాగా అవుతావా? "మదాలస" లో గయ్యాళి పాత్రలాగా అవుతావా పెద్దయింతర్వాత నువ్వు" అడిగారు లలిత తండ్రి శ్రీనివాస రావుగారు.

"నేను లక్ష్మిలాగానే మంచిదాన్నవుతాను నాన్నా'' అంది లలిత తడుము కోకుండా. పొంగిపోయింది ఆ తండ్రి మనసు.

ఇంటికి రాగానే తల్లి స్నానంచేయించి, జడ వేయబోతూ ఉంటే "నాకు ప్రక్క పాపటి వద్దమ్మా! "భక్తపోతన" సినిమాలో లక్ష్మిలాగా మధ్య పాపటి తియ్యవే" అని అలాగే తీయించుకుంది. ఆ తర్వాత అలాగే చేసేది. ముసల్దాన్లాగా యిప్పటినుంచే నీకెందుకే అలాగా అని తల్లి కోప్పడేది.

లలితవాళ్ళ నాన్నగారు నియమనిష్టలు ఎక్కువగా కలవారు. రెండు మూడు తరాలుగా ఆ యింట్లో కల్గిన ఆడపిల్ల లలిత. పెదనాన్నలందరికీ తగని ముద్దు

గారాబం. లలితనాన్న ఆమెకు సీత, సావిత్రి, దమయంతి, అనసూయ, మొదలైన మహా పతివ్రతల కథలు చెప్పేవారు. ఆమెకు ఇంగ్లీషు చదువులు చదివించకుండా ''అమరం'' నేర్పించాలని ఉండేదాయనకు. రామాయణ, భారతాలు అర్థాలు చెబుతూ చదివించేవారు.

లలితకు వాళ్ళనాన్నగారు చెప్పిన పతివ్రతల కథలు, నీతికథలు మనస్సులో బాగా నాటుకు పోయాయి.

లలితకు ఎనిమిదేళ్ళు వచ్చాయి. ఎప్పటిలాగే రవి వచ్చాడు సెలవలకు ఎన్నో రంగుల రిబ్బన్లు, గౌన్లు, తమాషాగా ఉండే ఆటవస్తువులూ తెచ్చాడు. కొన్ని యిక్కడ యిచ్చాడు, మరికొన్ని మిగతా అక్కయ్యల పిల్లలకూ యివ్వాలనే ఉద్దేశ్యంతో ఆ ఊరికి ఐదారు మైళ్ళ దూరంలోనే ఉండే వాళ్ళ ఊళ్ళకూ బయల్దేరారొకరోజు, మార్గమధ్యంలో ''లలితను బాగా చదివించాలక్కయ్యా'' అన్నాడు రవి సుశీలతో.

పచ్చి మిరపతోటల్లోని ముద్దబంతిపూలు, కారబ్బంతిపూల వాసనను ఆస్వాదిస్తూ, దారిప్రక్కనే ఉన్న కొండమల్లెపూలు. రేగుపండ్లూ కోసుకుంటూ ఉన్న లలిత యీ మాటలు విని ఉలిక్కి పడింది.

లలితకు చదువంటే భయమనికాదు. కానీ, ఇంగ్లీషు చదువులంటేనే భయం ఆమెకు. ఎందుకో కారణం తెలిసేదికాదు హైగా హైస్కూలులో చేరాలంటే పొరుగూరు వెళ్ళాలి. రాను, పోనూ పన్నెండు మైళ్ళు నడవాలి మగపిల్లలతో కలిసి, ఆడపిల్లలెవరూరారు. మగపిల్లలతో వెళ్ళటం నాన్నకిష్టముండదు. తనకూ అంతే.

నాలుగు రోజులు లలితావాళ్ళ పిన్నమ్మవాళ్ళిళ్ళల్లో ఉండి తిరిగి వచ్చేశారు మామయ్య యింకో వారంరోజులలో వెళ్ళిపోతాడు దిగులుగా ఉంది లలితకు. మామయ్య ఎన్నో హిందీ పాటలు నేర్పేవాడు. బాగా పాడేవాడుకూడా. "మేరీ యాద్ మేతుమ్‌న ఆఁసూబహానా" అనే పాటలలితకెంతో యిష్టం. అర్థంకూడా చెప్పేవాడు.

మామయ్య దగ్గర ఎంత మంచి వాసన వస్తుందో! తలకు ఏమిటో తెల్లగా వెన్నలాగా ఉండేది రాసుకునేవాడు. బట్టలుకూడా ఎంతగా బాగుండేవో! చొక్కాలయితేమరీనూ పాము కుబుసంలా ఉండేవి.

"లల్లీ! నా దగ్గర పడుకోవే యీ రోజు. రేపే నేను ఊరెళ్తానుగదా!" అంటూ పిలిచాడు ఒకరోజు.

"ఛీ పరాయివాడి దగ్గర పడుకోవటమా!" అని యీసడించుకుంది మనసులో నాన్న చెప్పిన పతివ్రతల కథలు మెదిలి.

"వెళ్ళవే వాడంత సరదాపడుతుంటే. వాడున్నన్నాళ్ళూ యిట్లా బెట్టు చేస్తావు? వాడు వెళ్ళగానే దిక్కు మొహంవేసుకుని దిగులుగా ఉంటావు పదిరోజులు దాకా అన్నది సుశీల.

ఆ రాత్రి మామయ్య దగ్గరే పడుకుంది లలిత. కానీ నిద్రపోతే ఒట్టు మామయ్యేమిటి? అలా దగ్గరగా వత్తుకుంటాడు. నాన్న, పెదనాన్నల దగ్గర పడుకున్నట్లుగా లేదామెకు.

గౌను పైకెత్తి ఏమిటేమిటో చెయ్యబోతున్నాడు ఛీదరగా. ఒళ్ళంతా భయంతో తిమ్మిరెక్కినట్లవుతోంది. ఈ అమ్మొకతి! మధ్యలో ఏమీ తెలియదు. "ఛీ మామయ్య రాక్షసుడు" నాన్న వాళ్ళు తప్ప మిగతా వాళ్ళంతా అలాగే ఉంటారేమో అనిపించింది లలితకు. గబుక్కున మంచందిగి, నాన్న దగ్గరకొచ్చి పడుకుంది.

నాన్న ఒకసారి అమ్మతో అన్న మాటలు గుర్తొచ్చాయి. పదోఏటనే తనకు పెళ్ళి చేస్తారట. ఆ వచ్చే భర్తకూడా మామయ్యలాగే చేస్తాడేమో! పెద్ద జుట్టు ముడి, పంచకట్టుకున్న ఒక అస్పష్టమైన ఆకారం ఆమె మనసులో మెదలి, భయమేసింది. వాళ్ళ ఊళ్ళో అందరికి జుట్టుముడులే. ఎవరో కొందరు కుర్రాళ్ళకు తప్ప మామయ్యకు క్రాపు ఉండేది.

నాన్నవాళ్ళ జుట్టు దువ్వి జడలువేసి ఆడుకుంటుండేది లలిత ఎప్పుడూ నులక మంచాల తాళ్ళు తెగితే వాటికి జడలల్లేది. లలిత నాన్నగారు పెంచిన (ఎకరం నేలలో) పెద్ద తోటలోని పున్నాగపూల చెట్ల కొమ్మలు కదిలించి ఆ పూలు ఏరి, జెడలల్లి తలలో పెట్టుకునేది.

లలిత వాళ్ళ ఊళ్ళో ఆడవాళ్లందరూ పొడవుగా పెద్ద కేశ సంపదతో అందంగా ఉండేవారు. పాడిపంటలతో విశాలమైన వీధులతో కళకళలాడుతూ ఉండేది ఆ ఊరు. దారిద్ర్యంతో బాధపడేవారు అరుదు. తోలుబొమ్మలాటలూ, వీధి భాగోతాలూ, బుర్రకథలూ హరికథలూ, నెలలు తరబడి సాగుతుండేవి ఊరి పెద్దల ఆధ్వర్యంలో. వినాయకచవితికి తోటల్లోకెళ్లి రకరకాల పత్రిని సేకరించటం ఆ తర్వాత వినాయకుని చెరువులో నిమజ్జనం చేసి రావటమూ కంటికింపైన దృశ్యాలు. ఊరందరినీ చల్లగా కాపాడమని పోలేరమ్మ పోతరాజులకు చద్దిపెట్టి అన్ని కులాలవారూ సామూహికంగా ఊరిబయట తోటల్లోకెళ్ళి వంటలు చేసుకుని భోజనాలు చేసి వస్తుండేవారు. ప్రతి ఏటా దసరా వస్తే స్కూలు పిల్లలు రంగు రంగుల జెండాలు చేతపుచ్చుకుని పద్యాలు, పాటలూ పాడుతూ చుట్టుప్రక్కల ఊళ్ళకు కూడా వెళ్ళి వస్తుండేవారు. ఆ ఊళ్లో మగవాళ్ళుకూడా చాలా పొడవుగా బలంగా ఉండేవారు. రామాలయంలో ప్రతి శ్రీరామనవమికి వసంతోత్సవాలు ఘనంగా జరిగేవి. సంక్రాంతి నెలరోజులూ చెన్నకేశవస్వామి వారికి మేళతాళాలతో వెళ్ళి బిందె తీర్థంతో అభిషేకాలు చేయించేవారు సంక్రాంతికి పంట చేతికివచ్చి ప్రతి యిల్లూ కళకళలాడుతూ పెళ్ళి కళను తలపింపచేసేది. ఆ ఊరి పాటిమట్టి సిమెంటు రంగులో ఉండి, ఇళ్ళు కట్టుకోవటానికి బాగా గట్టిగా ఉండేది. ఆ మట్టి, పేడా కలిపి యీత ఆకుల డిజైన్లలో ఇళ్ళు అలికి చక్కటి ముగ్గులు పెట్టుకునేవారు అందరూ. సంక్రాంతికి గొబ్బెమ్మలు వాటిపై గుమ్మడి పూలు, బంతిపూల అలంకరణ చూడముచ్చటగా ఉండేది పెద్ద పెద్ద ముగ్గుల మధ్య.

* * *

లలితకు తొమ్మిదో ఏడు వచ్చింది. అకస్మాత్తుగా జబ్బుచేసి వాళ్ళ పెద్ద పెదనాన్నగారు పోయారు. ఆయనే ఇంటికి పెద్ద దిక్కు. ఇంకో పెద్దనాన్న భార్య గయ్యాళి, దుర్మార్గురాలు. ఇంట్లో ఏ పనీ ముట్టుకునేది కాదు. లలిత తల్లి సుశీలే మైలపని, మడిపని, వచ్చిపోయే అతిథులకు వండి వడ్డించటం, వడ్లు దంచటంలాంటి పనులన్నీ యంత్రంలా చేస్తుండేది.

సుశీల కష్టం చూడలేక ఎన్నడన్నా చిన్న పెదనాన్న నోరువిప్పి ఏదైనా పనిచేయమన్నా అలిగి పుట్టింటికి ప్రయాణం కట్టేది. ఆమె నెలల తరబడి వచ్చేది కాదు. బతిమాలుకుని, పిల్చుకొస్తుండేవారు ఆయనే ఆవిడను.

ఆవిడకు ఆరుగురూ మగపిల్లలే. ఆడపిల్లలు తనకులేరని లలిత అంటే చిన్నతనంనుండీ యీర్ష్య ఆమెకు. చాటుమాటుగా గిల్లీ, గిచ్చీ ఏడిపిస్తుండేది లలితను.

పెద్దాయన పరంధామయ్యగారు పోగానే ఆవిడలోని స్వార్థం విజృంభించింది. పిల్లల చదువులంటూ బస్తీలో కాపురం పెట్టించింది. చదువులపేరిట సిన్మాలనీ, షికార్లనీ ఝల్సాచేసి, అప్పులు చేసేవారక్కడ. తిండిగింజలు డబ్బుల రూపంలో అక్కడకు చేరుతుండేవి.

లలిత వాళ్ళ నాన్నకు ఎప్పుడూ పూజ, స్కూలు గొడవలు తప్ప ఇవేమి పట్టేవికాదు. ఆయన మనసు యితరులలోని చెడునెప్పుడూ గుర్తించేదికాదు. అందరూ తనలాంటి మంచివాళ్ళేననుకునేవారు.

ఇక్కడ లలిత వాళ్ళు తినీ, తినకా ఏడాదిలో వచ్చే నాలుగయిదు తద్దినాల ఖర్చులు భరించలేకా పస్తులతో కాలం గడిపేవారు తరచూ.

లలిత తల్లి సుశీల భర్తననుసరించి వెళ్ళే మనిషి. "మీరు కాస్త పట్టించుకో కూడదా।" అని భర్తకు చెప్పే ధైర్యంలేదు. ఎందుకంటే ఆయనకు తన అన్నా, వదినెలమీద అపారమైన నమ్మకం, గౌరవం ఉండేవి. జీతం కూడా ఆయన సంతకం పెట్టేవరకే. డబ్బు మాత్రం లలితవాళ్ళ పెదనాన్నవాళ్ళే తీసుకునేవారు.

వేళకు తినకా. అదీ బలమైన తిండికాకపోవటంవల్ల జబ్బుపడ్డారు లలిత తండ్రి. మరో రెండు సంవత్సరాలకు లోలోపల తినివేసిన టి. బి. అయినను కబళించివేసింది.

లలిత పెద్దమ్మ రంగంలోకి దిగిందాతర్వాత. ఆయన బ్రతికున్నప్పుడు పైకి ఎంతో ప్రేమలు ఒలకబోసిన ఆవిడ, ఆయన పోయిన పదిరోజులన్నాకాకముందే లలితవాళ్ళను వేరే కాపురం పెట్టించింది.

లలిత తల్లి అమాయకురాలు. లోకజ్ఞానమెరుగనిది. లలితనూ, లలిత తర్వాత బాగా ఎడంగా పుట్టిన యిద్దరు మగపిల్లలనూ పెట్టుకుని దయతలచి తోడికోడలు

ఎప్పుడు పెడితే అప్పుడు, ఏం పెడితే అది తింటూ తన తండ్రి, మిగతా అన్న య్యలూ, "కర్మకాండ'' జరిగేనాటికొచ్చేవరకూ అలాగే గ్రుడ్లనీరు దిగమ్రింగు కుంటూ కాలం గడిపింది.

లలిత పెద్దమ్మ బస్తీలో ఉండి చేసిన అప్పులన్నీ ఆస్తులతో సమంగా పంచ మని గొడవచేసింది. లలిత నాన్న చిన్నతనంలో ఎవరికో దత్తుపోయారు కాబట్టి ఆస్తులేమీ వాళ్ళకు రావని లా పాయింట్లు లేవదీసింది.

ఆ ఊరి వైశ్య ప్రముఖుడు లలిత నాన్నగారితో ఒకప్పుడు "మహాభారతం" చదివి వినిపించుకున్నారు. దానికిగాను ఆయన వద్దంటున్నా వినకుండా రెండెకరాలు మంచి పొలం ఉదారంగా లలిత నాన్నగారికి వ్రాసిచ్చారు.

ఆ పొలం అమ్మి యీ అన్యాయంగా నెత్తినవడ్డ అప్పులు వదిలించుకున్నారు లలితవాళ్ళు.

చివరకు శ్రీనివాసరావుగారి మంచితనం, తమ పిల్లలకు ఆయనెంతో శ్రద్ధగా చెప్పిన చదువులకు కృతజ్ఞతాభావంతో ఊరి పెద్దలంతా కలిసి లలిత పెద్దమ్మకు నచ్చచెప్పి ఒక ఎకరం పొలం, ఆ పెద్దలోగిలిలోనే ఒక గది యిప్పించి వారికి వసతి కల్పించారు.

రెండేళ్ళు గడిచాయి. సెలవులకు వచ్చాడు రవి మళ్ళీ. "అక్కయ్యా! ఇక్కడ ఉండి చేసేదేముంది? లలితను చదివిద్దాం. ఇంకా తర్వాత చిన్నవాళ్ళు మగపిల్లలున్నారయ్యే, ఇక్కడే ఉంటే వీళ్ళ భవిష్యత్ ఏంకాను?" అని హితబోధ చేసి హైస్కూలులో చేర్పించాడు వాళ్ళ పెదనాన్న కొడుకు రాంపండు రెడ్డి బజారులో ఉండే రామకృష్ణారెడ్డితో కలిసి రెండు వాగులు దాటుకుని వెళ్ళివస్తుండేది లలిత. పొలాల్లో పనిచేసే రైతులు "నీకెందుకు తల్లీ యీ కష్టాలు పంతులు గారు ఉన్నప్పుడు గడపదాటి బయటకొచ్చేవాతుగాదు మీరు. అయినా మనూర్లో ఆడపిల్లలెవరన్నా యిలా కష్టపడుతున్నారా'' అనేవారు లలితతో. ఒక శనివారం నాడు స్కూలు వదలగానే పొలాల్లోగుండా నడచివస్తున్నారు లలితవాళ్ళు. గొర్రెలు కాసుకొనేవారు వీళ్ళనుచూసి ముళ్ళుగర్రలు చేతబట్టుకొని పరుగెత్తుకుంటూ వచ్చి వీళ్ళముందు ఆగారు. బలంగా పొడుగ్గా ఉండే రెడ్డి పెద్ద పెద్ద అంగలువేసుకొని నడుస్తూ చాలాదూరం వెళ్ళిపోయాడు. అతనూ లలిత తండ్రివద్ద శివ తరగతివరకూ

విద్య నభ్యసించినవాడే. రాంపండూ, లలితమాత్రమే ఉన్నారు. లలిత భయపడి పోయి "నా బుట్టలోలకలు యిచ్చేస్తాను. మమ్మల్నేం అనకండి" అని బ్రతిమాలింది వాళ్ళను. "అవొద్దు డబ్బులివ్వండి" అన్నారు వాళ్ళు. మా వద్ద ఒక అణా మాత్రమే ఉంది అది తీసుకొని వదిలేయండి" అన్నారు లలితా, రాంపండు. అది తీసుకుని వెళ్ళిపోయారు వాళ్ళు నవ్వుకుంటూ. ఈ సంఘటన జరిగింతర్వాత యింకేం జరుగుతుందోనని భయపడి స్కూలు ఉన్న ఊర్లోనే కాపురం పెట్టారు లలితవాళ్ళు.

లలిత ఇంగ్లీషు అంటే భయపడటాన్ని తగ్గించుకుంది చాలావరకు. తను బాగా చదువుకోవాలి తమ్ముళ్ళను చదివించి వృద్ధిలోకి తేవాలి. భయపడుతూ కూర్చుంటే రోజులు గడవవుకదా! అని నిశ్చయించుకుంది దృఢంగా.

రవి పంపే డబ్బుతో పొలంలో వచ్చే ధాన్యంతో కాలం గడిపేవారు లలితావాళ్ళు.

లలిత అన్నింటిలోనూ ఫస్టే. చక్కగా పాటలు పాడేది. ఆటలలో ఉత్సాహంగా పాల్గొనేది. చక్కగా డ్రాయింగు వేసేది. చదువులో క్లాసులో ప్రథమంగా ఉండేది. ఫోర్త్ ఫారంలోకి వచ్చింది తమ్ముల్లిద్దరూ ఫస్టు ఫారంలో చేరారు

"ఏయ్! లలితా! ఈసారి నాకు తెలీకుండా ఫీజుకట్టకు. క్రితంసారి అలాగే చేశావ్! ఒకచోటే అందరం ఉంటే ఖర్చులు కలిసొస్తాయి. తిండకి అన్నింటికి నాకూ యిబ్బంది ఉండదు". అని చెప్పి వెళ్ళాడు రవి మామయ్య సెలవులకొచ్చినప్పుడు. నెలనెలా డబ్బులు లలిత పేరుతో పంపేవాడు. అదో గొప్పగా ఉండేవి లలితకు.

రవి అగ్రిమెంట్ పూర్తికాగానే మిలిటరీనుండి వచ్చేసి హైదరాబాద్‌లో ఒక ప్రయివేటు కంపెనీలో చేరాడు అందుకే అంతా ఒకచోట ఉండాలని అతని ఉద్దేశ్యం.

లలితకు హైద్రాబాద్ వెళ్ళాలంటే భయం బెరుకు. ఆ నగరాన్ని గురించి చదవటమే కానీ, అదెలా ఉంటుందో స్కూల్లో తనతోటివారి ప్రవర్తన ఎలా

ఉంటుందో, తెలియదు. తనా పల్లెటూరిది. వాళ్ళెంత ఫ్యాషన్‌గా ఉంటారో! తనను చూసి వెక్కిరిస్తారేమో! ఇలా ఐస్త్రి గురించిన భయాలతో సతమతమవుతుండేది లలిత.

లలితకింకో భయం కూడా ఉన్నది. మామయ్య చూపులూ, చేష్టలూ యిబ్బందిగా ఉండేవామెకు. ఇక్కడయితే అతనున్నన్నాళ్ళు ఎలాగో తప్పించుకు తిరిగేది. అక్కడ కలిసే ఉండాలే ఎలాగా! అని ఆమెకు చింత.

తనకంటే వయసులో బాగా పెద్దయిన రవి మామయ్యంటే లలితకు గౌరవం ఇంకా పెళ్ళి చేసుకోకుండా తమ కుటుంబంకోసం పాటుపడుతున్నారని ఎంతో కృతజ్ఞత. అతను తనను చేసుకోవాలని అమ్మకూ ఉండేది. ఆ ఊళ్ళో కూడా అందరూ అలాగే అనేవారు. "ఏదో తండ్రిపోయిందగ్గర్నుండీ వాళ్ళనాదుకున్నాడు. పిల్లను చేసుకుంటే ఆ కుటుంబం ఒక ఒడ్డునపడుతుందనుకునేవాళ్ళు వాళ్ళ శ్రేయోభిలాషులు. ఇవన్నీ లలితకు చిరాకు పుట్టించేవి. తను చదివిన శరత్ బాబు రాసిన బెంగాలీ నవలల్లోని (తెలుగు అనువాదాలు) హీరోలాగా సుకుమారంగా తన భర్త ఉండాలని ఊహించుకునేదామె. కానీ మామయ్యలాగా కండలు తిరిగిన వస్తాదునికాదు అనుకునేది.

* * *

అన్నీ మనమనుకున్నట్లుగా జరిగితే కాల మహిమ గురించి చెప్పుకోవాల్సినదేముంటుంది?

వయసొచ్చి అందంగా ఆకర్షణీయంగా ఉండే లలితపై పడ్డాయి ఎదురింట్లో అద్దెకుండే పోకిరి కుర్రాళ్ళకళ్ళు. లలిత మంచితనంవల్ల ఇన్నాళ్ళూ వీళ్ళ అల్లరితనం బయటపడలేదు. కానీ ఒక రోజు.... ........

అమావాస్య కావటంవల్ల చిమ్మచీకటిగా ఉంది. ఎందుకో నిద్రపట్టటంలేదు లలితకు. ఇంతలో ఎవరో గోడదూకిన చప్పుడైంది. గుండెఝల్లుమన్నదామెకు భయంతో, "సుశీలా! మీ అమ్మాయిని లేపు చెప్పినట్లు వినకపోయావో, యీ ఊళ్ళోనే లేకుండా అల్లరిపాలుచేస్తాం" అంటూ అమర్యాదగా బెదిరిస్తున్నాడో జులాయి వెధవ. లలిత ఒంట్లో రక్తం గడ్డకట్టుకుపోయినట్లయింది. వళ్ళంతా చెమటలు కమ్ముతున్నాయి. అమ్మది పాతచీర కప్పుకొని తమ్ముళ్ళ దగ్గర పడుకున్నది తను. చీరలోనుండి నెమ్మదిగా చూసింది.

"శంకరంబాబూ! మా లలిత సంగతి తెలిసే ఎందుకంటీ అల్లరిపెట్టాలని చూస్తారు! అది నిప్పులాగా బ్రతకాలనీ ఏవేవో అనుకుంటూ ఉంటుంది నాయనా! దాని జీవితం నాశనంచెయ్యొద్దు. వెళ్ళండి మీకు దణ్ణంపెడతాను" అంటూ బ్రతిమాలుతున్నది సుశీల. వాడు వినిపించుకోలేదు. తనవేపుకు రాబోతున్నాడు. అమ్మ అడ్డుకున్నది "కావాలంటే మీ కోరికలకు నేను సిద్ధమవుతాను. కానీ లలితమ్మను ఏంచెయ్యొద్దు బాబూ!" అని మొరపెట్టుకున్నది. వాడేం మాట్లాడలేదు.

సుశీల వితంతువనేగాని ఆమె అందం కాములకు కళ్ళపంటగానే ఉండేది.

పడమటింట్లోనుంచి ఏవో చప్పుళ్ళు మూలుగులు వినిపించాయి. లలితకంతా అర్థమయింది. మెదడు మొద్దుబారినట్టయింది. అమ్మ ఎంతో సాధ్వి అని ఊళ్ళో చాలా పేరుండేది. సీతాదేవిలాగా భర్త కోసం ఆ కుటుంబంకోసం ఎన్ని కష్టాలో పడిందనీ! తనకోసం ఈనాడు ఎవరో జులాయివెధవకు శీలాన్ని అర్పించుకుంది. ఎంత త్యాగంచేసింది! అయ్యో! అమ్మ అనుకుంటూ నిస్సహాయురాలిలా కుమిలి కుమిలి ఏడ్చింది లలిత.

కొన్ని నెలలు గడిచాయి. అమ్మలో ఏదో మార్పుకనిపెట్టింది లలిత. ఎవరో మొరటు స్త్రీ వచ్చి, ఏదో చేసింది సుశీలకు. అనిద జబ్బుపడింది. చిక్కిపోయింది. ఆ క్రూరవెధవలు లలితను చూడటం మానేశారు. వాళ్ళకు కావల్సింది సుశీలద్వారా దొరికిందిగా వంతులవారీగా.

తనకోసం త్యాగంచేస్తూ కొవ్వొత్తిలా కరిగిపోతున్న తల్లి మొహంచూడలేక పోయేది లలిత.

ఈసారి ఫీజు కట్టకూడదు. బస్తీ అనే భయంతో ఫీజుకట్టి ఆ ఏటికెలాగో తప్పించుకోవచ్చని ఊహ ఉన్న లలిత మామయ్యతో హైదరాబాదు వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నది. లేకపోతే తన తల్లి తనకు దక్కదు. అనారోగ్యంలో ఆ దుర్మార్గుల కామవాంఛల తాకిడికి కృళ్ళిపోతుంది అని ఆలోచించిందామె.

ఆ రాత్రే లలితవాళ్ళను హైదరాబాదు తీసుకొచ్చేశాడు రవి. రైల్వేస్టేషన్‌లో అంత జనాన్ని చూసి కళ్ళు తిరిగిపోయాయి లలితకు. ఎలా యిమడగలనబ్బా! యింత జనసందోహంఉన్న యీ ఊళ్ళో అని గాబరాపడిపోయిందామె.

రోజులు చాలా యిబ్బందిగా గడిచేవి లలితకు. ఎందుకు పుట్టాను ఎందుకు బ్రతుకుతున్నాను! ఏమిటో ఈ జీవితం? అని విరక్తిగా అనుకునేది లలిత.

ఏయ్! ఏమిటా పమిట బిగించుకోవటం ఆ నడవడం అట్లాగేనా పల్లెటూరి గబ్బిలాయిలాగ. ఆ శ్రీధర్‌వాళ్ళ చెల్లెళ్ళుచూడు ఎంత ఫ్రీగా ఉంటారో! ఒట్టి మొద్దువి మామయ్య విసుక్కునేవాడు బజారుకెళ్ళినప్పుడు.

"ఏమిటా శ్రీధర్ మామయ్య ఫ్రెండ్ వాళ్ళ చెల్లెలు నాగరికత మగవాళ్ళ మీద ఎగబడటమా"

మామయ్యకోసం మగవాళ్లకంటే ఆడవాళ్ళే ఎక్కువగా వస్తారేంటి? ఆ వికవికలు పకపకలు ఏమిటి? అసభ్యంగా! పెళ్ళికాని ఆ ఆడపిల్లలకంత విచ్చలవిడి తనమేమిటి? మామయ్యంటే కొంత కొంత అర్థంకాసాగింది లలితకు. పెళ్ళిలేక పోయినా నాలుగురకాల రుచులు చవిచూస్తున్నాడు. ఇటువంటివాడిని తనకు కట్టబెట్టాలని చూస్తున్నారు అమ్మవాళ్ళు అని ఈసడించుకుంది మనసులో లలిత.

ఒకరోజు స్కూలుకెళ్ళడానికి తయారవుతోంది లలిత. ఎప్పుడొచ్చాడో వెనుకనుండి వాటేసుకొని బలంగా తనవేపుత్రిప్పుకొని చటుక్కున లలిత పెదాలు చుంబించాడు రవి. ఊహించని ఆ సంఘటనకు ఉలిక్కిపడింది లలిత. ఒక్కసారి విదిలించుకొని చికాకుపడుతూ పుస్తకాలు తీసుకొని చరచరా వెళ్లిపోయింది చెప్పులయినా వేసుకోకుండా. ఆ చెప్పులొకటి యింతెత్తునా? అవేసుకొని టక్కుటక్కుమని తిరగాలంటాడు. తనవద్దకువచ్చే మగస్నేహితులతో మాట్లాడుతూ కూర్చోమంటాడు ఆ వెధవలు తనను తినేసేలా చూడడం! 'ఏమి సంస్కారమో! మరది' మామయ్య గురించి చికాకుగా అనుకుంది లలిత.

ఈ చదువైనా త్వరగా అయిపోతే బాగుణ్ణు. ఏదో ఒక ఉద్యోగం చూసుకొని ప్రశాంతంగా బ్రతకొచ్చు అమ్మా తమ్ముళ్ళతో. ఈ పురుషాధిక్య సమాజంలో నిశ్చింతగా బ్రతకడం కష్టమే అనుకుందామె విరక్తిగా.

స్కూలులో కొత్త పోలేదు. చేరి సంవత్సరం కావస్తున్నా అదో చిరాకు. ఇంట్లో చీటికి మాటికి ముట్టుకొని కవ్వించే ఈ మామయ్య ప్రవర్తన ఒకటి. అమ్మ ఏమీ అనదేం! మామయ్య వెళ్ళగొడ్తాడని భయమా! అనుకుంది లలిత.

ఎస్.ఎస్.ఎల్.సి. సంవత్సరాంతపు పరీక్షలు జరుగుతున్నాయి లలితకు. చదువుకుంటూ కూర్చుంది. అర్ధరాత్రికావస్తుంది సెకెండ్ షిఫ్టునుంచి వచ్చాడు రవి. పిల్లిలా మెల్లగావచ్చి లలితప్రక్కన కూర్చొన్నాడు. ఉలిక్కిపడింది లలిత. భుజాలపై చేతులేసి తను ప్రక్కపై వాలి తనమీదకు లాక్కున్నాడు లలితను. "అమ్మా! రాముా, రాజూ'' అంటూ అరిచింది. ఎవరూ రాలేదు. "నన్నొదులు మామయ్యా నీకు దణ్ణంపెడతాను నన్ను నాశనంచేయకు. ఎంతో పవిత్రంగా బ్రతకాలనుకున్న నన్ను మలినంచేయకు మామయ్యా!" అంటూ ప్రార్థించింది లలిత. ఆ రాక్షసుడికి లలిత మాటలు తమాషాగా తోచాయి. పవిత్రతేమిటి? ఈ రోజుల్లో దీనిదొంద, ఏంటో పొగరు దీనికి? ఏదో గొప్ప పోజు. నలిచిపారేస్తేగాని గర్వమణగదు అనుకుని వడిసిపట్టుకున్నాడొకసారి గొళ్ళెంతీసి బయటకు వెళ్ళబోతున్న లలితను

కెవ్వుమంది లలిత. తన దుస్థితికి ఏడుపొచ్చింది. ఒంటరిగా ఎక్కడకు పారిపోతుంది తను! ఎన్ని కలలు కన్నది తను? పెళ్ళిచేసుకొని పతివ్రతలా జీవించాలనుకొంది! నాన్న చెప్పిన పతివ్రతల కధలకనుగుణంగా బ్రతుకుదామనుకున్నది. శీలవతిగా బ్రతకాలనే తన ఆశయాలకోసం నిప్పులాంటి అమ్మ శీలం పోగొట్టుకున్నది, తను చదువుకున్న ఊర్లో కొందరు రౌడీ వెధవలవల్ల. అయినా పరాయి మొగవాడెవరో నాశనం చెయ్యడంలేదు. తనను చిన్నప్పట్నుంచి పెంచి పోషించిన తన మామయ్యే తనపై అఘాయిత్యం చేస్తున్నాడు, తనమాట వినకపోతే మీ బాగోగులు ఇక చూడనని బెదిరిస్తూ. ఇలా ఎక్కడన్నా జరుగుతుందా! అసలు వీడు పెళ్లిమాత్రం చేసుకోడు తనను. వచ్చినదగ్గరనుండి చూస్తున్నదిగదా! అతని ప్రవర్తనను. ఎంతమంది ఆడవాళ్ళతో బట్టలు మార్చినట్లు మారుస్తున్నాడు. తననూ అంతే రుచిచూసి వదిలేస్తాడు, తన పాతివ్రత్యపు ఆశలు ఆశయాలు రవి మామయ్య కామాగ్నిలో కాలిపోతూ ఉంటే నిస్సహాయంగా మూగగా రోదిస్తూ ఉండిపోయింది, పతివ్రతకాలేనిపతిత_లలిత.

ఉరుములూ, మెరుపులతో వాన కురుస్తోంది. ఎక్కడో పిడుగుపడ్డట్లుంది. ఆ ద్వనికి గతంలోంచి వర్తమానంలోకి వస్తూ, గట్టిగా చెవులు మూసుకుంది లలిత.

***

( తేది. 23-10-92 మయూరి వీక్లీలో ప్రచురణ )

# 'తల్లే రాక్షసైతే'

భద్రాచలంవెళ్లి శ్రీరామ దర్శనం చేసుకునివచ్చేసరికి మేనల్లుడు పుట్టాడన్న వార్త తెలిసింది వర్ధనికి.

వెంటనే వర్ధనీ, ఆమె భర్తా హాస్పటల్ కెళ్ళారు. ఆమె మరదలు ముందు నుంచీ కోరుకున్నట్లుగా సిజేరియన్ ఆపరేషన్‌చేసి, బాబును తీశారు. బాబుకు స్నానంచేయించి ఉయ్యాల్లోపడుకోబెట్టారు మల్లెపూలలాంటి దుస్తులువేసి.

వర్ధనీవాళ్ళు వెళ్ళగానే వర్ధని తల్లి అనసూయ బాబునందించింది. అత్త సుతిమెత్తని చేతులలో ఉన్న బాబు పూర్వజన్మజ్ఞానంతోనో ఏమో 'మీనాన్న నేనమ్మా' అన్నట్లుగా ముసిముసి నవ్వులునవ్వాడు. వర్ధని నాన్నగారు గొప్ప పండితుడు, భక్తుడూ, జ్ఞానీనూ. కీర్తిశేషులైన ఆయన పేరు పెట్టుకోవాలనుకున్నారు బాబు పుడితే. ఎన్నో ఏండ్లకు దైవఫలంగా పుట్టాడీబాబు వర్ధనీవాళ్ళ ఒక్కగానొక్క తమ్ముడు వాళ్ళకు పదేళ్ల తర్వాత.

* * *

బాబు పుట్టి నాల్రోజులైంది. వర్ధని మామూలుగా చూడటానికెళ్ళింది. ఆమె మరదలు వనజ, ఆవిడ తల్లి అక్కలు, వదినెలతో కబుర్లాడుతున్నది. బాబు గుక్కపట్టి ఏడుస్తున్నాడు.

"కాస్త పాలిచ్చి సముదాయించరాదా వనజా ! వాడట్లా ఏడుస్తున్నాడుగానీ, అవతల పెద్దప్రాణం గురించి ఆలోచించరేం"? కసురుకున్నట్లన్నది వనజ తల్లి రాంబాయమ్మ.

"పెద్దప్రాణానికేం నిక్షేపంలా ఉంది. ఆరోగ్యమైన శరీరం. ఈ రోజుల్లో సిజేరియన్ ఆపరేషన్లు చాలా మామూలుగా చేస్తున్నారు డాక్టర్లు అనుకున్నది వర్ధని.

దర్మతులైన వనజలాంటి వాళ్ళను పుట్టింటివాళ్ళే అగ్నికి ఆజ్యంపోసిన చందంగా చెడగొట్టిపెడతారనిపించింది వర్ధనికి. బిడ్డ ఏడుపు వినలేక, లేచొచ్చింది వర్ధని.

* * *

బాబుకు మూడు నెలలు నిండబోయేముందు అత్తారింటికొచ్చింది వనజ.

"మొండి వెధవ. అక్కడున్నన్నాళ్ళూ నిద్రపోనిచ్చేవాడుకాదు. ఒహటే ఏడుపు...." అంటూ చుట్టుప్రక్కలవాళ్ళతో ఊదరకొడుతుండేది. నానమ్మ యింటి కొచ్చింతర్వాత ప్రశాంతంగా ఉండేదేమో, హాయిగా నిద్రపోయేవాడుబాబు. కానీ వాడినలా ప్రశాంతంగా ఉండనిచ్చేదికాదు వనజ. గిల్లో, గిచ్చో నిద్రలేపేది. 'అబ్బో! ఏడిపించే పిల్లాడమ్మా' అని అందరూ అనుకోవాలని. వర్ధనిగానీ, అనసూయగానీ తీసుకోబోతే యిచ్చేదికాదు. దగ్గఱపెట్టుకుని ఏడిపిస్తుండేది. వాడు యిబ్బందిగా ఫీలయి, మరీ గుక్కలుపట్టేవాడు.

సున్నిపిండి చలవచేసి హాయిగా ఉంటుందని అత్తగారంటే "ఏమక్కర్లేదు, మా అమ్మ నబ్బుతోనే రుద్దేది" అని కొట్టినట్లు మాట్లాడి, పసపసా రుద్దేది. కళ్ళల్లోకి నబ్బుపోయి గుక్కపట్టి ఏడ్చేవాడు బాబు. "నోర్మూయ్" అని పసివెధవను కొట్టేది. నిర్ఘాంతపోయి చూసేవాడు బాబు 'నన్నెందుకే అట్లా కొట్టి చంపుతావు అన్నట్లు.'

పాలు త్రాగుతూ పసినేష్టలతో పాలిండ్లతో ఆడుకోబోతే, ఆ చేతుల్ని గట్టిగా పట్టుకుని "చేతులు విరిచేస్తా! దరిద్రపు చేష్టలూ, నువ్వూను" అని గుడ్లురిమేది. వాడు బిక్కచచ్చిపోయి మిడిగుడ్లేసుకుని, 'ఓసి రాక్షసీ'! అన్నట్లు చూసేవాడు తల్లివేపు. పౌడర్‌ను కళ్ళల్లో, ముక్కుల్లోపడేట్లు పూసేది. జుట్టు ఊడొచ్చేలా పీకి, రెండు పిలకలు కట్టేది. నొప్పిపుట్టి ఏడిస్తే "నాజూకు బలిసిపోతుంది ముష్టి ముండాకొడుక్కి. చావగొడతా ఏమనుకున్నావో" అంటూ హుంకరించేది. 'ఏవిటీ పీడ! నాకు' అన్నట్లు చూసేవాడు బాబు. వక్షోజ సౌందర్యం నశిస్తుందని పాలివ్వటం మానేసింది నాలుగోనెలలోనే వనజ.

బాబు మలమూత్రాదుల విసర్జన క్రమపద్ధతిలో ఉండేది. ఎక్కడపడితే అక్కడ పోయటం, ఎవరైనావస్తే వాళ్ళఒళ్ళు తడిచేయటం చేసేవాడుకాదు. అయినా ఏదో ఒక వంకపెట్టి, మెత్తగా ఉన్న మాడుపై పుచ్చపగిలేలా కొట్టేది, పదినెలలు వయసు మాత్రమేఉన్న బాబును వనజ "అయ్యో! అని భర్తగానీ, అత్తగానీ ఎత్తుకోబోతే "మీరూరుకోండి ముట్టుకోవటానికి వీలులేదు. నా కొడుకు, నా యిష్టం" అంటూ విదిలించిపారేసేది. వాళ్ళవేపు బుంగమూతిపెట్టి నిస్సహాయంగా చూస్తూ కుమిలి కుమిలి ఏడ్చేవాడు బాబు.

వాడి మర్మాంగాన్ని పట్టుకుని ఊరికే ఊపేది. ఆ ఊపులోని అనుభూతిని వాడు గమనించి, ఆ దేపనివాడు చేస్తే చేతులమీద కొట్టి, "కాలుస్తా వెధవా!" అని తిట్టిపోసేది.

పిల్లలు తమకేది కావాలన్నా, అర్థంచేసుకోలేని పెద్దలున్నప్పుడు ఏడుపు ద్వారా సంకేతం తెలుపుతారు. అదీ అర్థంచేసుకునేదికాదు వనజ. సుతిమెత్తని మనసుకల వర్ధనిని పిల్లల్లేరన్న బాధ, అట్టె బాధించకపోయినా, పసివాడ్ని కన్నతల్లే హింసిస్తుంటే చూసి సహించలేక అనారోగ్యం పాలపుతుండేది. పక్కపక్క యిళ్ళు కావటంతో మరీ కష్టంగా ఉండేది భరించటం..........

ఆకలేసినపుడు పాలుపట్టేదికాదు బాబుకు వనజ. ఆకలి చచ్చింతర్వాత పడితే వాడు తాగలేదని వీపుమీద మోదేది.

ఏడాదివెళ్ళింది బాబుకు. అన్నం తినేవాడు. అలివిమాలిన అన్నం కలిపేది. వాడు తనకెంత కావాలో అంతే తిని, వద్దు అంటే కలిపిందంతా ఎందుకు తినవో చూస్తానని అహంకారంతో కొట్టి, కొట్టిపెట్టేది. ఇహ తిన్నదేం వంటపడుతుందివాడికి ఆ గోలకు. ఎవర్నూ చూస్తూ ఉండాల్సిందేతప్ప, ఏమనటానికి వీలులేదు. అలిగి పుట్టింటికిపోతానని బెదిరించి నిజంగానే నెలలు నెలలు పుట్టింటివాళ్ళ నెత్తినపడి, పిల్లాడ్ని కాల్చుకుతింటుండేది. వాడు "ఏమిటి నాకీ చెఱ" అని వాపోతుండేవాడు.

ఎడారిలాంటి తల్లి సమక్షంలో అత్త అప్యాయత 'ఒయాసిస్' లాగా గోచరించేది వాడికి. సున్నితంగా, ప్రేమగాచూసే మేనత్తంటే వాడికి ప్రాణం. అత్త మాటలు లయబద్ధంగా విన్పించి, వాడి ప్రాణానికి హాయిగా ఉండేది. అన్నం అత్తదగ్గఱ తింటానంటే "వీల్లేదు నేనేపెడతా అదిదెవరు? నీకు పెట్టటానికి" అంటూ లాక్కుపోయేది వనజ.

వాడికి తండ్రి కొత్త బట్టలు తెచ్చినా భరించలేకపోయేది వనజ. వాడిని షికారుకు తీసికెళ్ళినా సహించేదికాదు. ఏదో ఒకనెపంతో యీర్ష్యతో పొట్లగిత్తలా కుమ్మి వదిలిపెట్టేదివాడ్ని.

అల్లరేచేయని ఆ పిల్లాడ్ని అల్లరి వెధవకింద జమకట్టేది. ఆఫీసునుండిరాగానే నవ్వుతూ ప్రేమగా దగ్గఱకు రాబోతే ఉరిమిచూసేది. నవనాడులూ క్రుంగినట్లయి

నానమ్మ దగ్గఱకుపోయేవాడు. "అంతేలే! నీకు వాళ్ళేకావాలి తల్లి అక్కరలేదు. రౌడీ వెధవా! పెద్దయితే నువ్వు నన్ను చూడొచ్చావా? చచ్చేవా?" అని డొంక తిరుగుడుగా మాట్లాడి, పిల్లాడ్ని తికమకపెట్టేది.

వాడ్ని ఫ్రీగా ఆడుకోనిచ్చేదికాదు. తను నిద్రపొమ్మన్నప్పుడే నిద్రపోవాలని కొట్టేది.

ఆవిడకు సెలవురోజున వాడికి నరకమే. ఏదోఒక తప్పు వెదకి చావ గొడ్తుండేది. వాడు విపరీతంగా భయపడి, జ్వరానపడేవాడు తరచూ. జ్వరం మూలాన తిండి సయించక నిస్సత్తువగాఉన్నవాడ్ని ఎవరివద్దకూ పోనీయకుండా దిక్కులోచక ఏడుస్తున్న పిల్లాడ్ని బ్యాట్‌తో "చావు....చావు" అని చావబాది వదిలిపెట్టేది. "నువ్వు తల్లివా? రాక్షసివా?" అన్నట్లు చూసేవాడు తల్లిని.

ఇంట్లో చెంబులు, తపేలాలన్నింటికీ సొట్టలే. పల్లమాలిన దురహంకారంతో ఎత్తిపడేసేది వాటిని. అత్త, భర్త ఎంతో సౌమ్యులు. కానీ ఆవిడ దృష్టిలో తనను కాల్చాలనుకునే కిరోసిన్, అగ్గిపుల్లలాంటివారు. ఎన్నో ఏళ్ళకు పుట్టిన బిడ్డ తల్లి చేతుల్లో దినదిన గండం నూరేళ్ళాయుష్షులా పెరుగుతుంటే ఏమనలేక, ఒక మాటఅని ఆవిడ నోటికి జడిసి బ్రతకలేక టెన్షన్‌తో బాధపడుతూ, బి.పి.లు పెరిగి, తరచూ డాక్టర్లవద్దకెళ్ళుతుండేవారు వాళ్ళు

'కామెర్లకంటికి లోకమంతా పచ్చగా ఉన్నట్టు' తనలాగే అవతలవాళ్ళూ దుర్బుద్ధి మనుష్యులే అనుకునే మనస్తత్వం వనజది. ఎవరూ పచ్చగాఉంటే సహించేదికాదు. 'సైక్రియాటిస్ట్' కు చూపించి యీ అసాధారణ స్వభావాన్ని మార్చించవచ్చునేమోననుకుని కూడా, తననపార్థంచేసుకుంటున్నారని ఆవిడ చేయ బోయే జాతరనూహించుకుని తమను కొట్టినా, తిట్టినా మౌనంగా భరిస్తున్నారు వనజ గయ్యాళితనాన్ని అత్తా భర్తానూ.

తల్లి పెట్టే హింస నిద్రలోకూడా గుర్తొచ్చో ఏమో గుక్కలుపట్టి ఏడుస్తూ లేచి కూర్చునేవాడు బాబు. లాలించకపోగా, చీపురుకట్టతో చావగొట్టేది. ఏడిస్తే, నోర్ముయ్ ఏడుపుపైకి రావటానికివీలులేదని యింకా కొట్టేది. అట్లా ఏడుపు ఒక్క సారి ఆపితే వాడి ఆరోగ్యానికెంత ప్రమాదమో అర్థంచేసుకోలేని మూర్ఖపుది వనజ.

త్యాగం, ప్రేమ, నిస్వార్థం మూర్తీభవించిన తల్లి మనసులేని పిల్లాడ్ని కన్న గొడ్రాలు వనజ.

స్కూల్లో చేర్చారు బాబును. నర్సరీనుండి ఎల్.కె.జి. కొచ్చాడు.

హోమ్‌వర్క్ చేయిస్తానంటూ కొట్టేది. భయంతో వచ్చిందికూడా మర్చిపోయే వాడు బాబు. నేర్చుకునే వయసులో పెద్దవాళ్ళలాగా స్పీడ్‌గా రాయాలనీ, వెంటనే డాక్టరో, ఇంజనీరో చదివేయాలనీ ఆత్రపడటం మూర్ఖపు తల్లిదండ్రుల బుద్ధి తక్కువతనం కాదా!

వనజ గోలపడలేక ట్యూషన్ పెట్టిస్తే, అక్కడ ఒకగంట వ్రాసి విసిగిపోయి వచ్చిన పిల్లాడ్ని మళ్ళీ తను వ్రాయిస్తానని చెప్పి, వాడు "నిద్రవస్తుందమ్మా!" అంటే "చదువంటే ఫస్తాడు. ఆటలాడటానికి నిద్రలు అడ్డురావు" అంటూ చితగ్గొట్టేది. ఆ నరకం చూడాలేకానీ, చెప్పనలవికాదు.

ఇట్లా పిల్లల్ని హింసించే వనజలాంటి తల్లులకు చట్టపరంగా మరోసారి బిడ్డలను అకారణంగా చావగొట్టకుండా ఉండేలా ఏదేని శిక్షఉంటే బాగుండన్పిస్తుంది వర్ధనికి.

పిల్లలంటే పిల్లలకిష్టం. కానేపైనా పిల్లలతో ఆడుకోనిచ్చేదికాదు. ఈడు కొచ్చి తన్నేది యింట్లోపడేసి ఆడుకుంటుంటే తెచ్చి.

ధనిక వర్గాల్లో ఆయాలమీద వదిలేసి, బిడ్డలకు తల్లి ప్రేమనుపంచలేని తల్లులూ, అన్ని వర్గాలలోనూ వయసు ప్రభావంతో సాగించిన కామకలాపాల ఫలితంగా జన్మించిన బిడ్డలను గాలికొదిలేసిన నికృష్టపు తల్లులూ, సినిమా షూటింగ్స్ లోనూ, మోడలింగ్‌లోనూ పిల్లలను అడ్డుపెట్టుకుని ధనార్జన చేయాలనే దురాశతో కన్నబిడ్డలను పలురకాలుగా హింసించే తల్లులగురించి కూడా తెలుసు వర్ధనికి.


వనజలాంటివారికేమో ఎవరినో ఒకరిని మాటలతో, చేతలతో హింసించాలని ఉంటుంది. తద్వారా అవతలివాళ్ళు బాధపడుతుంటే వీళ్ళకు ఆత్మ సంతృప్తిగా, పైశాచిక ఆనందంగా ఉంటుంది. ఎవర్నీ ఎప్పుడూ అట్లా చేయటానికి వీలుండదు కాబట్టి పసిపిల్లలమీద ప్రతాపంచూపి ఆనందపడతారు తమ వికృతచేష్టలు ఎంతటి దుష్ఫలితాన్ని చూపుతాయో గ్రహించలేక.

తల్లి తనపైచేసే అఘాయిత్యాల్ని ఏమీ చేయలేక మౌనంగా భరిస్తూ, ఆ కసిని స్కూలులో పక్క పిల్లలపై చూపేవాడు బాబు.

సున్నితమైన పసిపిల్లల మనసులు తల్లుల అఘాయిత్యాలవల్ల బండబారిపోయి మొండిగా తయారవుతాయి. ఇంట్లోనుండి పారిపోయి అనాధలవుతారు కూడా యిలాంటి పిల్లలు.

ఏ దేశ భవిష్యత్తయినా సక్రమమార్గంలో నడవాలంటే సత్ప్రవర్తనగల పౌరులుండటం ప్రధానం. ఆ భావి పౌరులైన బాలలను ఉత్తమపౌరులుగా తీర్చి దిద్దటంలో తల్లి పాత్ర ప్రముఖమైనది. కానీ వనజలాగా ఆ "తల్లేరాక్షసైతే" పిల్లల భవిష్యత్తు ఛిన్నాభిన్నమైపోదా !...............

(మయూరి వీక్లీ తేది. 18-3-1994)



ఆంధ్రపత్రిక సంక్రాంతి అనుబంధం

# సుశీల

"నిన్న మీరులేరుగదా! నేనొక్కదాన్నే ఉన్నాను సెక్షనులో. సుబ్బారావు వాళ్ళు కాఫీకెళ్ళారు. మంచినీళ్ళు త్రాగుదామని కూజాలోంచి గ్లాసులోకి నీళ్ళు ఒంపుకుంటున్నాను. ఇంతలో ఎ. ఒ. గారొచ్చారు, సుబ్బారావు సీట్లో అర్జంటు ఫైలేదో కావాలంటూ. అసలే ఇరుకు దారి. నన్ను తోసుకుంటూవెళ్ళి, నా భుజం గట్టిగా పట్టుకున్నారు. చెప్పుతీసి తందామనుకున్నాను. కానీ దడపుట్టి ఏం చేయలేకపోయాను'' అని గడగడా చెప్పింది ధనలక్ష్మి నాతో బాత్‌రూంకెళ్ళే దారిలో మాటల మధ్యలో.

"మీరు తన్నలేరులే. మీ గతం ఆ ఎ.ఒ. కు తెలుసు. అతనొచ్చింది యీ మధ్యనే అయినా, ఆఫీసులో ఆడవాళ్ళ చరిత్రలన్నీ కూపీలాగాడు" అని మనసులో అనుకుని, "మరో రెండేళ్ళలో రిటైర్ కాబోతున్నాడు, ఆడది కన్పిస్తేచాలు ఆకలి చూపులు చూస్తుంటాడు యీ వయసులో కూడా. అయినా మీరేం తన్నగలరు? మన ఆఫీసరట్యేవాడు నలుగురికీ చెప్పినా, సానుభూతిలేకపోగా, అలుసుగాతీసుకుని మిగతావాళ్ళు కొందరు అవకాశం దొరికితే ఒకచూపు చూడాలనే అభిప్రాయంలో ఉంటారు. వాడి బారిన పడకుండా కాస్త జాగ్రత్తగా ఉంటేసరి" అంటూ నచ్చచెప్పాను.

* * *

పదేళ్ళనాటి సంగతులు గుర్తుకొచ్చాయి నాకు యిదంతా వింటుంటే.

వేరే ఊర్నుండి ట్రాన్స్‌ఫర్‌అయి వచ్చిన నన్ను అకౌంట్ సెక్షన్‌లో ఏరికోరి వేయించుకొన్నాడొక ఆఫీసర్ సదాశివబ్రహ్మం, ఎప్పటినుండో పోస్టింగ్ లేకుండా ఆగిపోయిన రకరకాల లోన్స్ లెడ్జర్స్‌ను అప్-టు-డేట్ చేయించటానికంటూ. ఆ వర్క్‌లో భాగంగా రెండు వందల జి.పి.ఎఫ్. పాస్ బుక్స్‌లో ఒక్కొక్కళ్ళకు పన్నెండు నెలల చొ॥న ఎంట్రీలు వేసిపెట్టాను చకచకా. సెక్షన్ హెడ్‌చూసిన తర్వాత ఆఫీసర్ వద్దకు పంపారు వాటిని.

"ఇన్నిట్లో ఎవడు పెడతాడు ? సంతకాలు ! అవిడొచ్చి, దగ్గరుండి పెట్టించుకోమను" తన రూంలోనుండి గదమాయిస్తూ సూపర్నెంట్ ద్వారా వార్త పంపాడు అదేదో నా స్వంతపని చేస్తున్నట్లుగా. అన్ని నెలల ఎంట్రీలనూ పాత పేబిల్ బండిల్స్ అన్నీ వెదికి అఫీసుకెళ్ళిందగ్గర్నుండి సాయంత్రం వచ్చేదాకా కష్టపడిపేస్తే, చిన్న సంతకం చేయడానికి కష్టంట ఆయనకు. ఎంత అహంకారం ? అనుకుని పైకి మాత్రం వినయంగా లోపలికెళ్ళి పుస్తకం తెరచి యివ్వటం మొదలెట్టాను. ఇనిషియల్స్ వేసి, ట్రేలోకి విసురుతున్నాడు. నా వేపుకూ విసిరేస్తున్నాడు. నా తొడలకు తగిలేలా మరీ విసురుతున్నాడు. ఏమీ ఎరగనట్లు, మొహంలో ఏ భావమూ ప్రకటించకుండా. నిర్వికారంగా క్రింద పడినవి ఏరుతూ, నా పని నేను చేసుకుపోతున్నాను. మనసుతో మాత్రం, "అమ్మో! వీడికెంత పొగరు ?" అనుకుంటూ.

కొన్నాళ్ళు నన్ను అబ్జర్వ్ చేశాడు. ఇది దేనికీలొంగే ఘటంకాదురా బాబూ ! అనుకుని, విపరీతమైన పని అప్పజెప్పి, సాధించటం మొదలెట్టాడు సతీసక్కుబాయి అత్తగారిలా, ధనలక్ష్మి సహాయకారిగా. ఇంటి లోన్లు, పెండ్లిలోన్లు, మోటార్ వెహికల్స్, సైకిల్ లోన్లూ అన్నింటికీ రిజిస్టర్స్ ఓపెన్ చేయించి, దాదాపు పది, పన్నెండేళ్ళనుండీ ఆఫీసులో జనాలు కొందరు లోన్లు తీసుకున్న దగ్గఱనుండీ వరుసగా యింతటైమ్‌లో వేయాలని షరతులుపెట్టి, పోస్టింగ్స్ వేయించేవాడు.

అటెండర్లు పాత పేబిల్ బండిల్స్ సరిగాతీయరని, ఆ దుమ్మంతా దులిపి, నేనే తీసుకుని, అదేపనిగా చేయటంవలన మెడలు, నడుములు పట్టుకుపోయేవి. కళ్ళు లాగుతున్నట్లుండి, మసకలుగా అన్పించేవి. అ పరిస్థితిలో కళ్ళజోడు వరించింది నన్ను.

ఒకరోజు, "సుశీలా ! రిజిస్టర్స్ అన్నీ అప్‌టుడేట్ చేశావుగదా ! లోన్లు తీసుకుని, వాటిని దుర్వినియోగంచేసినవాళ్ళ లిస్టు తయారుచేశావుకదా ! వాళ్లందరికీ పీనల్ ఇంట్రెస్టు వేస్తున్నట్లు, అది వచ్చే నెలనుండీ జీతాల్లో రాబట్టుకుంటామనీ మెమోలు తయారుచేయి. అవన్నీ విడివిడిగా చేత్తోనే రాయాలి" అంటూ ఆర్డర్ వేశాడు హారిబుల్‌గా.

అరేడు పేరాలున్న ఒక్కొక్క మెమో వ్రాస్తున్న నన్ను చూసి, ప్రక్క
సీటతను "మీరు కాబట్టి ఆయన చెప్పినట్లాడుతున్నారు అన్నీ ఒకేరకం కాబట్టి,
స్టెన్సిల్ తీసి తర్వాత కాపీలు తీయించి, ఫిలప్ చేసుకోవచ్చుగదా! ఈసారి పిల్చి
నప్పుడు చెప్పండలాగా'' అన్నాడు. అప్పటికే కుడిచేయి చచ్చుపడ్డట్లుగా ఫీలవు
తున్న నేను, ధైర్యంచేసి, ఆఫీసర్ వద్దకెళ్ళి, స్టెన్సిల్ తీయిద్దామని చెప్పాను.
వింటూనే మండిపడ్డాడు. "ప్లీజ్లేదు! చేత్తో రాయాల్సిందే. వారం రోజుల్లో అనీ
అయిపోవాలి వెళ్ళు." అని గద్దించాడు. చేసేదిలేక మళ్ళీ రాయటం మొదలెట్టాను.

పై ఆఫీసర్ అప్రూవల్ కోసం వెళ్ళింది ఫైలు అంతా అయింతర్వాత.
అన్నింటితోపాటు ఆ ఫైల్ తీసికెళ్ళిన ఎస్టాబ్లిష్ మెంట్ క్లర్క్, "ఏంటండీ సుశీల
గారూ! ఎస్.ఇ. గారుకూడా ఎంతో నొచ్చుకున్నారు. అన్ని డ్రాఫ్టులూ (ఒకేరకంవి)
ఎట్లా వ్రాశారావిడ అంత తక్కువ టైమ్ లో. ఎందుకు చేయించారట్లా ఆవిడతో
అని కేకలేశారు'' అంటూ జాలిగా చెప్పాడు! 'ఏం చేయగలను నేను? ఏ
రిక మెండేషన్లులేవు నాకు. భగవంతుణ్ణి నమ్ముకోవడంతప్ప. నన్నెందుకో అనవస
రంగా సాధిస్తున్నాడు మా ఆఫీసర్' అని విరక్తిగా గొణుక్కున్నాను.

మా ఆఫీసర్ విశ్వరూపం తెల్సిన ఒక తాయారమ్మ చెప్పిందొకసారి "సాయం
చేయాలనుకుంటే ఎంతయినా చేస్తాడు తనకిష్టమైతే. సాధించదల్చుకున్నాడా!
పాములాగా పగబడ్తాడు ఎవరిమీదైనా" అని. అందుకే చేయలేకపోయినా, ఓపిక
తెచ్చుకుని అస్తమానం పన్చేస్తూనే ఉన్నాను చెప్పినవన్నీ.

ఒక్క క్షణం కూర్చోనిచ్చేవాడు కాదు. అందరి పేబిల్సూ ఫెయిర్ కాపీలు
చేయించేవాడు. నా అసలుపని కాక కంట్రోల్ ఆఫ్ ఎక్స్పెండిచర్ కి సంబంధించిన
పోస్టింగ్స్, క్యాషియర్ కూ, సూపర్నెంట్ కూ అమానత్ రిజిష్టర్ వగైరా విషయాల్లో
సహాయంచేయటం అయన దగ్గరఉన్న కాన్ఫిడెన్షియల్ ఫైల్స్ లో కరస్పాండెన్సూ
లోన్ శాంక్షన్లూ, బిల్స్ వేయటం, ధనలక్ష్మి సీటుపన్లూ, ఒకటేమిటి? తలచుకుంటే
భయమేస్తుందా రాక్షసి పని.

ఇన్స్పెక్షన్ కు వస్తే, ఏ తప్పులూలేని రిజిష్టర్స్, వగైరా నేను పన్చేస్తున్న
సెక్షనుకు మెచ్చదగ్గ విషయంగా ఉండేది.

మొగుణ్ణొదిలేసి, తన సెక్షన్ల సూపర్నెంట్‌కు ఫోజులుకొట్టి, పబ్బంగడుపు కుంటున్న బాలామణికీ, ఆఫీసులోని సెక్షన్లలో అందరి సమాచారం సేకరించి సూపర్నెంట్ కందించి, స్టాఫ్‌కు లీవ్ శాంక్షన్లూ, ఇంక్రిమెంట్లూ సకాలంలో చేయకుండా చీటికిమాటికీ అటువాళ్ళనిటూ, యిటువాళ్ళనటూ ట్రాన్స్‌ఫర్లు చేయించటంలో కోతి చేష్టల సూపర్నెంట్ ఆంజనేయులుకు సహాయంచేసే ఛండీరాణికీ నా మంచితనం కంట్లో నలుసులా బాధిస్తుండేది పాపం! ఊరికే కుళ్ళు కూతలు కూస్తుండేవాళ్ళు చికాకుగా.

బాగా ఆఫీసు పనిచేసే స్త్రీని సాటి ఆడవాళ్ళే మెచ్చుకోలేరు. "ఆ ఏవుందీ పెద్ద!" అంటూ కొట్టిపారేస్తారు. కొందరు మగవాళ్ళకైతే పైకనడానికి అహం అడ్డువస్తుంటుంది.

ఆడవాళ్ళలో ముఖ్యంగా యీనాడు 'యూనిటీ' అనేదేలేదు. అదుంటే ఏదైనా సాధించగలరు వాళ్ళు.

పెద్ద సంసారాన్ని ఒక ఒడ్డున పడేయటంకోసం, డబ్బు సంపాదనకై గల్ఫ్ కంట్రీస్‌కెళ్ళిన భర్తకు విశాల హృదయంతో సహకరించకపోగా, క్షణికమైన సుఖానికి బానిసై దుష్ట మనస్తత్వపు సహచరులైన తనతోటి టైపిస్ట్‌ల ప్రోద్బలంతో మరో సాటి ఉద్యోగస్తుడ్ని వలలోవేసుకుని, అదేదో గొప్ప విషయంలా ప్రవర్తిస్తున్న తారామతి, వగైరాలందరికీ నేనంటే ఒళ్ళుమంటే. ఎందుకంటే సక్రమంగా, నిజాయితీగా అందరికీ పన్లుచేసిపెడతానని, పోచికోలు కబుర్లకు వాళ్ళతో కలవననీను ముఖ్యంగా క్లాస్‌ఫోర్ ఉద్యోగులకు నేను ఆరాధ్యురాల్ని. అవును మరి! ఎంతో చిన్నపనికికూడా ఏదో వరకో లంచం పుచ్చుకునికూడా పనిచేయకుండా త్రిప్పి చంపే క్లర్కులు చాలామంది ఉన్న యీ రోజుల్లో నిజాయితీగా పన్చేసే నాపై ఆరాధనా భావం ఉండటం సహజమేకదా!

దేశానికి సేవచేయటమంటే ఎవరి డ్యూటీవాళ్ళు నిస్వార్థంగా చేస్తే చాలని నా అభిప్రాయం.

నా వ్యక్తిగత జీవితంలో మాత్రం మావారితో కలిసి సరదాగా ఏ సినిమాకో షికారుకో వెళ్ళటానికి ఓపిక ఉండేదికాదు నాకు. కండ్లు తిరుగుతున్నట్లుండేది ఫిగర్

వర్కు చేసీచేసీ. ఒకసారి మేజర్ ఆపరేషన్ అయిఉంది నాకు కడుపుకు. ఎక్కువ శ్రమ కూడదని చెప్పారు డాక్టర్లు.

ఏడాది తిరక్కుండానే రోగం తిరగబెట్టింది నాకు అధిక శ్రమ, ఓవర్ హీట్ లతో. చీటికిమాటికీ పిలుస్తుండేవాడు ఆఫీసర్. నెలలో పదిరోజులు విపరీత బాధననుభవిస్తుండేదాన్ని అధిక రక్తస్రావంతో. ఆయన పిలిచినప్పుడు అలాంటప్పుడు లేవగానే సీటంతా ఖరాబయ్యేది ఒక్కోసారి. నలుగురూ చూస్తారేమోనని కుంచించుకుపోయేదాన్ని.

జబ్బు ముదిరి, యుటిరస్ (గర్భసంచి) తీసేయాల్సిన పరిస్థితి వచ్చింది నాకు. సంగతి తెల్సి, "శుభ్రంగా తీసేయించుకోవమ్మా ! ఎందుకు పీడ !" అని సలహా యిచ్చేవాడు ఆఫీసరు. వాడి నోటివాక్కేమిటో గానీ అప్పటికి కొందరికి పెండ్లి కూడా కాని వయసులో ఒక దుర్ముహూర్తాన నాకు అదే గతి పట్టింది.

ఆపరేషను అయిచాలా బలహీనంగా తయారైన నన్ను పరామర్శించటానికి వచ్చినట్లువచ్చి, రెండు నెలలుకూడా కాకముందే "ఏ. జి. ఇన్స్పెక్షన్ వస్తుంది. డ్యూటీలో జాయినవ్వు" అని గొడవపెట్టేవాడు. లేస్తే తల తిరిగిపోవటం, కనీసం న్యూస్ పేపరు చదివే ఓపికకూడా లేకపోవటంవల్ల, ధైర్యంచేసి, సెలవు పొడిగించాను

సెలవునుండి వెళ్ళి వచ్చినా వేరే సెక్షనుకు మార్చలేదు. పాత సీట్లోనే వేసి యిన్నిరోజులలో పెండింగులో ఉన్న వర్కంతా పూర్తిచేయమని ఆజ్ఞాపించాడు. చాలా బలహీనంగా ఉండేది. మందులువేసుకుంటూ, గ్లూకోజ్ నీళ్ళు త్రాగుతూ ఓపికకోసం పాటుబడేదాన్ని వెన్ను, మెడ నొప్పిగా ఉండేవి బాగా. దానికోసం ఆస్పత్రికెళ్లి ట్రాక్షను పెట్టించుకోవటం, ఎక్సర్ సైజులూ, వగైరాలతో బాధలు పడేదాన్ని. కొన్ని హార్మోన్సులోపంవల్ల క్యాల్షియం తగ్గి విపరీతపు నడుమునొప్పి, దిగులూ, నిరాసక్తతా పీడిస్తుండేవి నన్ను.

మగవాళ్ళు చాలామంది సంతకాలుపెట్టి సొంత పనులకు క్యాంటీన్లచుట్టూ తిరిగినా మా ఆఫీసరులాంటి ప్రబుద్ధులకు చీమకుట్టినట్లుండదు. నాలాంటి మెతక వాళ్ళను స్త్రీ అనే విచక్షణాజ్ఞానంలేకుండా గొడ్డుగాకిరీ చేయించటం బాగా తెలుసు.

సరైన టైమ్‌లో ట్యూబ్ టెస్ట్‌లూ, ఎక్స్-రేలలాంటివి చేయించుకుని విశ్రాంతిగా ఉండి మందులు వాడుతుంటే నాకు ఫలితముండేదేమో! ప్రొబేషను పీరియడ్ ఎక్స్‌టెండ్ అవుతుంది లీవ్‌లోపోతేనని బెదిరించి సకాలంలో సరైన వైద్యం చేయించుకోనీకుండా అడ్డుపడ్డాడు మా ఆఫీసరు నాపై కుబుద్ధితో.

* * *

"మన ఆఫీసరుగారు ట్రాన్స్‌ఫర్ అయారులెండి. మీకు పెద్ద రిలీఫ్. మీ సీట్లోపనిని కొంత రామారావుకూ, మురళికీ యిచ్చేద్దాం. వాళ్ళు పనిలేక ఈగలు తోలుకుంటున్నారు" అని చెప్పాడు మా సెక్షను సూపర్నెంట్ సీతాపతి ఒక శుభ ముహూర్తాన, రామారావుకూ, మురళికీ పన్లేదన్న నిజాన్ని అప్పుడే నిద్రమేలుకున్న వాడిలా తెలుసుకుని. ఏంచేస్తాడ్లే పాపం! ఆఫీసరేం చెబితే అది చేయాలిగదా!

"ఇంక యిప్పుడేమైతే ఏంలెండి? సకాలంలో వైద్యం చేయించుకోలేక ఆఫీసు పనికే అంకితమైన నాకు యింక పిల్లలుపుట్టే అవకాశమే కోల్పోబడింతర్వాత" అని విరక్తిగా అనుకుని నీరసంగా చూశాను మా సూపర్నెంట్ వేపు.

* * *

ఈ ధనలక్ష్మి తన పనికూడా నాచేత చేయించేది, నన్ను తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలనిచూసేది ఆ ఆఫీసరు ఉన్నప్పుడు. ఇప్పుడు నేను వేరే సెక్షనుకు వెళ్ళినా తనూ పలుకుబడి ఉపయోగించి నా వర్క్ మైండ్‌ను ఆసరాగా తీసుకుని నాచేత తన పన్లుచేయించుకోవడానికి రామేశ్వరంపోయినా శనేశ్వరం తప్పదన్నట్లు తయారై, ఏ ఓ. గారు చేయిపట్టుకున్నాడని బెదిరిపోతున్న ఫోజుపెడుతోంది తన దాకా వచ్చేసరికి, సదాశివబ్రహ్మంగారి-పెట్-పూర్ ధనలక్ష్మి.

* * *

( ఉదయం (ఆదివారం) 16-1-94 )

# కృష్ణవేణమ్మ

గం॥భా॥స॥లైన అక్కయ్యగార్కి కృష్ణవేణమ్మ నమస్కరించి వ్రాయునది ఇన్నేండ్ల తర్వాత నీవు నాయనమ్మవయినందులకు చాలా సంతోషంగా ఉన్నది. చి॥ బాబు బారసాలకు రాలేకపోయినందుకు అన్యథా భావించవద్దు. నాగమణికి 10వ క్లాసు పరీక్షలు అప్పుడు అందుకనే రాలేదు. త్వరలో రాగలము.

ఇట్లు
నీ చెల్లెలు
కృష్ణవేణమ్మ

ఆ ఉత్తరం చూడగానే నాగుండెలో రైళ్ళు పరుగెత్తాయి. ప్రశాంతంగా ఉన్న సరోవరంలో రాయిపడి కలకలం రేగినట్లూ, పెనుతుఫానేదో హాయిగా సాగిపోతున్న మా జీవితాల్లోకి ప్రవేశించి అల్లకల్లోలం సృష్టించబోతున్నట్లూ అన్పించి వణికి పోయాను చిగురుటాకులా. బారసాలకు పిలవకపోయినా బాగుండేదన్పించింది.

నా చెల్లెలని చెప్పుకోకూడదుకానీ, కృష్ణవేణి పరమ దుర్మార్గురాలు. చిన్నప్పటి నుండీ దాని స్వభావమే వేరు.

ఇంట్లో చాకిరీ అంతా చేసి, చెల్లెళ్ళనూ, తమ్ముళ్ళనూ సమర్థించుకుంటూ ఎవరి మనసూ నొప్పించకుండా ప్రవర్తిస్తూ తల్లిదండ్రికి చేదోడువాదోడుగా ఉండే నేనంటే అమ్మ. నాన్నకు విపరీతమైన ప్రేమ. నా చెల్లెలు కృష్ణవేణికి నన్ను చూస్తే యీర్ష్య ఉండేదందువల్లనే.

మగపిల్లలతో స్నేహాలు, మగరాయుళ్లా ఝల్వాగా తిరగటాలూ చేసేది. మా నాన్న చావగొట్టేవాడు దాన్ని అందువల్ల. దానితప్పది తెలుసుకోకుండా నేనే అట్లా చేయిస్తున్నానని నా మీద పడి ఏడుస్తుండేది.

అది మగ పిల్లలతో చేసే స్నేహం శృతిమించి రాగానపడే స్థాయి కొచ్చిందొకసారి.

ఖాన్ అనే కుర్రాడితో స్నేహం చాలాదూరం వరకూ వెళ్లేలా చేసింది.

అది తెలిసి మానాన్న చితకతన్నాడు దాన్ని. స్కూలు మాన్పించి, నెల తిరక్కుండానే ఒక వయసు మళ్ళిన రెండోపెళ్ళి వాడికిచ్చి, వివాహంచేసి. అత్త వారింటికి పంపేశాడు.

అందంగా ఉండే నా చెల్లెలి ప్రేమపిచ్చిలోపడ్డ ఖాన్ నిజంగానే పిచ్చివాడయిపోయాడు ఆ తర్వాత.

మా యింట్లో అందరికీ పెళ్ళయి అదెళ్ళిపోయింతర్వాత హాయిగా ఊపిరిపీల్చుకున్నట్లుగా ఉండేది. అదున్నప్పుడు ఏవో తగవులు యింటిమీదికి తెచ్చేది. మా అమ్మనాన్నలకు అవి తీర్చలేక తలప్రాణం తోకకొచ్చేది.

మా అత్తగారి ఊరు వాళ్ళ ఊరికి దగ్గర కావటంతో రాకపోకలు ఉండేవి మామధ్య తరచూ.

వాళ్ళ ఆడపడచులూ, బంధువుల మధ్య నన్నొక పురుగును చూసినట్లు చూసేది. డబ్బు మదంతో దాని కళ్ళు ఆకాశాన్నిచూస్తుండేవి. డబ్బు కోకొల్లలుగా లేకపోయినా మానాభిమానాలు అధికంగాగల నేను అదిచేసే అవమానాలు భరించలేక వెంటనే వచ్చేస్తుండేదాన్ని వాళ్ళింటినుండి.

* * *

కాలం కొన్ని సంవత్సరాలను తనలో యిముడ్చుకున్నది.

పిల్లల ఉద్యోగరీత్యా మేము హైద్రాబాద్‌లో స్థిరపడిపోయాం. అటువేపు నుండి వచ్చే బంధువులద్వారా మా చెల్లెలు వాళ్ళ సంగతులు తెలుస్తుండేవితప్ప. మేము అవైపు వెళ్ళటం పడలేదు.

నేను భయపడినట్లె ఓదుర్ముహూర్తాన ఊడిపడ్డది చివరి ఆడపిల్లలిద్దర్నీ తీసుకుని. వస్తూనే కావలించుకుని బుడి బుడిరాగాలు తీసింది. అవతలివారి సానుభూతి పొందడంకోసం కొందరువేసే ట్రిక్కు అది.

"అక్కయ్యా! ఆ చీర నాకిచ్చెయ్యవే!" అంది ఏ సంకోచంలేకుండా నాకున్న ఒకే ఒక్క మంచిచీరను, భోజనాలవీ అయి తీరిగ్గా కూర్చున్న సమయంలో స్వతంత్రంగా బీరువా తెరచి చూస్తూ.

ఆ చీరయియ్యి, యిదియ్యి, అదియ్యి, అని నా కూతురు దగ్గర, ఆమెకు తెలీకుండా కోడలువద్దా దజను చీరలదాకా గుంజారు, ఆపిల్లలిద్దరూ కూడా. నాకొడుకు, కూతురు మధ్య ఆప్యాయతలు జాస్తి. పక్కపక్కనే ఇళ్ళు కట్టుకున్నారీ మధ్య. అప్పులపాలయి ఉన్నాం అందుకే. అయినా ఆమె కష్టాల్లో ఉండి వచ్చిందని, అడిగినవన్నీ యిచ్చాం పిచ్చిగా.

మాటల మధ్యలో "మీ బావగారు పోయింతర్వాత ఉప్పెనలాగా వచ్చిపడ్డాయే కష్టాలు మా నెత్తిన. ఇహ పిళ్ళిద్దరున్నారు పెండ్లికి. ఎట్లా నెగ్గుకొస్తానో ఏమో!" పరమ విచారంగా మొహంపెట్టి చెప్పింది.

మా ఆయన గతించగానే తన యింట్లో ఉండమన్నాడు మమ్మల్ని నేనాదరిస్తానంటూ మామరిది. మా మాగాణిలో వచ్చే వడ్లు వాడుకుంటూ, నాచేత వడ్లు దంపించటం, యింటిల్లిపాదికీ రెండుపూటలా వంటా, వడ్డనా, నీళ్ళు తోడటం, అంట్లు తోమటం, ఒకటేమిటి? వెట్టిచాకిరీ చేయించుకున్నారు.

ఊరికే తేరగా తింటున్నామన్నట్లుండేవి నా చెల్లెలి మాటలూ, తన పిల్లలతో నా పిల్లల్ని చితక దన్నించటాలూను.

ఆడపిల్లకు చదువెందుకని నా కూతుర్ని స్కూలుకు పంపనిచ్చేవాడు కాదు మా మరిది. తన పిల్లలకు దర్జాగా పెండ్లిండ్లు చేయగలను గొప్పగొప్ప సంబంధాలు తెచ్చనిపడావు ఖుక్కకొడుతుండేవాడు అందరిముందూ.

కొడుకుని ఆడింది ఆటగా పాడింది పాటగా పెంచాడు, ఒకడే కొడుకని. వాడు ఒంగోలులో మకాంపెట్టి, సినిమాలు చూడటం, షికార్లు తిరగటంచేసి, మూడు వంతుల ఆస్తిని హారతి కర్పూరంలా హారంచేశాడు.

అయన బతికున్నరోజుల్లోనే కొడుకు, ముగ్గురు ఆడపిల్లలకూ పెండ్లిండ్లుచేశాడు ఆ తర్వాత మరో యిద్దరికి నా చెల్లెలే గంతకుతగ్గ బొంతలాంటి సంబంధాలుచూసి, చందాలడుక్కుని పెళ్ళిండ్లు చేసిందట.

అడిగినంత కట్నమివ్వలేదనీ, అదనీ, యిదనీ అత్తింటి వేధింపులెక్కువై పుట్టింటి దీన స్థితితెల్సిన ఒకపిల్ల బావిలోదూకి చచ్చిపోయిందట. అదే పరిస్థితిలో చిక్కుకున్న యింకొకతి "బతికుంటే బలుసాకైనా తిని జీవితంలాగించొచ్చనుకుని" అత్తింటి కూపంనుండి, తల్లిపంచనొచ్చి చేరిందిట.

చెల్లెళ్ళ పెండ్లిండ్లు చేస్తానని మాయమాటలుచెప్పి, నమ్మించి లంకంతలోగిలీ, మిగిలిన కాస్త పొలమూ అమ్ముకున్నాట్ట కొడుకు "పూలమ్మినచోటనే కట్టెలమ్ముకున్నట్లు" డబ్బు మదంతో ఒళ్ళు తెలియక యిది ఎద్దేవా చేసిన పక్కింటి రాఘవమ్మ గారి యింట్లో ఉంటున్నార్ట యిప్పుడు.

"ఎవరూరారు అమ్మా ! మా యింటికి, దయ్యాల్ని చూసినట్లు చూస్తున్నారు మమ్మల్ని. ఆ యింట్లో ఉన్న రాఘవమ్మగారి కుటుంబం అంతా టి. బి. తో చచ్చిపోయారు గదా! ఆ యిల్లు దరిజేరటానికికూడా భయపడ్డ వాళ్ళ బంధువులు పాడుబెట్టారు రెండేళ్ళనుండీ. అడవిలా ఉన్న ఆ యింటిని బాగుచేసుకొని ఉంటున్నాం మేము.

మా యింటికి దొడ్డివేపునుండే అంకిరెడ్డివాళ్ళు కొన్నారు మా యిల్లు. ముందు మనం నీళ్ళుకాగబెట్టుకునేచోట తడికెలు, రేకులు అడ్డంపెట్టుకుని ఉండేవాళ్ళం. అక్కడ ఎండ, వాన స్వైరవిహారంచేసేవి, ఆయాకాలాల్లో. రోగానపడ్డాం అందరం వాళ్ళు అక్కడకూడా ఉండనీయకుండా వెళ్ళగొట్టారు. అందుకే మొండి ధైర్యంతో ప్రక్కింటి రాఘవమ్మగారింట్లో చేరాం" అన్నది మా చెల్లెలి కూతురు నాగమణి.

మా మరిది బ్రతికున్న రోజుల్లో మేము అక్కడ ఉన్నప్పుడు యిద్దరు కుర్రాళ్ళను వారాలకు కుదిర్చాడు. వాళ్ళతో యింటి చాకిరీ అంతాచేయించేది మాచెల్లెలు. చద్దికూడు పెట్టి. నానా మాటలూ అనేది వాళ్ళను.

వృద్ధులైన అత్త, పిన్నత్తలతో యింటి చాకిరీచేయించి, కట్టెపేళ్ళతో వాళ్ళ నడుములు విరగగొట్టేది, వయసు పొగరుతో అది కాపురానికి వెళ్ళిన వెంటనే.

అట్లాంటి అకృత్యాలు చేసిన మనిషికి మంచి జరగమంటే జరుగుతుందా ! యిప్పుడు అనుభవించొద్దూ కర్మ ఫలాన్ని.

"అమ్మోవ్ ! పెద్దిరెడ్డిగారి నాగమ్మొండ్లా, కాసిని మజ్జిగబోస్తా రమ్మంటే వెళ్ళేదాన్ని. నన్నక్లా బడితెలా నిలబెట్టి, పొంతలో కాగిననీళ్ళు తోడి పిల్లలకు పోయ టం, ముగ్గుతో లాంతర్లగ్లాసులన్నీ తుడుచుకోవటంలాంటి ఎన్నో పన్లుచేస్తూ,'' కోతి మొహంముండా ! ఊరికే నిల్చోకపోతే మా పిల్లలకు పేలుచూసి, తలదువ్వి జడేయ కూడదా !'' అంటూ తిట్టిపోసేది.

రాములమ్మెమో ! భోషాణంలోంచి చిక్కటి మజ్జిగ తీసిపోయను మనసొప్పక పిల్లితాగిందనో, గేదె తన్నిందనో వంకలుపెట్టి మజ్జిగపోయకుండా ఒట్టిచేతులతో పంపేది.'' ఏడుపు గొంతుతో చెప్పుకుపోతుంది లీలావతి.

మా మరిది ఉన్నరోజుల్లో కోర్టు వ్యవహారాలనీ, అదనీ, యిదనీ వీళ్ళందరికీ సహాయంచేస్తున్నట్లుచేసి, బాగా డబ్బు కమీషన్‌గా గుంజేవాడు. ఇప్పుడు సందు దొరికేసరికి వాళ్ళు వీళ్ళనవమానిస్తున్నారు. సరికి సరి.........మరి.........ఏంచేస్తాం ? బాధపడటం తప్ప.

''మరే, అమ్మోయ్ ! మా అన్నయ్యలేదూ దొంగసచ్చినోడు. ఇల్లు అమ్మిన డబ్బులుకాజేసి ఫ్రిజ్, టీ వి. అన్నీ కొనుక్కున్నాడే మేం పొగాకు కంపెనీకి పన్లోకి పోతుంటాంకదా ! మా వైపు కన్నెత్తికూడా చూడడు. తన గొప్పకెక్కడ లోపంవస్తుందోనని'' అన్నది నాగమణి.

''బావ బ్రతికున్నప్పుడు బయటికి మొహంచూపి ఎరుగుదుమా ! ఇప్పుడు జంతి కలుచేసి మాలపల్లి, మాదగపల్లి వెళ్ళి అమ్ముకొస్తున్నానక్కయ్యా ! మీ ఊరెళ్ళి అసాముల భార్యల్నడిగి విడిచేసిన చీరలు, పాతదుప్పట్లనీ తెచ్చుకుంటున్నామే'' అంటూ వలవలా ఏడ్చింది కృష్ణవేణమ్మ.

వాళ్ళ కష్టాలన్నీ వింటున్న నా మనసు కరిగినీరైపోయింది. ఈ పిల్లలకు ఉద్యోగమిప్పించి వాళ్ళకి ఒకదారి చూపించమని చెప్పాలి నా కొడుక్కి అని నిశ్చయించుకున్నాను.

'నీకేంలే ! రాముడు చూశాడు కాబట్టి నిక్షేపంలా ఉన్నారు'' మూతి మూడు వంకర్లు తిప్పుతూ అన్నది. దానిమీద నాకింతకుముందే ఏర్పడిన సానుభూతికి ఆటంకం కల్గిస్తూ.

నోరుమంచిదయితే ఊరుమంచిదవుతున్న సామెత నా విషయంలో నిజమైంది.

నా తండ్రి పరమ మూర్ఖుడు. తల్లి మహాసాధ్వి. పేరు సీతమ్మ. సీతమ్మ వారిలాగే కష్టాలననుభవించింది నా తండ్రివల్ల.

ఊరికే తిని కూర్చుంటున్నావని తిట్టిపోస్తుండేవాడు నా పెద్దన్నను మాతండ్రి ఆ పోరు భరించలేక నా అన్న గుంటూరువెళ్ళి వారాలుచేసుకుని చదువుకుంటుండే వాడు. కడుపునొప్పివచ్చి ఆపరేషన్‌జరిగి మరణించాడు. అదీ ఆయన స్నేహితుల ద్వారానే తెలిసింది. నా తల్లి ఆ కడుపుశోకం భరించలేని స్థితిలో ఉన్నప్పుడు చిన్నదాన్నయినా మిగతాపిల్లల పోషణ, యింటి పని బాధ్యతతీసుకునినా తల్లిని దుఃఖసమయంలో ఆదుకున్నాను.

అలాగే నా తండ్రి నా మరో తమ్ముడికి సకాలంలో వైద్యంచేయించకపోవ టంతో అర్థాంతరంగా మరణించిన నా తమ్ముడిచావుతో కృంగిపోతున్న నాతల్లికి అన్ని విధాలా ధైర్యంచెప్పి తోడూ, నీడగా ఉన్నాను.

ఎస్.ఎస్.ఎల్.సి. అయిపోగానే ఉద్యోగంచూసుకోమని, అందాకా తిండిపెట్ట వద్దనీ నా తమ్ముడు రాముడిగురించి బహు మూర్ఖంగా నా తండ్రి వ్యవహరిస్తే తల్లిలాగా ఆప్యాయతకురిపించి అన్నంపెట్టి ఆదరణ చూపించిన నాపై అభిమాన ముండటంలో ఆశ్చర్యమేమున్నది? రాముడికి. అందుకే ఎవరితో చెప్పకుండా యిల్లొదిలి మిలటరీలోచేరిపోయి, తర్వాత ఉత్తరం వ్రాశాడప్పుడు రాముడు తను బతికేఉన్నట్లు. ఏంచేస్తాడుపాపం! సర్టిఫికేట్ నలిగిపోయింది కానీ, ఉద్యోగమైతే దొరకలేదిక్కడ వాడికి.

నా భర్త గతించగానే తోడికోడళ్ళు, బావలూ నన్నూ నాపిల్లల్నీ అన్యాయంగా వేరుపెడితే నన్నాదుకున్నాడు. పిల్లల్ని చదివించి, వాళ్ళకాళ్ళపై వాళ్లు నిలబడగల్గేలా చేసిన ధన్యుడు నా తమ్ముడు.

వాడు అందరికీ డబ్బుపంపుతుంటే నా చిన్నపిల్లల్ని వదిలిపెట్టెళ్ళి చెల్లెళ్ళ పురుళ్ళూ, పుణ్యాలూ, చాకిరీలు చేసేదాన్ని. ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్ళై, నాకు ఓపిక నశించిన తర్వాతకూడా నేవెళ్ళి వాళ్ళకు ఊడిగం చేయటంలేదని నా మిగతా చెల్లెళ్ళ బాధ యిప్పుడు.

"రంజాన్ పండగప్పుడూ, పీర్ల పండగప్పుడూ సాయిబుల బజారు కెళ్ళి దబ్బులడుక్కొచ్చుకునీ, కంసాలి బ్రహ్మయ్యవాళ్లు, కోటప్పకొండకూ, గంగమ్మ తిరునాళ్ళకూ, సింగరకొండ తిరునాళ్లకూ ప్రభలు కట్టేటప్పుడు పనులుచేసి, ఆసాముల్ని బ్రతిమాలుకునీ, కూలికిపోయి బ్రతుకున్నాం అమ్మా! మేము'' కండ్లనీళ్ళూరగా బాధగా చెప్పింది నాగమణి మళ్ళీ.

"నీ కొడుకు బంగారు తండ్రి. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నాడు నా కొడుకు ఉన్నాడెందుకూ! నా పతనాన్ని కోరుతూ వాడిజిమ్మడ" మెటికెలు విరుస్తూ అన్నది నా చెల్లెలు.

ఎందుకుంటుంది తల్లిమీద ఆకొడుక్కి ప్రేమ! కోమటి కోటిశెట్టితో, కంసాలి పీరాచారితోనూ అక్రమసంబంధాలు జరిపిన తల్లిమీద. ఆ కొడుకు మంచం క్రింద ఉండి యిదిచేసే అఘాయిత్యాలన్నీ గమనించేవాట్టమరి.

కూతుళ్ళు తల్లి అక్రమ సంబంధాల్ని సహిస్తారేమోగానీ, తల్లిచేసే అటువంటి పనుల్ని కొడుకులుమాత్రం భరించలేరు, అందుకే తల్లికి నిలవ నీడలేకుండాచేశాడు. ఆ కొడుకు కసితో.

నా కోడలితో ఒకటే గుసగుసలు చేయటం మొదలుపెట్టింది. నా చెల్లెలు.

''ఏం కూతురికెందుకు పన్చెయ్యాలి? ఆవిడకేనా ఆపరేషన్లయ్యింది. నాకు కాలేదా! ఒకసారి" అంటూ కొట్లాడింది నన్ను మా కోడలు, నా చెల్లెలి చెప్పుడు మాటలు విని ఓరోజు.

చిన్నతనంలోనే రోగంబారినపడ్డ నా కూతురికి గర్భనంచీ, ఓవరీస్ తీసేశారు. శక్తి లేకుండా ఉండేది ఆమెకు. ఊరికే అలసటపడేది. కాస్త వంటచేసిపెట్టి, వచ్చేదాన్ని ఆమె ఆఫీసుపనీ, యింటిపనీ చేసుకోలేకపోతుండటంవల్ల కన్నతల్లినెదురుగా ఉండి దాని బాధలు చూడలేకపోవటంవల్లనూ.

కొడుకింట్లోకూడా ఏదో చేస్తూనే ఉండేదాన్ని. వాళ్ళు పనులకెళ్తే పిల్లాడ్ని చూడటం, పగైరాలలాంటి పన్లు సరిపోయేవి.

పన్లన్నీ ఒకెత్తు, పసిపిల్లల్ని పెంచడమొక ఎత్తూనూ. వాళ్ళతో పరుగులు తీసీ, అటు తిరిగీ, యిటుతిరిగీ బాగా డస్సిపోయాను 60 ఏళ్ళపైబడిన నేను, మోకాళ్ళ విపరీతపు నొప్పులూ, సరిగా నడవలేను.

నా కోడలికి ఉన్నవీ, లేనివీ నూరిపోసింది కృష్ణవేణమ్మ. నా కోడలసలే పరమ గయ్యాళి. ఎప్పుడూ వేరుకాపురం కావాలంటూ నా కొడుకుని వేధించుకు తింటూ, అలిగి పుట్టింటికి పోతుండేది.

ఒకరోజు అలాగే తగవుపెట్టుకున్నది. "నీకు తల్లి కావాలో నేనుకావాలో తేల్చుకో" అని పెట్టెబేడా సర్దుకొని పుట్టింటికిపోయింది. నా కూతురికి పిల్లల్లేరు. లేకలేక పెండ్లయిన పదేళ్ళకు నా కొడుకుకు కలిగిన పిల్లాడంటే ప్రాణం నాకు. బతిమాలి తీసుకురావడానికిపోతే పిల్లాడ్ని తీసుకుపొమ్మని బంతిలా పిల్లాడ్ని పిడిపైకి విసిరేసి, మర్నాడు పోలీస్ రిపోర్టుయిచ్చింది. అత్త, మొగుడూ, ఆడబిడ్డా తన్ని తగలేశారనీ, అదనీ, యిదనీ, పిల్లాడ్ని కత్తిచూపి బెదిరించి తీసుకుపోయాడనీ, పాలివ్వక పాలిండ్లు వాచిపోయాయి అనీనూ, పాలివ్వటం ఎన్నడో మానేసింది.

పోలీసులొచ్చారు పిల్లాడ్ని తీసికెళ్ళటానికి చుట్టుప్రక్కలవాళ్ళంతా మేము మంచివాళ్ళమనీ, కోడలు రాక్షసిలాంటిదని పోలీసులకు చెప్పారు.

"స్టేషన్కొచ్చి పిల్లాడ్ని అప్పగించండి. తల్లెలాంటిదయినా, ఐదేండ్లవరకూ ఆవిడవద్దే ఉండాలి.'' అన్నారు పోలీసులు అంటే రాక్షసిలాంటి తల్లితో నరకం అనుభవించాలన్నమాట, అంత వయసొచ్చేవరకు. న్యాయసూత్రాలతీరు అలా ఉంటుందన్నమాట. మాపై ఉక్రోషంతో పసిపిల్లాడ్ని హింసించేది కోడలు.

పోలీస్స్టేషన్కెళ్ళటమంటే నాకు తలకొట్టేసినట్లయింది. ఎంతో కృంగిపోయాను. దిగ్గుళ్ళిపోయాను. పిల్లవాడు దూరమయి పోతున్నందుకు, అక్కడే గుండెలు పగిలేలా ఏడ్చాను. మా జీవితంలో నిప్పులుపోసింది కృష్ణవేణమ్మ. పోన్లేపాపం! గతిలేక వచ్చారని, యీ కరువురోజుల్లో నెళ్ళాళ్ళు తిండిపెట్టి, అడిగిన బట్టలిచ్చి, అప్పులుచేసి, కొత్తవికూడా కొనిపెట్టినందుకు మా యింట్లో చిచ్చులు రేపిందీనాడు నా చెల్లెలు కృష్ణవేణమ్మా.

నా చెల్లెలి మొహంచాటుగా గమనించాను నేను. ఆమె ఆనందం వర్ణనాతీతం. మేమేడుస్తుంటే పడీపడీ నవ్వుతున్నది కారణంలేకుండా.

నా తల్లిదండ్రులు నన్ను ప్రేమగా చూసేవారనీ, నా తమ్ముడు కష్టకాలంలో నన్నాదుకున్నాడనీ, నా పిల్లలిద్దరితో నేను సుఖంగా ఉన్నాననీ నా చెల్లెలికి నాపై అంతులేని యీర్ష్య, పగ.

నేనెంత మంచిదాన్నో, అంత అమాయకురాల్ని. పల్లెటూరిలో కరువొచ్చి, తిండికి జరగకపోతే పట్టణమొచ్చాం మేము. పట్టణంలో ప్రవేశించగానే ఎలక్ట్రిక్ స్తంభాలను చూసూ "వామ్మో" "వోర్నాయనో" అని ఏడ్చాను. అంత దూరంలో పట్టాలమీద రైలుపోతుంటే ఒంటెద్దు బండిదిగి అటూ, ఇటూ పరుగెత్తాను పిచ్చిగా.

కరణంగారి తోటలో జామ, మామిడి, దానిమ్మ, సపోటాలాంటి రకరకాల పండ్లచెట్లూ, జాజి మల్లె, మందార, పున్నాగ, పన్నీరు పూలచెట్ల మధ్య హాయిగా తాటాకు బొమ్మలు, గుడ్డబొమ్మలతో ఆడుకునే నాకు వయసు ఎక్కువగల ఆయనతో నా ఏడవ ఏటనే వివాహం జరిపించారు మా నాన్న. అన్నింటికీ సర్దుకుపోవటం అలవాటుచేసుకున్నాను ఆ వయసులోనే. పీపాలతో మంచినీళ్లు ఎద్దుబండి మీద తీసికెళ్ళి, దొరల బంగళాలకుపోసి, మమ్ముల్నందర్నీ పోషించేవాడు మా నాన్న. ఆ రోజుల్లో తిండికి లేకపోయినా ఫర్వాలేదుగానీ, డజనుమందికి తక్కువ పిల్లలు లేకుంటే వెలితిగా ఉండేది.

నా తల్లి పదోకాన్పులో పిల్లను కని బాలింతచేష్టవచ్చి, చనిపోతే, నా తండ్రి ముండల్ని మరిగి, పిల్లల ఆలనాపాలనా పట్టించుకోకపోతే, అంత ఆస్తి ఉండీ కృష్ణవేణమ్మ వీళ్ళ మొహంకూడా చూడకపోతేనూ నాకున్నదాన్లోనే పెట్టి నావాళ్ళంద రికీ అండగా నిలబడ్డాను నేను.

కానీ నా అమాయకత్వం, మంచితనం యీనాడునన్ను ఆదుకోలేకపోయాయి.

నా జీవితపు చివరి అంకంలో తీరని లోటును, పూడ్చలేని అగాధాన్ని కల్గించింది, కృష్ణవేణమ్మా నా కోడల్ని, మనవడ్ని దూరంచేసి, ఔరా! ఒకే తల్లి బిడ్డలలోకూడా పగ ఎంతటి అకృత్యాల్నయినా చేయించగలదు కదా! అని ఆశ్చర్యపోయాను.

కృష్ణవేణమ్మా, పిల్లలూ ఊరెళ్తున్న రోజున రక్తసంబంధ పీడనవల్ల కళ్ళల్లో నీళ్లు సుడితిరిగాయి. అలాంటి స్థితిలోఉన్న నన్ను ఓ వెర్రిగొడ్డును చూసినట్లు చూసిందది పిల్లలతో ఆటోలోఎక్కి కూర్చుంటూ. దాని కళ్ళలో అంతులేని ఆనందం. పగ సాధించగా కల్గిన అనంతమైన రాక్షసానందంచూసి నివ్వెరపోయాను నేను.

( మయూరి వీక్లీ, తేది. 15-4-94 )

# "బ్రతకనేర్చిన కథల కాణాచీ"

"శాస్త్రి యీ రోజు ఎందుకో రాలేదూ........" అన్నాడు టైపిస్ట్ సత్యనారాయణ నవ్వుతూ.

"కొడుకుకు సీరియస్‌గా ఉందనీ వెంటనే రమ్మని యింటివద్ద నుండి ఫోనొచ్చిందట'' చెప్పాడు అటెండర్ బాబయ్య.

"ఏదైనా చావుకబురు తెలిస్తేనే, తనేపోయినట్లు ఫీలవుతాడే, కొడుక్కి సీరియస్‌గా ఉందని తెలిసి ఎలా తట్టుకున్నాడో, ఏమో" అన్నాడు మరో టైపిస్ట్ రామకృష్ణ.

"అతనికి తెలిని విషయంలేదనుకోండి. ఏ సబ్జక్ట్ గురించిఎత్తినా, దానిపై గలగలా మాట్లాడేయగలడు" అన్నది సీనియర్ అసిస్టెంట్ చారుమతి.

"మొత్తానికి ప్రత్యేకత కల్గిన వ్యక్తి'' అన్నాను నేను.

మర్నాడు లంచ్ అవర్లో వచ్చి, తాపీగా కూర్చున్నాడు చీఫ్ ఇంజనీర్‌గారి స్టెనోగ్రాఫర్ శాస్త్రి.

''ఏమైందండీ మీ బాబుకు? సీరియస్సేమిటి?" అన్నారు కోరస్‌గా మా సెక్షన్ స్టాఫ్ అందరూనూ.

''అ....ఏమీలేదు! ప్రొద్దున స్కూలుకెళ్ళేటప్పుడు ఏమీ తినలేదట, కాస్త సుకుమారుడు కదా! కళ్లుతిరిగిపడిపోయాడు. ఈ టీ. వి. లు చూసికూడా కళ్ళు తిరుగుతాయి మేడమ్ పిల్లలకు. దాంతో మా ఆవిడ కంగారుపడిపోయి, నన్ను గాభరా పెట్టేసింది" తాపీగా చెప్పాడు శాస్త్రి.

''అమ్మయ్య'' అని ఊపిరిపీల్చుకున్నాం అందరం.

"అవున్లే ఎక్కడి డబ్బా మీ సౌందర్య సాధనాలకు, మీ ఆరోగ్యం కాపాడు కోటానికే చాలదయ్యే. పిల్లాడికి సరైన పోషకాహారంలేకే అలా అయుంటుంది." అంటూ గొణిగింది నా ప్రక్కనే ఉన్న జూనియర్ అసిస్టెంట్ హిమంత.

టాపిక్ అనుకోకుండా సౌందర్య సాధనాలమీదకు మళ్ళింది.

"శాస్త్రిగారూ! మీకు నలభైఏళ్ళుదాటినా మీ జుట్టు తుమ్మెదరెక్కల్లా నిగనిగ లాడుతూ ఉండటానికి ఏదేనా వాడుతున్నారా? మాకూ ఆ రహస్యంచెప్పి పుణ్యం కట్టుకోగూడదా!" ఉత్సుకతతో అడిగాడు సత్యనారాయణ. ముప్పయ్ ఏండ్లే అయినా తలంతా ముగ్గుబుట్టలా అయింది అతనికి.

"నలభై నలభై అంటారు. నలభై యీ రోజుల్లో పెద్ద లెక్కలోకిరాదు నా ఉద్దేశ్యంలో. ఈ మధ్య చాలామంది మన ఆఫీసులో నాకు రెండేళ్ళెక్కువ, మూడేళ్ళెక్కువ వేయించారని చెప్పటం మామూలైపోయింది. అసలు వయసొస్తున్నదని ఆందోళనపడటం పెద్దతప్పు, అలా అనుకున్నా జుట్టు తెల్లబడుతుంది. ఒకవేళ తెల్లబడిందనుకోండి! ఏ రంగో వేసుకుంటేసరి. ముసలాళ్ళా కనబడాలని రూలేముంది? నేను నిత్యం ఆకుకూరలు వాడతాను. ముఖానికి వెన్న, పాలమీద మీగడా రాస్తుంటాను. ఆయిల్స్ అతిగా వాడను. ఉదయం లేస్తూనే గోరువెచ్చని నీళ్ళలో ఒక నిమ్మకాయపిండి, ఒక స్పూన్ మంచి తేనె అందులో కలిపి తాగుతాను కాఫీ, టీ లు త్రాగను, ప్రతిదీ ఒక లిమిట్‌లో తీసుకుంటాను. ఉదయం, సాయంత్రం వాకింగ్ వెడతాను. అందుకే చలాకీగా, పాతికేళ్ళ కుర్రాడిలా ఉంటాను" అంటూ చెప్పుకొచ్చాడు శాస్త్రి. ఈ మధ్య నడుస్తుంటే పాదాలవద్ద చిటుకుచిటుకు శబ్దాలు వస్తున్నాయని రోజూ క్యాల్షియం టాబ్లెట్స్ మింగుతున్నాడట.

"దేవత, పూజాఫలం, అగ్గిపిడుగు, తోటరాముడు, నువ్వా? నేనా? లాంటి సినిమాలు యిప్పుడు రావటంలేదేటీ" విశాఖయాసలో అడుగుతూ సినిమాలవేపు దృష్టిని మళ్ళించాడు యింకో టైపిస్ట్ అప్పారావు.

"ఇప్పటివాళ్ళకవెందుకండీ! ప్రక్కింటి మొగుడు నీకు, ఎదురింటి పెళ్లాంనాకు హంతకుడు, రాక్షసుడులాంటి సినిమాలు కావాలికానీ. అయినా సినిమాలలో కూడా క్వాలిటీ తగ్గిపోయింది బ్రదర్. ఈరోజు సినిమాలో కన్పించిన హీరోయిన్

కొన్నాళ్ళకు అడ్రస్ లేకుండా పోతోంది. వందల సిన్మాలొస్తున్నాయి, ఒక్కదాన్లోనూ గుర్తుపెట్టుకోవాల్సిన మంచి పాటే ఉండదూ........" దీర్ఘంతీశాడు శాస్త్రి. "ఇహ వీణ పాటలుంటాయా! అవి క్లోజప్‌లో చూపించగూడదు మేడమ్. ఎందుకంటే హైపిచ్‌లోరాగం ఉంటే వీళ్ళు, మంద్రస్థాయి స్వరాలమీద చేతులాడిస్తూ ఉంటారు. కొందరయితే వీణను మీటటమే ఉండదు...." మళ్ళీ తానే అన్నాడు.

ఇంతలో సి.ఇ.గారు పిలుస్తున్నారంటూ అటెండర్ వచ్చి పిలవటంలో గాభరా గాభరాగా లేచెళ్లాడు శాస్త్రి.

రోజూ లంచ్ అవర్లో మంచి కాలక్షేపం మాకు. అతని మాటల ధోరణి నవ్వు తెప్పించక మానదు ఎటువంటివారికైనా.

"ఇతనండీ ఏ ఆఫీసర్ దగ్గర పన్చేసినా ఒక సర్టిఫికేట్ తీసుకుంటాడండీ! ఫలానా తేదీనుండి ఫలానా రోజువరకూ నాక్రింద పన్చేశాడు మంచిగా అని. అవన్నీ పెద్దఫైల్ చేశాడట. ఇలాంటివాటిని గిన్నిస్‌బుక్‌లో కెక్కించటానికి పంపాలండీ అసలు అన్నాడు'' బాగా చదువుకున్న అటెండర్ సుబ్బారావు.

"ఏదైనా పెద్ద స్టేట్‌మెంటొస్తే తనుచేయడు. మాలాంటి వాళ్ళపై రుద్దుతాడు ఊరికే టైప్‌కొడుతూఉంటే చేతులులాగుతాయట. పక్షవాతం వస్తుందట. పైగా మీరు అనవసరంగా కష్టపడుతున్నారు. పంక్చువాలిటీని పాటిస్తూ, నిజాయితీగా ఒళ్ళువంచి పన్చేస్తే రోగాలు తప్ప మెడల్స్‌రావు ఆఫీసుల్లో, మన సుధా మేడమ్‌కు లాగా. సుధా మేడమ్‌కు వడ్డాణాలూ, (నడుముకు బెల్టు) కంఠాభరణాలు (సెర్వికల్ కాలర్) వచ్చాయి కదా! నాది సొంత ప్రాణంగదా! నేను చస్తే మీలాగా టైప్ మిషన్‌కు అతుక్కుపోయి, ఆరోగ్యం చెడగొట్టుకోనంటాడు మేడమ్" శాస్త్రి, గురించి మరో విషయం చెప్పింది లేడీ టైపిస్ట్ సుధారాణి.

ఆ మర్నాడు లంచ్ టైమ్‌లో వచ్చాడు శాస్త్రి వస్తూనే ఏవో మాటల్లోకి దిగాడు. లంచ్‌టైమ్‌లో వస్తాడు కాబట్టి, ఎవరో ఒకరు అతనికి టిఫిన్ తెప్పించి పెట్టేవారు సైనోకదా! అని.

"మన రచయిత గిరిరావుండ్లా........వాడికి ఏదో అవార్డు వచ్చిందంట. తెగ ఊగిపోతున్నాడు" అన్నాడు నెల్లూరు జిల్లాకు చెందిన మంగరాజు.

''ఏవుంది లేవోయ్........మంచి మంచి ఇంగ్లీషు నవల్లు కొని, తెలుగులోకి దించుతాడు గురుడు. ఈ రోజుల్లో చాలామంది సూపర్ రైటర్స్ అందరూ చేస్తున్న పనేగా! కొంతమంది రచయిత్రులూ వీళ్ళకేం తీసిపోవటంలేదు. వాళ్ళ శాయశక్తులా అరవం, కన్నడం నవలలను కాపీలుకొట్టి మహా రచయిత్రి బిరుదుకోసం వెంపర్లాడిపోతున్నారు. వీళ్ళు తమకు తెల్సిన చిన్న చిన్న రైటర్స్‌ని వృద్ధిలోకి రానీయరు. తమ పలుకుబడి నుపయోగించి సదరు ఛోటా రచయిత (త్రి) ల రచనలను కానీ, కార్టూన్సునుగానీ ప్రచురించనీయకుండా చేయటమో లేక ముఖ్యమైన విషయాలను వాళ్ళ రచనల్లో తెలివిగా చొప్పించటమో చేస్తుంటారు. ఇహ పనిమనిషి పాత్రలకుకూడా ముద్దుపళని అనో సౌందర్య తిలక అనో ఒకరిమీద మరొకరు పోటీపడుతూ కొత్త కొత్త పేర్లు పెడుతుంటారు అనౌచిత్యంగా ఎవరైనా తమ అనుభవాలను, సమాజంలో తమకు తెల్సినవాళ్ళ అనుభవాలనూ కధలుగా నవలలుగా కొన్ని మాత్రమే వ్రాయగలరు తమదైన శైలిలో. సూపర్ రైటర్లూ, పరిశోధనాత్మక అంశాలతో వ్రాసే రైటర్లూ పేరుకోసం యితర భాషా నవలలనూ కాపీకొట్టేవారే దాదాపు అందరూనూ.

ప్రతి పత్రికనూ కొందరు రైటర్లు సొంత రాజ్యంలా ఏలుతుంటారట మేడమ్. కొన్ని పత్రికలలో కొత్త శీర్షికలు ప్రారంభిస్తూ, పాఠకులను వాటికి సంబంధించి కధలో, మరేవో పంపమంటారు. ఆ శీర్షికలో అయా పత్రికలవార్కి బాగాతెల్సిన వాళ్ళవి వేసుకుని వెంటనే ఆ శీర్షికను ఆపివేస్తారు. అట్లా వివిధ శీర్షికలకూ తాము పంపినవి ప్రచురిస్తారేమోనని, ఎదురుచూసి, చూసీ విసిగిపోయే వాళ్లెందరోగదా! మేడమ్. ఇహ కొన్ని ప్రశ్నోత్తరాల శీర్షికలుంటాయా? ఆ జవాబులు చూడాలి. ఏభైఏళ్ళొచ్చిన తాయారమ్మ కుర్రదాన్లా తయారై, ఆ శీర్షికలో నలభైఏళ్ళ వ్యక్తి అడిగే శృంగార సంబంధమైన ప్రశ్నకు జవాబుగా "సెక్స్ ఎందుకు నీకు? కృష్ణా, రామా అనుకోక యీ వయసులో" అంటూ కసురుకుంటుంది ప్రశ్న వేసిన వ్యక్తిని తనో పెద్ద సర్వజ్ఞురాలిలాగా. తమకో న్యాయం! యితరులకో న్యాయం అన్నట్లుంటాయి సదరు వ్యక్తులిచ్చేయిలాంటి జవాబులు చదువుతుంటే," లంచ్ టైం అయిపోవటంతో ఎవరో వెనకనుండి తరుముకొస్తున్నట్లు లేచి వెళ్ళిపోయాడు శాస్త్రి.

"మొన్న రోడ్‌వారగా యిద్దరం నడుస్తున్నామండీ. ఓ శవం ఎదురొచ్చింది తనటు చూడకుండా గబగబా ముందుకెళ్ళి, నీకింత భయమైతే ఎలా సత్యనారాయణా! ఎవరికైనా, ఏనాటికైనా చావు తప్పదుగదా!'' అంటూ లెక్చరిచ్చాడండీ నాకు.''

"ఇద్దరం నడుస్తూ ఉంటామా? ఏ వెహికలైనావచ్చి, తనను గుద్దుతుందేమోనని. తనిటొచ్చి, నన్ను రోడ్ వేపుకు నెట్టుకుపోతాడు మాటల మధ్యలో నన్నిరికించి" చెప్పాడు మళ్ళీ సత్యనారాయణ.

''ఎంతైనా సొంత ప్రాణంకదండీ మరి! ఆయనది. మనవన్నీ అద్దెప్రాణాలయ్యె'' నవ్వుతూ అన్నది చారుమతి.

ఈనాటి రాజకీయాల గురించి, అన్ని వ్యాపారాలలోని లొసుగుల గురించీ, ఆఫీసర్ల వింత మనస్తత్వాల గురించీ అనర్గళంగా మాట్లాడగలడు. బంజారాహిల్స్ లోనూ, జూబ్లిహిల్స్‌లోనూ బాగాడబ్బున్న వాళ్ళిళ్ళలో కుక్కలు చాలా ఉంటాయట. అవి గేదెల్లాగా బలిసి ఉంటాయట. సిగ్నల్స్ క్లియర్ కాగానే వెహికల్సన్నీ రన్నింగ్ రేస్‌కు రడీగా ఉన్నట్లు ఒక్కసారిగా ముందుకు దూకుతాయట అన్నీ బాగా అబ్జర్వ్ చేస్తూ ఉంటాడు అని అనుకున్నానునేను. తను నవ్వకుండా, తన మాటలతో యితరులను నవ్వించగల దిట్ట శాస్త్రి.

మా కాంపౌండ్‌లో క్రిందా పైనా కలిపి పన్నెండు భాగాలున్నాయి మేడమ్, నేనూ మరొకరూ తప్పించి ఓనరుకు సరిగ్గా అద్దె చెల్లించరు. అందరూ ఒక సంఘంగా ఏర్పడ్డారు. కాస్త అద్దె పెంచమని అడిగితే అందరూ సమావేశమై ససేమిరా అద్దె పెంచేదిలేదని తీర్మానిస్తారు. ఓనరుగానీ అతనికొడుకుగానీ, వచ్చినప్పుడు వాళ్ళను తన్నబోతారు. బూతులు తిడతారు వారి భార్యలను వీరు యింట్లోలేని సమయంలో అద్దెగురించి అడగకూడదు. ఒకసారి బంగారమ్మను యింటాయన కొడుకొచ్చి అద్దె యీ నెలన్నా యివ్వకపోతే ఎలాగా అని గట్టిగా అడిగాడని ఆ తర్వాత ఆవిడ భర్త వాపారావు వచ్చి యింటతని కొడుకు చొక్కాకాలరు పట్టుకుని, గుండెలమీద తన్నాడు పాపం! ఎక్కడైనా ఉందా మేడమ్! ఓనర్ల ఆగడాలగురించి మనం వింటాం కానీ, అంటూ కొత్త సంగతులు చెప్పాడొకరోజు శాస్త్రి.

"అద్దెకున్న వీళ్ళ పిల్లల్ని టీచర్లు కొట్టగూడదరుట, అలా జరిగితే మగవాళ్ళొళ్ళి సదరు టీచర్లను తన్ని వస్తారుట. వాకిళ్ళముందుకు వచ్చే కూరగాయల బండ్లవాళ్ళను వీళ్ళడిగిన రేట్లకివ్వకపోతే కొట్టినంతపని చేస్తారుట వాళ్ళ భార్యలు'' మళ్ళీ తనే చెప్పాడు శాస్త్రి.

''మా ఆవిడుంది చూశారూ ! హ్యాండ్ బ్యాగ్ పట్టుకెళ్ళవే ఆఫీసుకంటే వినదు. కర్చీఫ్‌లో చుట్టి చేత్తోలో పట్టుకుంటుంది పెన్సిలూ, అవొక్కసారి లూజయి, బాడీ క్రిందపడి, క్యాప్ ఒక్కటే మిగులుతుంది. అలా ఎన్ని పారేసిందో ! హ్యాండ్ బ్యాగులు బుజాలకూ, చేతులకూ తగిలించుకునేవారంతా ప్రత్యేక కోవకు చెందిన వారనీ, తను అలా జన్మలో ఉండలేననీ బాధపడిపోతుందావిడ. అయితే యీ మధ్య కాస్త మారిందిలే. కొత్తగా ఒక స్నేహితురాలు దొరికింది. ఆవిడ పోరు పడలేక హ్యాండ్ బ్యాగ్‌ను పేపర్లోచుట్టి తీసికెళ్ళటం నేర్చుకున్నది, కొన్నాళ్ళకు ఆ పేపరు తీసివేసి మామూలుగా పట్టుకెళ్ళుతున్నదిలే. ఇలాంటివాళ్లు తా మేదన్నా చేస్తే బ్రహ్మాండం బద్ధలైపోతుందేమోనని బాధపడిపోతూ, యితరులను బాధపెడు తుంటారు మేడమ్" అంటూ సుదీర్ఘంగా ఎన్నో మాట్లాడాడు శాస్త్రి ఆ రోజు.

"మా పేరిలింగడున్నాడా ? వాడు తల్లితో ఎంత గాడిద చాకిరీ చేయించే వాడనుకున్నారూ ! నేను క్రిందనుండి నీళ్ళు తేలేనురా నాయనా! అంటే ఎవరికోసం తెస్తావే! నల్లా నీళ్లుతెచ్చి, నాకు తలకుపోయాల్సిందే అనేవాడు. ఇప్పుడు పెళ్లయింది పెళ్ళాం కష్టపడుతుందని స్టవ్‌లూ, కుక్కర్లూ, సోఫాలూ, మిక్సీలూ అన్నీ కొన్నాడు. తల్లి కుంపటిమీద వంటచేయలేకనానా అవస్థపడుతుంటే స్నేహితులను కూడా తెచ్చి రకరకాల టిఫిన్లుచేయమంటూ తల్లిని చంపుకుతినేవాడు. ఇప్పుడేమయింది? తోమిన అంట్లు లోపలపెట్టటం, తరచూ వంటచేయటం, ఉతిక ఆరవేసిన బట్టలు మడత పెట్టటం, ఒకటేమిటి? తల్లి వేడిపించినందుకు 'తగినశాస్తి' జరిగింది వెధవకు" అని ఒక కథ చెప్పుకొచ్చాడొకనాడు శాస్త్రి.

శాస్త్రిగారి మరదలు ఆశాలతకు సామాన్ల పిచ్చిట. ముగ్గురి పిల్లలపుట్టిం రోజులకూ ఆమె భర్త అహోబలరావును ఆఫీసు స్టాఫ్ అందర్నీ పిలవమంటుందిట. "సిటీకదా ! సంవత్సరానికి మూడుసార్లు చంపుకుతింటాడు మనసారు. మనకు కూర్చోటానికి చోటులేక మంచాలెక్కుస్తారు. వాళ్ళింట్లో ఉన్నవి ఎవరైనా తెస్తే అప్పుడే ప్యాకెట్ విప్పి, మాకున్నదే తెచ్చారే ! అంటుంది మొహమాటంలేకుండా.

ఏం తేవాలో తనే చెబుతుంది." "ఆ వచ్చే సామాన్లకంటే తిండ్లకయ్యే ఖర్చు ఎక్కువ అవుతుంది. నన్ను అప్పులపాలు చేసి, బతకనివ్వవ్" అని మావాడంటే వాడ్నిపీకి, పాకాన పెడుతుంది. అంత సరదాఉంటే చుట్టుప్రక్కలవాళ్ళకు స్కూల్లోనూ చాక్లెట్లు పంచిపెట్టొచ్చుకదా ! యిలా ఉంటాయ్ మేడమ్ కొందరి అవస్థలు" అన్నాడు మళ్ళీ.

మరొకసారి........వాళ్ళ దూరపు బంధువు వెంకమ్మ బామ్మ అని ఉండేదట. ఆవిడ బాలవితంతువు అవటంవల్ల తమ్ముడి పంచన చేరిందట. ఆ తమ్ముడు ఏటా కూతుళ్ళు, కోడళ్ళతో సమానంగా పిల్లల్నికనే భార్యకూ, ఆ డజన్లకొద్దీ పిల్లలకూ, విపరీతంగా వచ్చే అతిథులకూ యీమెతో గొడ్డుచాకిరీ చేయించేవాట్ట. చేసీ, చేసీ వయసు మీదపడేసరికి నడుములువంగి, కాళ్ళుచచ్చుపడిపోతే, యిహ యీవిడతో అవసరం తీరిపోయింది కాబట్టని పాకిదొడ్లోపడేసి, అక్కడే ఒక బొచ్చెలో అన్నం పెట్టేవార్ట. అందులో కాలువగుండా మలమూత్రాదులు పారుతూ ఉండటం, ఆమె కూడా బట్టల్లోనే అవన్నీ చేసుకోటం భరించలేక ఆ అన్నంకూడా తినలేక, కొన్నాళ్ళకు కృశించి, చనిపోయిందట అంటూ మానవత్వం నశించిపోయిన వెంకమ్మ బామ్మ తమ్ముడి కథను ఎంతో జాలిగా చెప్పాడు శాస్త్రి.

"మన బిల్స్ సెక్షన్‌లో చూశారూ........క్యాషియర్ ఏదైనా ఏరియర్స్‌వస్తే పిలుస్తాడు కదా ! కొందరు స్టాంప్ పైసలు పట్టుకెళ్ళరు. ఆ సెక్షన్‌లోని నోరులేని నారాయణమ్మవద్ద అడుక్కుంటారు అదేదో తమ హక్కన్నట్లు. మళ్ళీ తెచ్చియివ్వరు. ఇలాంటివాటిని "బెగ్గింగ్........క్లాసికల్ స్టయిల్" అనాలన్పిస్తుంది నాకు. ఈ సెక్షన్‌లో ఉన్నందుకు యిదో రకం ఉపవరమా ! మీకని నారాయణమ్మగార్ని మందలించాను........అన్నాడు తనే.


"మా పక్కింటి అండాళ్ళుగారు ఏఫంక్షన్‌లో వీడియో తీస్తున్నారన్నా ముందు రెడీ అవుతుంది మేడమ్. పరిచయమున్నా లేకపోయినా పెళ్ళికూతుర్ని ఒకటే సవరిస్తుంటుంది. తలంబ్రాలుకూడా యీవిడే పోస్తుందేమో పెళ్ళికొడుకు నెత్తిన అన్నట్లు చేస్తుంది 'యీ వీడియో ఆంటీ' అండాళ్ళు" అంటూ యింకోరోజు లంచ్ అవర్లో చెప్పాడు మాకు శాస్త్రి.

"ఈ మధ్య మా మిసెస్ కొత్తగా మాట్లాడుతోంది మేడమ్, తెలుగురానివాళ్ళ లాగా. పక్కింట్లో పంజాబీలు దిగారు. వాళ్ళు తెలుగు సరిగా మాట్లాడలేరు. వాళ్ళభాష తను నేర్చుకోలేకపోగా మనది వాళ్ళకు నేర్పి, తెలుగు వచ్చీరానట్లు మాట్లాడుతున్నది అసహ్యంగా. ఈ రోజుల్లో యిదోరకం ఫ్యాషన్ మేడమ్ భాషాపరంగా'' అంటూ చెప్పుకొచ్చాడు.

"కొందరు వృద్ధ కన్యలంటూ కథలు రాస్తారుగదా! నలభై దాటిన మగవాళ్లను వృద్ధ పురుషులని వ్రాయరెందుకో మేడమ్" అని ధర్మ సందేహం వెలిబుచ్చాడు శాస్త్రి ఓ రోజున.

అతను నవ్విస్తూ మాట్లాడే తీరూ, చెప్పే కబుర్లూ విని నవ్వుకుంటున్న నాకు యీ మధ్య ఒక భయంకర సత్యం తెలిసింది. చీఫ్ ఇంజనీర్ దగ్గర స్టెనో కాబట్టి యిలాగే తలకొక కథ చెప్పి, డబ్బులడుగుతాడట ఇవ్వకపోతే మీఫైలు అయ్యగారికి పంపించనని బెదిరించేవాడుట. అవసరమున్న ప్రతివాళ్ళూ వందో, రెండొందలో సమర్పించుకునేవారుట. ఒక్కోసారి డబ్బును వేలల్లోకూడా అడుగుతాడని విన్నాను. అతన్ని తిట్టుకోనివారుండరుట దాదాపుగా ఆఫీసులో. ఎవరన్నా ఫోన్ చేసుకుంటానని అడిగితే రెండు రూపాయలు తీసుకునిగానీ ఫోనివ్వడట.

అధికారం చేతిలో ఉంది కదాని బతకనేర్చిన తెలివితేటలతో తప్పుడుపంధాలో జీవితం నెగ్గుకొస్తున్న విచిత్ర వ్యక్తి, కధల కాణాచీ యీ సూర్యప్రభాశాస్త్రి అనిపించింది నాకు. అతనిలాంటివారు సమాజానికి చీడపురుగులలాంటివారని కూడా అనుకున్నాను.



# "ప ని మ ను షు లు"

అన్ని యుగాల్లోనూ పనిమనుషుల పేరు విననివారుండరు. పురాణకాలాల్లో చారిత్రక కాలంలోనూ; చెలికత్తె, చెలికాండ్రుగానూ, బానిసలు, వగైరాలుగానూ వీరు పిలవబడుతుండేవారు.

రాజుల గొప్పతనం, రాజా-రాణిల అవసరాలకు ముఖ్యంగా వారంతా ఉండ వలసిందే.

ప్రస్తుత కలియుగంలో....ముఖ్యంగా భూస్వాములవద్ద...."ఒరేయ్ నీయమ్మ స్తోం...." "దొంగనా బట్ట" లాంటి బూతులు రోజూ కర్ణకఠోరంగా వింటూ, వెట్టి చాకిరీచేస్తూ, తమ బ్రతుకులువెళ్ళదీస్తున్న, తీసుకుంటున్న పాలేరులూ పనిమనుషులే.

పాలేరులేంది భూస్వామిలేడు. భూస్వాములు చేసే అన్యాయలకు వాళ్ళ వడ్డీ దాహానికి బలైపోతూన్న పాలేరు కుటుంబాలెన్నో.

భూస్వాములకు రాజకీయంగా, స్థానికంగా ఎంతో బలముంటుంది. వాళ్ళ అక్రమ సంబంధాలూ, వాళ్ళుచేయించే హత్యలూ పాలేర్లనెత్తిన రుద్దబడతాయి.

"నామాటినండమ్మాయిగారూ. పెద్ద బుగతకు తెల్సిందంటే మిమ్మల్నీ, నన్నూ భూమిమీదుండనీయకుండా జేస్తారు'' అంటూ కందలు దిరిగిన పాలేరుపై మోజుపడ్డ భూస్వాముల కూతుర్లకో, మరి కుటుంబ సభ్యులెవరికో యీ విధంగా పాలేర్లనబడే జీతగాళ్ళ విన్నపాలెన్నో.

ఆ తర్వాత వారి కామదాహాగ్నికి బలై, యీ తతంగం పెద్ద బుగతలకు తెలిసి, వారి దౌష్ట్యానికి ఏ నరుగుడు తోపులోనో, చెరువులోనో, మరెక్కడనో శవాలైపోయే నదరు అమాయకపు పాలేర్లెందరో!

ఎంతగా యంత్రాలొచ్చినా జీతగాళ్ళ కొన్ని అవసరాలకు తప్పనిసరిగా ఉండాల్సిందే పల్లెటూళ్ళలో పొలం పనులకూ, యింటిపనులకూనూ.

సిటీ, పట్టణాల్లో హోటల్ సర్వర్లుగానూ, సిటీలలోని స్టార్ హోటల్స్‌లో స్టివార్డ్స్‌గానూ పనివాళ్లు పిలవబడుతూ ఉంటారు. వీరులేకపోతే కోటేశ్వరులైన వ్యాపారులకు క్షణం గడవదుకదా!

ఇహ డబ్బున్నవాళ్ళిళ్లల్లో ఆయాలుగా పిలవబడుతుంటారీ పనివాళ్ళు. భర్తల పక్కల్లో ఫ్రీగా పడుకోవాలంటే, క్లబ్బులలో తమ గొప్పలు ప్రదర్శించుకోవాలంటే యీ కోటీశ్వరమ్మలకు పిల్లల్తో గడపాలంటే కుదరదు. పాలివ్వటం దగ్గరనుండీ (పాలిస్తే వాళ్ళ వక్షోజ సౌందర్యం నశించి, భర్తల అభిమానానికి దూరంఅవ్వచ్చేమో నని) అన్నీ ఆయాలు, పనిమనుషులు చూసుకుంటేనే వీరి బ్రతుకు తెల్లారేది.

"అమ్మా! నేను టాయిలెట్ కెళ్ళొచ్చేసరికి పాప గులాబీపూవు తెంచేసిందమ్మా" అని పనిపిల్ల ఫిర్యాదుచెస్తే "ఏమే! ఒళ్ళు కొవ్వెక్కిందా! పాపను అదీయిదీ అంటావా? 'పాపగారు తెంచేశారు' అని అనటం తెలదా నీకు ఒళ్ళు బలిసి తన్నుకుంటున్న ముండా!" అని తమ పిల్లలకు తల్లీ, తండ్రీ ప్రేమను పంచటాన్కి టైమ్ దొరకని బడా మనుషుల మాటలు. అప్పుడప్పుడూ వాళ్ళ పిల్లలుచేసే దొంగతనాలు పని మనుషులమీద ఆపాదింపబడి పనివాళ్ళ జీవితాలు తాడూ-బొంగరం లేనట్లుగా అయిపోబడుతుంటాయి.

పనివాళ్లు వాళ్ళ యజమానుల్ని గానీ, వయసులో ఉన్నవారి సంతానాన్నిగానీ ప్రేమించగూడదు. ప్రేమకు చిహ్నంగా వారు చెమటోడ్చి పనిచేసి దాచుకున్న డబ్బులో సదరు అభిమానులకు పెద్దమొత్తంలో కానుకగా యిచ్చినా, "ఆ ఏదో యిచ్చావుగదూ నువ్వు," అంటారువారు. అదే తమ స్థాయికితగ్గవారు పూలబొకె యిచ్చినా "మీరు పంపిన కానుక నిజంగా అద్భుతం" అంటారు వారి స్థాయికి తగ్గట్లుగా. అందుకే పనివాళ్ళు తమ అంతస్థునుండి పైకి ఎదగటానికి డబ్బున్నవారు సహించలేరు.

ఆయాలకో, పనిమనుషులకో అంటరాని జబ్బొచ్చిందనుకో; కాస్త మంచి మనసున్నవాళ్ళయితే ఆస్పత్రుల్లో చేర్పించి చూసుకుంటారు. కానీ యిన్నాళ్ళూ పిల్లలపట్ల వారుచూపిన అభిమానానికి వారు పిల్లలను చూడాలన్నా స్ట్రిక్ట్‌గా చెప్పే స్థాయిచూడటాన్కి వీలులేదు, యీరోగం తగ్గేవాకా అని. అది తగ్గటం, వాళ్ళు పిలలను చూడటం అనేది దైవాధీనం మరి. కఠినాత్ములైన యజమానులైతే ఆ రోగిష్ఠి జీవితాలు బజారుపాలే.

మధ్యతరగతి వాళ్ళకూ ఉంటారు అంట్లుతోమటానికి బట్టలుతకటానికీనూ పనిమనుషులు. ఇక్కడ యంత్రాలెన్ని ఉన్నా ఇస్త్రీచేయాలన్నా, మరేంచేయాలన్నా పనిమనుషుల అవసరం తప్పకుండా ఉంటుంది

''ఏమే! రెండ్రోజుల్లో వస్తానని చెప్పి పదిరోజులు మకాంవేశావ్, ఊరెళ్ళి. పదిరోజుల జీతం కట్" అని ఖచ్చితంగా పనిమనుషులకు చెప్పే గృహిణులు కోకొల్లలు. వాళ్లు తమలాంటి మనుషులేననీ, వారికీ కనీస అవసరాలుంటాయనీ, వారూ రోగానపడతారనీ వీరనుకోరు. అందుకే కొందరు పనిమనుషులు మొండి బారిపోయి, యాజమానులను కొంత యిబ్బందికి గురిచేస్తూనే ఉంటారు. అది సహజమేమో! మరి.

అట్టడుగువర్గాలలో తిండి జరగక పొరుగూళ్ళకూ, సిటీలకూ వలసపోయే పనివారు కోకొల్లలు. వీరులేకపోతే ఆకాశహర్మ్యాలూ, అందమైన కుటీరాలు (కొందరు వాళ్ళ బిల్డింగ్స్‌కు ముద్దుగా పెట్టుకునే పేర్లు) అసలుండనే ఉండవు యాంత్రిక యుగమైనా పనివాళ్ళుండాల్సిందే.

భూస్వాముల మనసులుమారి తమ అపారమైన భూసంపదలో తమవారికి పంచగా జాలిపడి కాస్త తమ పాలేర్లకిచ్చినా పాలేరూ, బక్కరైతూ భూస్వాములు కాలేరు. వాళ్ళు వాళ్ళే, వీళ్లు వీళ్లే.

సమసమాజంవస్తే పైపనులన్నీ ఎలా జరుగుతాయి? అందుకని సమసమాజం రాదు. అన్ని రంగాల్లోనూ పనిమనుషులుంటారు. వారికి చేతనైన సేవలుచేస్తూనే ఉంటారు, గొప్పవారికీ మధ్యతరగతివారికీనూ. అదలా జరిగిపోతూనే ఉంటుంది కాలగతిలో.........ప్రవహించే నదిలా.........



# "వైద్యో నారాయణో హరిః"

"మీరొకసారిలా రండి'' అన్నారు డాక్టర్ చంద్రవీణ మా అమ్మను టెస్ట్ చేసింతర్వాత. ఆవిడ రూమ్‌లో ఆవిడ టేబుల్‌కు ఎదురుగా ఉన్న కుర్చీలలో కూర్చున్నాం మా బ్రదర్, నేనూను.

"మీ అమ్మగారికి క్యాన్సర్. ఒకసంవత్సరం క్రితం మీరు నావద్దకు తీసుకుని వచ్చినా ఆవిడకు పదేళ్ళ లైఫ్ ఉండేది. కానీ రెండు, మూడు ఏండ్లకంటే బ్రతక రావిడ. పెద్దపెద్ద గడ్డలూ (ట్యూమర్స్), ఎసైటిస్ (నీరు)లో ఆవిడ కడుపునిండి పోయింది. ఆపరేషన్ చేసినా తట్టుకోలేరావిడ. ముందు కొంత ఆ వాటర్‌ని టెస్ట్‌కు పంపుతాం. ఆ తర్వాత కీమోథెరపీ చేస్తాం." అని కుండబ్రద్దలుకొట్టినట్లు చెప్పింది వీణానర్సింగ్‌హోమ్ అధిపతి డాక్టర్ చంద్రవీణ.

ఆవిడ మాటలు వింటున్న నాకు కరెంట్ షాక్‌కొట్టినట్లయింది. భోరున ఏడ్చాను.

అవతల మనుషులు ఎలాంటివారో, డైరెక్టుగా చెబితే తట్టుకోగలరో లేదోనని కాస్త ఆలోచించి, చెప్పాలి డాక్టర్లు యిలాంటి విషయాల్ని. పేషెంట్ మీద అమితంగా ప్రేమ ఉన్నవారయితే హార్ట్ ఫెయిల్ అయ్యే ప్రమాదమూ ఉందికాబట్టి.

''పేషెంట్ కివిషయం చెప్పకండి. లంగ్స్‌కు ఎక్సరే, పెల్విస్‌కు స్కానింగు తీయించండి వెంటనే" అని ఆవిడకు బాగాతెల్సున్న 'సూర్యాస్కానింగ్ సెంటర్'లో తీయించమని, వ్రాసిచ్చింది.

దారిలో ఏడుస్తూనే ఉన్నాను.

"నీకు నీభార్యా, పిల్లలూ ఉన్నారు. నీవెలా అయినా తట్టుకోగలవు. నాకు నా కష్టసుఖాలు చెప్పుకోవటానికి అమ్మతప్ప ఎవరున్నారు? ఈ సంగతివిని సగం చచ్చిపోయాను నేను" అంటూ వెక్కిళ్ళుపెట్టి ఏడ్చాను నా అన్న రామ్మూర్తితోచెప్తూ. నా ఏడుపుచూసి, వాడూ దుఃఖం ఆపుకోలేకపోయాడు.

సంవత్సరంనుండి మా అమ్మ చిక్కిపోతూఉండేది. తరచూ జ్వరంవచ్చేది. వాంతులయేవి. విరేచనాలుకూడా ఎక్కువే అయ్యేవి తరచూ.

మామూలు డాక్టర్లవద్దకు తీసికెళ్ళేవాళ్ళం,అవితగ్గటానికి మందులిచ్చేవాళ్లువారు.

బహిష్టులుపోయి చాలాకాలమైంది కాబట్టి. ఏవిధమైన డిశ్చార్జీలేదు కనుక గైనకాలజిస్ట్‌కు చూపించాలన్న గొప్పఆలోచన మాకురాలేదు. ఆ డాక్టర్లూచెప్పలేదు.

ఇలాగే రోగాలు ముదిరిపోయేదశలో కనుక్కోవటమవుతుంది సహజంగా.

ఎక్స్‌రే, స్కానింగ్ తీయించాం.

ఇలాంటి కేసులు యిద్దరు, ముగ్గురు ప్రముఖులకు చూపిస్తే ఎవరేం మంచి సలహా యిస్తారోనన్పించింది మాకు.

డా॥ చంద్రవీణ వ్యాధిని కరెక్ట్‌గా డయాగ్నైజ్ చేసినా, ఆవిడ యీ కేస్ సరిగా టేకప్ చేయలేదేమోనన్పించింది.

అందుకే ప్రఖ్యాత గైనకాలజిస్ట్ డా॥ శాంతను కన్‌సల్ట్ చేయమని, మా అన్నయ్యకు వాడిఆఫీసులో కొందరు సలహా యిచ్చారుట.

ఫీజు ఎక్కువ తీసుకుంటుదని తెల్సినా, ముందుగా అపాయింట్ మెంట్ తీసుకుని, మా అమ్మను ఆవిడవద్దకు తీసికెళ్ళాం.

ఆవిడ చూశారు. "ఓవరియన్ ట్యూమర్. క్యాన్సరన్నమాట. ఆవిడకి చెప్పకండి" అన్నారు.

నేను ఏడ్చాను. "అబ్బెబ్బే........ధైర్యంగా ఉండాలి. నేనుచూడండి. నాకు అరవైరెండేళ్లు. గుండెకు బైపాస్ సర్జరికూడా చేయించుకున్నాను ఎలాఉన్నానో చూడండి........ స్కానింగ్‌తీయించండి........"శ్రీరామా సెంటర్ లో" అన్నారు.

స్కానింగ్ తీసేముందు బాగా నీళ్లుతాగించమన్నారు. అలా చేస్తే మంచి ఫలితమొస్తుందని.

కడుపులో చాలా నీరుందనీ, క్యాన్సరుకు సంబంధించిన గడ్డలు ఉన్నాయనీ అల్ట్రాసోనోగ్రఫీ రిపోర్టులో తేలింది.

ఆవిడకు అరిపోర్ట్ చూపించాం.

"నీరు లంగ్స్‌దాకావచ్చింది. పెద్దపెద్ద గడ్డలున్నాయి కడుపులో. "శ్రీవిలసిత నర్సింగ్‌హోం" లో రేపు అడ్మిట్ చేయండి. ఆపరేషన్ చేయాల్సుంటుంది'' అన్నారు డా॥ శాంత.

''దగ్గువచ్చేదండి. ఇసోనోఫీలియావల్ల వచ్చిందనుకుంటున్నాం మేము" అన్నాం యిద్దరం.

''అలాఅని తృప్తిపడి, జబ్బును నిర్లక్ష్యంచేసుకోకూడదు. దేన్నయినా ఫేస్ చేయగలగాలి. ప్రీవియస్ రిపోర్ట్సునుబట్టి చూస్తే ఇస్నోఫిల్స్‌శాతం నార్మల్‌గానే ఉన్నట్లుంది కదా" అన్నారావిడ.

పూర్వకాలం మనిషి కాబట్టి, రోగనిరోధక శక్తి ఎక్కువ ఉంటుంది కనుక అరవైఐదేళ్ళొచ్చినా మనిషి చిక్కిపోయి, తరచూ జబ్బునపడుతూ, అలాగే పనులు చేస్తుండేది మా అమ్మ పిల్లల్నిబ్బంది పెట్టకూడదనే ప్రేమాతిశయంతో.

నా తండ్రి చిన్నతనంలో గతించటంవల్ల ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి, మాతల్లే మమ్మల్ని పెంచి, పెద్దచేసింది బంధువుల యిళ్ళల్లో ఉండి, అడ్డమైన చాకిరీలుచేస్తూ.

మనుషుల విలువలు తెలుసుకోగల్గే గుణం చిన్నతనంనుండీ నాలో ఉండటం వల్ల అపారమైన ప్రేమ ఆవిడమీదనాకు. అందుకే తట్టుకోలేకపోతున్నాను ఆవిడకు క్యాన్సర్ అని తెల్సింతర్వాత.

తల్లి ప్రాముఖ్యతను నా అన్నకు తెలియజెప్తుండేదాన్ని. డబ్బు పెట్టగలగాలి గదా ! మరివాడు.

"శ్రీవిలసిత నర్సింగ్‌హోమ్" లో డాక్టర్ శాంతగారు చెప్పినట్లు అడ్మిట్ చేశాం మా అమ్మను. శాంతగారు రిటైర్ అయింతర్వాత మూడు, నాలుగుచోట్ల కన్సల్టెంట్‌గా ఉంటున్నారు. వాటిల్లో యీ నర్సింగ్‌హోమ్ ఒకటి.

ఆపరేషన్ థియేటర్‌లోకి తీసికెళ్ళారు అమ్మను. అంత బలహీనంగా ఉంది కదా! ఏమవుతుందోనని మాకు విపరీతమైన టెన్షన్. ఏమీ తినాలన్పించలేదు.

ఉదయం లేచిందగ్గరనుండీ రాత్రిపడుకోబోయే వరకు ప్రతిదానికీ టెన్షన్ ఫీలవటం యీ సిటీలైఫ్‌లో మామూలే ప్రతిఒక్కరికీనూ. కానీ యిది మరీ ముఖ్యమైన టెన్షన్ కదా!

ఎనెస్థీషియాలజిస్ట్

ఎనస్థటిస్ట్ ఓ.కె. అన్న తర్వాత ఆపరేషన్ మొదలైంది. ఒక గంటతర్వాత కడుపులోనుండి తీసివేసిన గర్భాశయం, రక్తపుగడ్డలూ ఒకదానిలోనూ, వెడల్పాటి బకెట్‌నిండా నీరూ మేము చూడటంకోసం అక్కడ ఉంచారు.

'ఆ చిన్న గర్భసంచిలోనేకదా! మేము పెరిగి, పుట్టి యింతవాళ్ళమైంది' అనే భావన నన్ను కదిలించివేసింది అది చూస్తుంటే.

ఆ తర్వాత ఒక గంటకు మా అమ్మను బయటకు తీసుకవచ్చారు స్ట్రెచర్‌పై తెచ్చి, మంచంపై పడుకోబెట్టారు.

బాధ ఎక్కువై, మత్తులోనే ఉన్నాకూడా మూలుగుతూనే ఉన్నది మా అమ్మ.

నా గుండెలు పిండినట్లుయింది ఆమె బాధ చూస్తుంటే.

"ఈ రోజంతా అలాగే ఉంటుంది. వర్రీ అవాల్సినపనిలేదు" అని చెప్పారు డ్యూటీ డాక్టరు. అసహనంగా అటూ, యిటూ కదులుతూనేఉన్నది మా అమ్మ. సెలైన్‌వాటర్ బాటిల్స్ ద్వారా సరాలగుండా ఎక్కుతూ ఉన్నది. కాళ్ళపై కదలకుండా నేనూ, మా అన్న, వాడి స్నేహితుడూ పట్టుకుని కూర్చున్నాం కదిలితే కుట్లకు దెబ్బ అని.

తెల్లవార్లూ మాకూ జాగారమే. ఆవిడకు బాధతెలియకుండా పెథిడిన్ లాంటి యింజక్షన్లిచ్చారు. మర్నాడు సిస్టర్ వచ్చి, కాసేపు కూర్చోబెట్టింది. వేడినీళ్ళతో, ఒక టవల్‌తో ఒళ్ళంతా తుడిచి, పౌడరువేసింది. ప్రక్కబట్టలూ, ఒంటిమీదవీ మార్చింది. ఒక చీరమాత్రం కప్పారు ఒంటిమీద.

కలెక్టివ్ బ్లడ్, వగైరా పోవటాన్కి, డ్రెయిన్ ఒకటి ఏర్పాటుచేశారు కడుపుకు ఒకప్రక్కగా కుట్లవద్ద.

ఈ కేస్ టేకప్ చేసిన డా॥ శాంత ముందుగా వచ్చి చూశారు అమ్మను. 'ఎండాక్సన్' యివ్వమని, అసిస్టెంట్ శ్రీనివాస్‌తో చెప్పారు.

అలాగే యిచ్చారు. అమ్మకు బ్లీడింగ్ బాగా అయింది. ఆ తర్వాత ఆవిడ ఎక్కువ వచ్చేదికాదు. ఏ కేస్‌ను ఎవరు ఆపరేషన్ చేసినా, కుట్లు విప్పటం వగైరాల దగ్గరనుంచీ డా॥ గోపీకృష్ణగారే స్వయంగా చూసుకునేవారు రౌండ్స్‌కొచ్చినప్పుడు ఉదయం, సాయంత్రమూనూ.

ఇంటెస్టైన్స్‌లో కదలికలేక గ్యాస్ ఫార్మ్ అయి మా అమ్మకు కడుపు ఉబ్బిపోయింది. నేసోగ్యాస్ట్రిక్ లేవేజ్‌లో సక్షన్ అపరేటస్‌ద్వారా, గ్రీనిష్‌గా ఉండే లిక్విడ్ అంతా తీసేశారు. అలా ఇరవైనాల్గుగంటలు ముక్కులోనుండి వేసిన ట్యూబ్‌ను ఉంచి, గంటకొకసారి డ్యూటీలో ఉన్న సిస్టర్ వచ్చి, సిరెంజ్‌ద్వారా తీస్తుండేది పసరులాంటి ఆ ద్రవాన్ని.

అదంతా చూసి, ఏమీ తెలియని అమాయకత్వంతో, ఏడుస్తూ డా॥ గోపీకృష్ణ వెంటపడేదాన్ని నేను.

"అలా చేస్తేనే తొంభైశాతం హోప్స్ ఉంటాయి" అంటూ సౌమ్యంగా నచ్చ చెప్పేవారు నాకు.

"ప్రతివాడూ నర్సింగ్‌హోమ్ పెట్టటం, స్పెషలిస్ట్‌లను పిలిపించి కేసులను అప్పగించటం, వీళ్ళ కమీషన్ వీళ్ళు తీసుకుని, వాళ్ళకిచ్చేది వాళ్ళకివ్వటం.......ఏం.......ఏవుంది.......అంతా వ్యాపారమైపోయిందండీ............సుజాతగారూ" అన్నాడు నా అన్న స్నేహితుడు వెంకటేశ్వరరావు మా అమ్మను చూడటానికి వచ్చినప్పుడు.

"పొరబడుతున్నారు వెంకటేశ్వర్రావుగారూ! ఇక్కడలాంటి వ్యాపారధోరణి లేదు. అంతా సవ్యంగా ఉంటాయి. డా॥ గోపీకృష్ణగారు సర్వం చూసుకుంటారు స్పెషలిస్టులు చేసిన కేసులయినా సరే. ఓ.పి. దగ్గరనుండీ అన్ని విషయాలు చూస్తారు రెండుపూటలా ఎంతటైమ్ అయినాసరే రౌండ్స్‌కొచ్చి, రోగుల బాగోగులు చూసుకొనిగాని యింటికి వెళ్ళరాయన.

"బీదవాళ్ళను మరీప్రత్యేకంగా చూస్తారు. ఫీజులు కూడా విపరీతంగా వసూలు చేయరు. స్వతహాగా ధనవంతుడైన ఆయనకు భేషాజాలంటూ ఏమీలేవు. నేను వచ్చిన దగ్గరనుండీ గమనిస్తున్నానుగదా" అని అతని మాటలను కొట్టిపారేశాను.

"నిజమే అయుంటుందిలెండి. మీరు రచయిత్రికదా! రవి (సూర్యుడు) గాసని చోటగూడా ఏముంటుందో కనుక్కోగల సమర్థులు" అని చమత్కరించాడు నన్ను వెంకటేశ్వరరావు.

డా॥ గోపీకృష్ణగారి జిల్లావాళ్ళు, ఆ చుట్టుప్రక్కల ఊళ్ళకు సంబంధించిన వారూ ఎక్కువగా ఉండేవాళ్ళు పేషెంట్స్.

ఆయన రామవరంలోని ఒక ఆస్పత్రిలో పదేళ్ళపాటు చేశారట.

పెళ్ళయింతర్వాత మామగారి ప్రోద్బలంతో హైద్రాబాద్ వచ్చి, నర్సింగ్ హోమ్ స్థాపించారుట. అక్కడినుండి వస్తుంటే, "మా బంగారుబాబు వెళ్తున్నాడు మాకిక ఏదిదిక్కు" అని ఏడ్చారుట అక్కడి పేషెంట్సు. అందుకే వారందరి అభ్యర్థనమేరకు రామవరానికి దగ్గర్లోగల ఆయన స్వగ్రామం మల్లవరానికి ప్రతి చివరి ఆదివారంనాడు వెళ్ళి అందర్నీచూసి, అవసరమనుకున్నవార్కి అక్కడికక్కడే తగిన మందులువ్రాసి, ఆపరేషను చేయాలనుకున్న కేసులను ఇక్కడకు రిఫర్ చేస్తుంటారుట. తను వెళ్ళటమేకాకుండా తనకు తెల్సిన స్పెషలిస్టులను కూడా పంపుతుంటారు ప్రతినెలకూడా.

శనివారం వెళ్తారు మల్లవరానికి. అప్పటికే తిరునాళ్ళకొచ్చినట్లొస్తారుట జనం ఆయన కోసం. ఉదయం ఏడుగంటలకు వరుసగా అందర్నీ చూడటం మొదలెడతారుట. సాయంత్రం ఆరు గంటలకుగానీ ఆ కార్యక్రమం కాదుట. అంతవరకూ నిల్చునే ఉంటారట ఆయన. ఈలోగా వచ్చిమంచినీళ్లుకూడా ముట్టరట. ఇలా ఆయన మంచితనం గురించి వాళ్ళ ప్రాంతంవాళ్ళు గొప్పగా చెప్పుకోవటం నేను విన్నాను.

ఆయన ప్రాంతీయాభిమానం నాకెంతో నచ్చింది.

ప్రతి డాక్టరూ స్థానికులతోపాటు తన ప్రాంతంవారినికూడా శ్రద్ధతో చూసి, సరైన వైద్యంచేసి మంచి అనిపించుకుంటే అదే ఎంతో దేశ సేవచేసినట్లు కాదా! అని అనుకుంటాను నేను.

మా అమ్మకు కుట్లు విప్పారు ఆయనే.

బయాప్సీ రిపోర్టు వచ్చినది. క్యాన్సర్ సెల్స్ ఉన్నట్లూ, కడుపులో మిగతా ప్రాంతాలకు పాకినట్లు ఉన్నదందులో.

తర్వాత మా అమ్మను డిశ్చార్జి చేశారు. నేనూ మా అన్న కృతజ్ఞతలు చెప్ప టానికి గోపీకృష్ణ రూమ్‌లోకెళ్ళాం.

"అబ్డామిన్ ఓపెన్ చేయగానే ఆ వాటర్ మిగతా సెల్స్‌లోకి ప్రాకిపోయి పాయిజన్ అయి, ఆపరేషన్ బల్లమీదే ఆవిడ పోతుందని భయపడ్డాం. మీ అదృష్టం వల్ల బ్రతికి బయటపడ్డారావిడ'' అనన్నారాయన.

"లేదు సార్! మీరు తీసుకున్న ప్రత్యేకశ్రద్ధవల్లే మా అమ్మ మాకు దక్కింది పదేళ్ళయినా బ్రతుకుతుందంటారా?'' అన్నాం.

ఆయన ఏమనలేక, కాసేపు ఆలోచించి, మళ్ళీ "చెప్పగూడదు గానీ.... డా॥ శాంతగారు డబ్బుమనిషి. గైనకాలజిస్ట్‌గా ప్రముఖురాలేకానీ, క్యాన్సర్‌కు సంబంధించి, యీ ఆపరేషన్ తర్వాత జరిగే ట్రీట్‌మెంట్ సరిగా చేయలేరేమో! ఎందుకంటే ఆపరేషన్ జరిగిన మర్నాడే 'ఎండాక్సన్' యివ్వమనటం తప్పు........ ఆవిడకు ఎదురుచెప్పలేక మేము ఎంతో సతమతమయ్యాం ఆ రోజు. ఇలాంటి కేసులు చెడగొట్టి పేషెంట్స్‌ను చావుకు సమీపంగా తీసికెళ్ళిన సందర్భాలూ ఉన్నాయి. ఈ కేస్‌కు సంబంధించిన స్పెషలిస్ట్ డా॥ ఎస్. ఆర్ రావుగారున్నారు. ఆయన కేస్‌టేకప్‌చేస్తే మంచి రిజల్ట్ వచ్చేదాకా వదలరు, ఆ హిస్టోపాథాలజీ రిపోర్టు ది జీరాక్స్‌కాపీ ఉంటే ఒకటివ్వండి. నేను ఆయనతో మాట్లాడి, ఏ విషయం తెలియ జేస్తాను" అన్నారు.

మేం మరోసారి కృతజ్ఞతలు తెల్పుకుని, యింటికొచ్చేశాం మా అమ్మను తీసుకుని. మా అన్నయ్య వెళ్ళి కల్సాడు ఆయనను వారం తర్వాత.

ఫలానా రోజు రమ్మన్నారుట డా॥ రావుగారు.

ఆ రోజు వెళ్ళాం.

"ఓవరియన్ క్యాన్సర్ గ్రేడ్-3 అని రిపోర్టులో ఉన్నది గదా! ఇది నలభై శాతం వరకు మాత్రమే క్యూర్ అవుతుంది. కీమోథెరపీ (మందుల ద్వారా చికిత్స) యివ్వాల్సిఉంటుంది ఈ పద్ధతే యీ జబ్బుకు ప్రపంచమంతటా ఉపయోగిస్తున్నారు. నెలకు మూడు, నాలుగు వేలదాకా డబ్బు ఖర్చవుతుంది. నెలకొకసారి చొప్పున ఆరునెలలపాటు యివ్వాల్సుంటుంది. అవసరమనుకున్నప్పుడు బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ కూడా చేయాల్సిఉంటుంది. ట్రీట్‌మెంట్ పూర్తయ్యేసరికి జుట్టు ఊడిపోతుంది మళ్ళీ వస్తుంది. ఏ విషయం ఆలోచించుకుని చెప్పండి" అన్నారు డా॥S.R. రావుగారు.

"అమ్మో! ఆరునెలలా! నెలకు మూడురోజులు ఆస్పత్రిలో ఉండాలా! ఇంజక్షన్స్ బదులు టాబ్లెట్సు యివ్వకూడదా!" అన్నాను అతి అమాయకంగా నేను.

"అలా ఉండదు, ఇంజక్షన్స్ అయితే నేరుగా రక్తనాళాలలోనికి వెళ్ళి త్వరగా పనిచేస్తాయి. ఎవరైనా యిదేపద్ధతి అమలుచేస్తారు." అన్నారు డా॥ S.R. రావుగారు.

'సరే' అని ఒప్పుకున్నాం ఆ విధంగా మొదటి కీమోథెరపీకి మా అమ్మను మళ్ళీ అక్కడ అడ్మిట్ చేశాం.

డా॥ శాంతగారంటే గౌరవం కదా! అక్కడ అందరికీ, ఆవిడకు తెలీకుండా యీ కేసను స్పెషలిస్ట్‌కప్పగించటం చాలా డేరింగ్‌గా చేయాల్సినపని. పైగా ఆవిడ డబ్బుదాహానికి మేము తట్టుకోలేమని గోపీకృష్ణగారు గమనించారు. అందుకే వాంతులవీ అయి, బి. పి. డౌన్ అవటంవల్ల అర్ధరాత్రి తెచ్చి, అడ్మిట్ చేసినట్లూ, రావుగార్కి కేస్ అప్పగించినట్లూ కేసషీట్ మార్చి వ్రాయించారు డా. గోపీకృష్ణ.

మామూలు సెలైన్ వాటర్ బాటిల్స్‌లో ఓవరియన్ కార్సినోమాను కంట్రోల్ చేయగల ఎన్‌డాక్సన్. సిస్‌ప్లాటిన్, లాసిక్స్. డెక్సాజెక్ట్. మెటాక్లోప్రేమ్, వాంతులవీ రాకుండా పెరినామ్, ఫెనర్గాన్ కలిపిరోజుకు ఏడు బాటిల్స్ చొప్పున డ్రిప్ ద్వారా నరానికి ఎక్కించేవారు మూడురోజులపాటు.

రీనల్ ఫెయిల్యూర్‌కాకుండా 'మానిటాల్' కూడా కలిపేవారు.

ఐనా ఎన్‌డాక్సన్, సిస్‌ప్లాటిన్‌లవల్ల కొద్దిగా వాంతులయేవి మా అమ్మకు. కొద్దిగా సంధి ప్రేలాపనలూ ఉండేవి.

బ్లడ్‌లో మెగ్నీషియమ్, కాల్షియం తగ్గుతుందని దానివల్ల కిడ్నీస్‌పాడయిపోకుండా మెగ్నీషియమ్‌సల్ఫేటు కూడా తగు మోతాదులో యిచ్చేవారు

కిడ్నీస్ సరిగా పనిచేస్తున్నాయా ? లేదా—ఎక్కువమోతాదులో యిచ్చే యీ మందులవల్ల అని, 'యూరిన్‌ఔట్‌పుట్' కూడా కౌంటు చేయిస్తుండేవారు. ఆ రిజల్ట్ కూడా తృప్తికరంగా ఉండేది మా అమ్మకు. అలా మొదటి కీమోథెరపీ అయిపోయింది నాల్గవరోజు డిశ్చార్జి చేశారు.

అయితే వెజైనల్ ఇన్‌ఫెక్షన్‌వల్ల చాలా దుర్వాసన వస్తుండేది మా అమ్మవద్ద. డిశ్చార్జి అవుతుండేది దుర్వాసనతో.

కాండిడ్—6 వెజైనల్ టాబ్లెట్స్ ప్రత్యేక పరికరంద్వారా వెజైనాలోకి పెట్టమనేవారు. అయినా ఆ వాసనపోలేదు.

రెండవసారి కీమోథెరపీకి అడ్మిట్ చేశాం నెల గడిచింతర్వాత.

సహజంగా ఎండాక్సన్ యివ్వటంవల్ల బ్లడ్‌లో హెమోగ్లోబిన్ పర్సంటేజ్ తగ్గిపోతుందిగదా ! అందుకని బ్లడ్ ఎక్కించారు యీసారి.

కీమోథెరప్యూటిక్ డ్రగ్స్ అయిన సిస్‌ప్లాటిన్, ఎండాక్సన్‌లవల్ల జ్వరంకూడా వచ్చింది.

"మీకు తెలిదా ! ఎవరూ చెప్పలేదా ! మీమదర్‌కు క్యాన్సర్ అని. అందుకే, ఆ చెడువాసన అలా వస్తోంది." అని చెప్పింది ఒక సిస్టర్ నాతో.

ఆవిడే మళ్ళీ అన్నది. "పూర్వం టి.బి. వచ్చి ఎందరో చనిపోయేవారు. కానీ యిప్పుడు టి. బి. అంటే మామూలుగా జ్వరంవచ్చి తగ్గినట్లుగా అయింది. అంత మందులొచ్చాయి యిప్పుడు. అలాగే యిప్పుడు క్యాన్సర్‌ను నయంచేయటానికి వ్యాక్సీన్‌ను కనుక్కోవచ్చు ముమ్ముందు" అని ధైర్యం చెప్పారావిడ.

అయినా నేను ఎక్కడబడితే అక్కడ డల్‌గా కూర్చుంటూ ఏడుస్తూ ఉండేదాన్ని. గోపీకృష్ణగారు గమనించేవారు.

మళ్ళీ ఆపరేషన్ చేసినా, రేడియం ట్రీట్ మెంటు యిచ్చినా అమ్మ తట్టుకోలేదని నిర్ణయించుకున్నారు డాక్టర్ల బృందమంతా.

మేం భయపడతామని ముందుముందు ఏమి చేయబోయేదీ వాళ్ళు చెప్పరనుకున్నాను. డా॥ గోపీకృష్ణ పద్ధతేయిది. 'ఇదీ' అని చెబితే పేషెంట్ గోవింద కొడతాడని ఆయన చెప్పరు. ఎవర్నీ చెప్పనివ్వరు.

కానీ మర్నాడు మేం ఎవరూ లేకుండాచూసి, ఆయనే లేబర్ రూమ్‌కు మా అమ్మను స్ట్రెచర్‌పై తీసుకురమ్మన్నారుట. కాటరైజేషన్ అనే పద్ధతిని అమలు చేశారట. అంటే కరెంట్ పెట్టినట్లన్నమాట.

ఆ తర్వాత రౌండ్స్‌కొచ్చినప్పుడు, ''రెండు, మూడు రోజులు కదలించవద్దు బెడ్‌మీదనే అన్నీ అంటే యూరిన్ వగైరా పట్టండి. వెంటవెంటనే నేప్కిన్స్ కూడా మార్చండి" అని చెప్పారు సిస్టరుతో.

అక్కడి సిస్టర్స్, దాయాలకు కూడా ఆయనంటే గౌరవంతోకూడిన భయం, కల్గిఉండేవారు. పేషెంట్సుకు ఏలోపం లేకుండా చక్కగా చూసేవాళ్ళు. పరిసరాలను పేషెంట్సుతో వచ్చేవాళ్ళు అపరిశుభ్రం చేసినా విసుక్కోకుండా నీట్‌గా ఉంచటానికి అక్కడి దాయాలు శ్రమపడేవారు.

డ్యూటీ డాక్టర్స్‌కూ, సిస్టర్స్‌కూ వగైరా సిబ్బందికి క్యాటగిరీవైజ్‌గా చక్కని సదుపాయాలలో ఆ విశాలమైన అవరణలోనే క్వార్టర్స్ ఉండేవి.

జీతాలు, బట్టల విషయంలో కూడా ఎవరికీ ఏలోపమూ ఉన్నట్లుగా ఎవరూ చెప్పగా నేను వినలేదు.

ఎక్కడా నయంకాని రోగులను యీ నర్సింగ్ హోమ్‌కు తీసుకొస్తుండేవారు. సత్వరం తగిన వైద్యసహాయం అందటంతో రోగులూ, వారి బంధువులూ సంతోషంగా యిళ్ళకు వెళ్ళటం నేను చూశాను.

మా అమ్మనే కాకుండా అందరినీ అలాగే శ్రద్ధగా చూసేవారు డా॥ గోపీకృష్ణ. స్పెషలిస్ట్‌లతో ప్రత్యేకంగా కన్సల్ట్ చేసి, తనూ సలహాలిస్తూ రోగనిర్ధారణలో రోగం నయమవటానికి అమిత శ్రద్ధ తీసుకునేవారు.

ఒకరోజు.........యీరోజో, రేపో ఛస్తుందన్న కేసొకటి వచ్చింది. డాక్టర్లు ఎంత ప్రయత్నించినా ఆవిడ సహజంగానే చనిపోయింది. చూస్తున్న నాకు, చుట్టు ప్రక్కలవాళ్ళకూ దిగులుగా అన్పించింది. కాని డాక్టర్లు మాత్రం నిర్లిప్తంగా ఉండిపోయారు. వాళ్లు ఇలాంటివెన్నో చూస్తుంటారుగదా!

నిజంగా డాక్టర్లే నిజమైన వేదాంతులన్పించింది నాకు. చావు పుట్టుకలను సమాన దృష్టిలో చూస్తారు కాబట్టి.

డాక్టర్ గోపీకృష్ణంటే నాకు ప్రత్యేకంగా అభిమానం కల్గటం మొదలైంది. నా దృష్టిలో నాకేకాక, రోగుల అందరిపాలిటా దేముడులా అన్పించేవారాయన. మా అందరి అయుర్దాయాలూ పోసుకుని కలకాలం జీవించి మాలాంటి ఎందరినో బ్రతికించాలని రోగులందరూ కోరుకోవటం నేను విన్నాను.

మామూలుగా ఏ భావం లేకుండా ఉంటే మనం ఎదుటి వ్యక్తుల్ని ధైర్యంగా చూడగలం. కానీ మనసులో ప్రేమతోకూడిన ఆరాధనాభావం అవతలి వ్యక్తిపై అంకురించినప్పుడు, ఆ వ్యక్తి సమీపంగా వచ్చినప్పుడు చూడటానికి తత్తరపాటు పడతాం.

నా పరిస్థితి అలా అయింది. ఆయనవేపు కన్నెత్తి చూడటానికి సిగ్గుపడేదాన్ని. ఆయన మామూలుగానే ఉండేవారు.

ఇన్ఫెక్టివల్యూకోరియా (ట్రైకోమోనియాసిస్) ను మెట్రో సిడాజోల్ ఇంజక్షన్స్ (శక్తివంతమైన యాంటీబయాటిక్స్) ద్వారా కంట్రోల్ చేయగలిగారు, అలా పధ్నాలుగు రోజులిచ్చారు అమ్మకు ఐ. వి. ద్వారా. గ్యారామైసిస్. నార్ప్రొగ్జాసిన్‌కూడా యిచ్చారు. ఇవన్నీ క్యాన్సర్ సెల్స్ నరికట్టటానికి కూడానూ. ఆ విధంగా ఆ ట్రీట్‌మెంట్ ద్వారా అమ్మకు పెజైనానుండి వెలువడే దుర్వాసనతోకూడిన డిశ్చార్జ్ తగ్గిపోయింది. పెల్విక్ ఇన్ఫెక్షన్‌ను అలా అరికట్టారు డా. గోపీకృష్ణ.

దాంతో నాకాయనమీద అభిమానం కొండలా పెరిగిపోయింది. ఇంటికెళ్ళినా ఆయన చిరుదరహాసం, మంద్రస్థాయిలో ఉండే ఆయన స్వరం, ఆయన మనోహర రూపం, యివన్ని అనుక్షణం గుర్తొచ్చేవి. తిండి సహించేదికాదు. ఎప్పుడూ ఆయన గురించిన ఊహలలో నిద్రపట్టేదికాదు. ఆయనలో కల్సి ఉన్నట్లూ, వర్షంపడేటప్పుడు

ఆయన కారులో ఆయన ప్రక్కనే కూర్చుని ఎంతకాలమైనా విసుగనేది లేకుండా అలా ఆయన కళ్ళలోకిచూస్తూ ఉండిపోవాలనీ, ఆయన విశాలమైన ఛాతీపై తల వాల్చుకుని ఉపశమనం పొందాలనీ-ఎన్నో, ఎన్నెన్నో ఆచరణసాధ్యం కానివన్నీ ఊహించుకునేదాన్ని.

మగవాడి ప్రేమ, సాన్నిధ్యం స్త్రీకి ప్రపంచంలో ఏదీ యివ్వలేనంత ధైర్యాన్ని జీవితంపై ఆశనూ కల్గిస్తాయి కనుక. కానీ భ్రమలు వాస్తవాలు కావన్న నిజమూ నాకు తెలుసు.

చాలా పొడవుగా, లావుగా ఉండేనేను ఆ విధంగా బెంగతో చిక్కిపోవటం మొదలెట్టాను.

"చిక్కిపోయి, చిక్కిపోయి చుక్కల్లో కలసిపోతానేమో" అనుకుని ఏడ్చే ద్దాన్నినేను ఆయనమీద మూగప్రేమను పెంచుకున్నాను కనుక.

అమ్మ కోలుకుంటున్నది. మళ్ళీ మూడవ కీమో థెరఫీకోసం జాయిన్ చేశాం. రూమ్‌లు ఖాళీలేక రికవరీ రూం ఇచ్చారు మాకు.

ఆపరేషన్ థియేటర్‌కు ప్రక్కగా ఉండేది అది. ఆయన ఆపరేషన్ చేసేటప్పుడు వేసుకునే ప్రత్యేకమైన దుస్తుల్లో (ఆకుపచ్చనివి) ఉండి ఆపరేషన్ జరిగే పేషెంట్స్‌కోసం వచ్చేవారికి సందేహాలు తీరుస్తూ, యింకా ఎవరైనా వస్తే వారిని పలకరిస్తూ అటూ, యిటూ తిరుగుతుండేవారు ఆపరేషన్లు మొదలెట్టేలోపుగా.

ఆయనను ఎక్కువగా చూడటానికి అలా అవకాశం కల్గింది నాకాసారి.

పచ్చని శరీరఛాయలో, ఆ దుస్తుల్లో బంగారు తండ్రిలాగా ఉండేవారాయన. మాటలెంత సౌమ్యంగా ఉండేవో............ఎవరైనా సరే! ఆయనను చూస్తే మనసు పారేసుకోవటం ఖాయమని నాకన్పించింది.

ఆయన ఎమ్.ఎస్. (మాస్టర్ ఆఫ్ సర్జరీ) కాబట్టి ఏ ఆపరేషన్లయినా చేయగల్గేవారు.

అపెండిసైటిస్, పెప్టిక్ అల్సర్, బ్రెస్ట్‌క్యాన్సర్, థైరాయిడ్ గ్లాండ్‌డీ, హెర్నియా, హైడ్రోసిల్, వేసక్టమీ, ట్యూబెక్టమీ, మయోమెక్టమీ, హిస్టరెక్టమీ, లంగ్స్, బ్రెయిన్, హార్ట్, కిడ్నీస్-ఇలా ఎన్నో చేయగల్గేవారు.

స్పెషలిస్టులు చేస్తున్నా ఆయన అసిస్ట్ చేస్తుండేవారు.

ఇప్పుడు ప్రతిదానికీ స్పెషలిస్టులుగానీ, పూర్వం ఎమ్. ఎస్. చేసినవాళ్ళు దాదాపు అన్నిరకాల ఆపరేషన్లూ చేసేవారు.

అమ్మకీసారి ఎలాంటి కాంప్లికేషన్సూలేవు.

నాల్గవసారి కీమోథెరపీకూడా ఎండాక్సన్, సిస్ప్లాటిను, వగైరాల కాంబినేషనులో అయిపోయింది.

లింఫ్‌గ్లాండ్స్ వగైరాలకు సోకిందేమోనని స్పెషలిస్ట్ అవి నొక్కిచూస్తుండేవాడు అమ్మకు. అతనూ మంచి ప్రతిభావంతుడే. ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రముఖ అంకాలజిస్ట్ అతను. వేలు తీసుకుంటారు మామూలుగా, కానీ, అతను ఉదార స్వభావంతో చాలా తక్కువ తీసుకునేవారు మావద్ద. అలా చేయటంవల్ల ఎక్కువ కృతజ్ఞతతో నా మనసు స్పందించి కలకాలం అతనూ, అతని కుటుంబం డబ్బుబాగా వచ్చి చల్లగా హాయిగా ఉండాలని కోరుకునేదాన్ని. ఎందుకంటే యీ కలికాలంలో డబ్బుకున్న ప్రాముఖ్యత మరి దేనికీ లేదు కాబట్టి. అక్కడి డాక్టర్లందరూ ప్రతిభ కలవారే. ప్యూటీమైండ్ కలవాళ్ళు. ఒకరి ప్రతిభను మరొకరు కించపరచుకోని తత్వంగలవాళ్ళు. ఆ నర్సింగ్‌హోమ్‌లో ఇరవైనాల్గుగంటలూ వైద్య సేవలందుతుండేవి. అత్యాధునిక సదుపాయాలూ ఉండేవి.

ఈసారి యింటికెళ్ళిందగ్గరనుండీ ఆకలిలేదనటం మొదలెట్టింది అమ్మ. ప్రతి థెరపీకి ముందు బ్లడ్‌టెస్ట్ చేయించమనేవాడు డా॥ రావు. బ్లడ్‌లో ప్లేట్‌లెట్స్ కౌంట్స్, వగైరా సంతృప్తికరంగా ఉన్నాయా, లేదా! చూడటానికని.

~~ఈసారి~~ స్కానింగ్‌కూడా తీయించమన్నారు అబ్డామిన్‌ను.

లివర్‌వద్ద చిన్న చిన్న క్యాన్సర్‌కు సంబంధించిన నాడ్యూల్స్ (బుడిపెలు) ఉన్నట్లు తేలింది. లంగ్స్‌కుకూడా ఎక్సరే తీయించమన్నారు. ఇ.సి.జి. కూడా.

లివర్‌కూ, వగైరాలకు ఆపరేషన్సు చేసే స్పెషలిస్ట్ డా॥ నటరాజ్‌ను పిలిపించారు డా॥ గోపీకృష్ణ. మొదటిసారిలా టెన్షన్ ఫీలవలేదు నేను. నేను పిచ్చిగా అభిమానించే డా॥ గోపీకృష్ణ ఉండగా అమ్మ గురించి యిక నాకేం బెంగ అనుకున్నాను.

అమ్మకు అలా 'లేపరేటమీ' చేశారు. ఆపరేషన్‌ను తట్టుకోగల శక్తి అమ్మకిప్పుడొచ్చింది కాబట్టి.

యూరిన్ పాస్ అవటానికి ఒక ట్యూబ్ పెట్టారు, యూరిన్ ఫిల్లింగ్ బ్యాగుకు కనెక్షనిస్తూ. అది పట్టే శ్రమాలేకుండా అయింది నాకు. ఆ బ్యాగు నిండినప్పుడల్లా దాయాలుతీసి, యూరిన్ 'ఔట్‌పుట్' కౌంట్ చేయటాన్కి సిస్టర్స్‌కు చెప్పేవారు.

"సూక్ష్మంగా ఉన్నవాటిని కూడా తీసేశాం. ఆవిడకు యిక ఢోకా లేదు" అన్నారు డా॥ గోపీకృష్ణ మా అన్నయ్యతో.

ఆయన ఏం చెబితే అదే మాకు వేదం.

ఈసారికూడా ముక్కులోనుండి ట్యూబ్‌వేసి పసరు, వగైరా తీసేకార్యక్రమం చేపట్టారు ఇంటస్టయిన్‌లో కదలికలేదని.

కాస్త కోలుకున్న తర్వాత కుట్లు విప్పారు.

ఈసారి బయాప్సీ రిపోర్టులో కూడా క్యాన్సర్ సెల్స్ ఉన్నట్లు, అవి గ్రేడ్-3 ని సూచిస్తున్నట్లూ వచ్చింది.

డా॥ చంద్రవీణ ట్రీట్‌మెంటువల్ల అయితే అమ్మ చాలా త్వరగా మరణించేది.

మా అదృష్టం బాగుండి డా॥ గోపీకృష్ణగారి చేతిలో పడటంవల్ల, అమ్మ యింకొన్నాళ్ళు బ్రతికే అవకాశం ఏర్పడింది ఆయన తీసుకున్న ప్రత్యేక వైద్యపరమైన శ్రద్ధవల్ల. అమ్మకిప్పుడు అరవైఅయిదు ఏండ్లుమరి.

ఐదవ కీమోథెరపీ మొదలెట్టారు.

ఈసారి సిస్‌ప్లాటిన్‌కు బదులు కార్బోప్లాటిన్ యిచ్చారు. ఇంకా శక్తివంతంగా పనిచేస్తుందని.

అడ్రియామైసిన్ అనే శక్తివంతమైన యాంటీబయాటిక్ ఇంజక్షన్ యిచ్చారు (ఓవరియన్ క్యాన్సర్‌కు వాడేమందు యిది).

దీనివల్ల డయేరియా, వాంతులు, వగైరాలలాంటివి రావచ్చుట.

కానీ అమ్మకు ఏమీ కాలేదు. అమ్మకు బాగానే ఉంటుందిలెమ్మనుకున్నాను.

అయితే ఆయనను చూడందే బ్రతకలేని స్థితికొచ్చాను.

"మీపిచ్చి నాకు హైపిచ్‌లో ఉందని" ఏడుస్తుండేదాన్ని.

ఇంక ఒక్కసారి తప్ప మేము మళ్ళీ కొన్నాళ్ళవరకు రాము కదా! అనే నిజం గుర్తొచ్చి ఉండుండి దుఃఖిస్తుండేదాన్ని. 'నీరాజనం' సినిమాలోని "నినుచూడక నేనుండలేను" అనే పాటను ఎంతో యిష్టంగా వినేదాన్ని. రేడియోలో రోజూ రావాలని కోరుకునేదాన్ని (ఆ పాట).

ఏ ఇన్‌కంటాక్స్ బాధలూ ఆయనకుండకూడదనీ, కొన్ని మినహాయింపులు యిలాంటివారికుండాలనీ కోరుకునేదాన్ని. అందరి దేముళ్ళనూ ఆయన క్షేమం కోసం అనుక్షణం ప్రార్థిస్తుండేదాన్ని

స్పెషల్ రూముల్లో ఉన్నవాళ్లుకూడా ఆయన రౌండ్స్‌కు రావటాన్ని ఎంతగానో ఎదురుచూసేవారు.

ఎనభైఏళ్ళ ముసలమ్మకూడా "పెద్ద డాక్టరింకారాలేదా!" అని అడగటం నేను విన్నాను. ఆయన చల్లని చేతిస్పర్శకోసం పేషెంట్సు అలా వయసు భేదం లేకుండా తహతహలాడిపోవటం గమనించాను నేను.

తెల్లటి బట్టల్లో, ఆ వైద్యవిద్యతెచ్చిన తేజస్సులో సూర్యునిలా వెలిగే ఆయనను చూసిన కళ్ళతో కొందరు ఆడవాళ్ళు ఎడ్డిమడ్డిగా ఉండే తమ భర్తలను యీసడించుకోవటమూ గమనించాను నేను.

పెద్ద పడవలాంటి కారున్నది బయట. మా ఎదురురూమ్‌వాళ్లు మధ్యతరగతి వాళ్ళే. ఆ కారులో వచ్చిన దంపతులను సాగనంపటానికి యీ మధ్యతరగతి పేషెంట్‌గారి భార్య క్రిందకు వచ్చింది. అంత గొప్పవాళ్ళు తమకు తెలుసు అన్నట్లు, ఇతరులు చూస్తున్నారో లేదోనని యీమె ఆ చుట్టూ చూడటం, పోజులు కొట్టటం పైనుండి కిటికీలోగుండా చూస్తున్న నాకు నవ్వు తెప్పించింది. మిడిల్ క్లాస్ వాళ్ళ మనస్తత్వాలిలాగే ఉంటాయ్ దాదాపు అనుకున్నాను.

స్పెషల్ రూమ్సులో ప్రతి రూమ్‌లోనూ చిన్నస్టాండ్, అందులో ధర్మామీటరు ఉండేవి. కిటికీలకు చక్కని కర్టెన్సు, ఎటుచూసినా పరిశుభ్రత కొట్టొచ్చినట్లుండేది.

క్యూబికల్స్‌కూడా అలాగే అద్దంలాసీట్‌గా ఉండేవి. అన్ని రూముల్లోనూ, చక్కని ప్రకృతి చిత్రాలూ, రవివర్మ చిత్రాలూ, పసిపిల్లలున్న పెయింటింగ్స్ వగైరాలు కంటికింపుగొలుపుతూ ఉండేవి. అలాంటివి వరండాలలోనూ అమర్చబడి ఉండేవి.

నీడలో పెరిగే అందమైన క్రోటన్సులో ఉన్న పింగాణీ కుండీలు అక్కడక్కడా అమర్చబడి యింటికంటే అన్నతేత్రి హాయిగాఉందనే భావాన్ని పేషెంట్‌కూ, పేషెంట్స్‌తో వచ్చినవాళ్ళకూ, విజిటర్స్‌కూ కలిగేలా ఉండేవి. వీలున్నప్పుడల్లా యిలాంటివన్నీ గమనిస్తుండేదాన్ని నేను.

ఒకరోజు రాత్రి రెండుగంటలదాకా డా. గోపీకృష్ణ యింటికెళ్లలేదనితెల్సింది.

ఏదో బర్నింగ్ కేస్ వచ్చిందట. దాదాపు ఒళ్ళంతా కాలిపోయి, ఓడవళ్లట వాళ్లు. ఆయనేఉండి, ప్రత్యేకంగా ఆ కేసు వ్యవహారంచూసి, అప్పుడెళ్ళార్టయింటికి.

ఆయనకు అన్నింటికన్నా డ్యూటీయే ప్రాణమన్నమాట.

"వైద్యోనారాయణోహరిః" అన్న సూక్తికి ప్రతిబింబం డా॥ గోపీకృష్ణ.

అందరు డాక్టర్లూ యిలా ఉంటే వైద్యపరంగా దేశం ఎంత పురోభివృద్ధిని సాధించేది? అనిపించింది నాకు.

ఆయనమీద నా ఆరాధనాభావం మరింతగా పెరిగిపోయింది.

ప్రేమకూ, వయసుకూ సంబంధముందదన్పించింది.

ప్రముఖ నటి ఎలిజబెత్ టేలర్ చూడూ! ప్రేమకు ఎంత ప్రాముఖ్యాన్ని యిచ్చి, ఆ వయసులో కూడా వివాహం చేసుకుందో! ఎందుకంటే తొంభైశాతం ప్రేమ అనేది సెక్స్‌తో ముడిపడి ఉంటుంది కాబట్టి.

కొన్ని పాశ్చాత్యదేశ పద్ధతులే నాకు నచ్చుతాయి.

మనదేశంలో సాంప్రదాయం ముసుగులో భార్యాభర్తలు ఒకళ్ళకొకళ్ళకు పడక, అనుక్షణం ఛీదరించుకుంటూ, అనుభూతులు చచ్చిపోయి, పిచ్చికుక్కల్లా కొట్లాడుకుంటూ, తద్వారా పిల్లల మనసులను పాడుచేస్తూ, జీవిస్తుంటారు గదా! అలాంటివారు ఒక సామరస్యభావానికొచ్చి, స్నేహపూర్వకంగా విడిపోయి, ఎవరి మానానవారు గౌరవంగా బ్రతుకుతూ, పిల్లల విషయంలోకూడా సముచిత నిర్ణయాలు తీసుకుని, విడివిడిగా జీవితం సాగిస్తుంటే చూసి, గేలిచేయని సమాజం మన దేశంలో ఏర్పాడాలనీ పాశ్చాత్యదేశాలలోలాగా అనుకుంటాను నేను!

చివరి కీమోథెరపీకి మా అమ్మను తీసుకొచ్చాం "శ్రీవిలసిత నర్సింగ్ హోంకు"

ఈసారి వ్యాధినిరోధక శక్తి తగ్గటంవల్లనో, ఏమో అడ్రియామైసిన్ వల్ల అమ్మకు బాగా మోషన్స్ అవటం మొదలెట్టాయి. వాటినీ తత్సంబంధిత మందులతో కంట్రోల్ చేసి కీమోథెరప్యూటిక్ డ్రగ్స్ యిచ్చారు తర్వాత.

"మందులవల్ల కాస్త నీరసంగా ఉంటుంది ఏమీకాదు. భయపడాల్సిన పనిలేదు" అని ధైర్యంచెప్పి, ప్రేమగాచూస్తూ వెళ్ళారు డా॥ గోపీకృష్ణ చివరిరోజు ఉదయం రౌండ్స్‌కొచ్చినప్పుడు, కీమోథెరపీకిచ్చే మందులవల్ల క్యాన్సర్ సెల్స్‌తోపాటు మామూలు సజీవకణాలు కొన్ని నశించటంవల్ల అలా ఉంటుందట నీరసంగా.

ఆయన చూపులెప్పుడూ ప్రేమామృతాన్ని వర్షిస్తుంటాయి. డెజర్ట్‌లాంటి జీవితం కల్గిన నేను ప్రేమలో కూడిన ఆ చూపుల్ని ఆయనపట్ల ఆరాధనతో మేళవించుకున్నాను

"ఆయనవి – చూపులు కావు–అవి అయస్కాంతపు విరితూపులు–నా హృదయాంతరాళాలను చీల్చివేసే చురకత్తులు" అని కవిత్వ ధోరణిలో అనుకున్నాను నాలో నేను.

తర్వాత స్పెషలిస్ట్ రావుగారువచ్చి, అమ్మ పొట్టమీద వేళ్ళతో కొట్టిచూశారు చేతులతో నొక్కుతూ, అలా వ్యాధివ్యాప్తిని గుర్తించగలరువాళ్ళు.

అమ్మ కాలివేళ్ళు, చేతులవేళ్లు నాలుకా నలుపురంగులోకి మారాయి మందుల వల్ల. ఆ తర్వాత వాడాల్సిన మందులు వ్రాసిచ్చారు డా॥ రావు అమ్మకు.

"టాబ్లెట్సు వాడకూడదా! ఆరు నెలలు ఆస్పత్రికి రావాలా?" అని డా॥ రావు గార్నడిగాను అప్పుడు. ఇప్పుడు ఆ ఆరునెలలూ డా॥ గోపీకృష్ణగారి నీడలో, ఆయన గురించిన మధురోహలతో, అక్కడున్నన్నాళ్ళూ ఆయన రౌండ్స్‌కొచ్చినప్పుడు ఆయనను చూస్తూ కడుపునింపుకుంటూ ఆరు నిముషాల్లా గడిచిపోయాయినాకు.

ఇహ యీ మర్త్యకాలంలో ఆయనను చూసే భాగ్యమే ఉండదనుకున్నాను. మనసంతా శూన్యంగా, జీవితం వృధాగా అన్పించేది. ఏడవటమే ధ్యేయమైపోయింది నాకు.

నెలనెలా చెకప్‌కోసం వచ్చినా ఆయన ఆ టైమ్‌కు రాకపోవచ్చు. స్పెషలిస్ట్ ముందేచూసి పంపవచ్చు అంతగా చూసేభాగ్యం కలగదుగదా! ఎట్లాగయినా........ ఆ తర్వాత కాలం బ్రతికున్నన్నాళ్ళూ అమ్మకిచ్చే తదుపరి ట్రీట్‌మెంట్‌కు నేనుండకపోవచ్చు కాబోయే ట్రాన్స్‌ఫర్ మూలంగా.

క్యాన్సరనేది బ్లడ్ క్యాన్సర్, బ్రెయిన్ ట్యూమర్, లంగ్‌క్యాన్సర్, ఏదైనా ప్రాణాంతకమైనదే.

అది మొదటి స్టేజీలోఉన్నా, రెండు, మూడు, నాల్గవ స్టేజీలలో ఉన్నా గుర్తించి, తగిన మందులిచ్చి, రోగి జీవితకాలాన్ని వీలయినంతవరకూ పొడిగించటం ప్రతిభావంతులైన డాక్టర్ల బాధ్యత అనన్పించింది నాకు.

అందుకే డాక్టర్లు కావటం ఎన్నో జన్మల సుకృతం అనుకున్నాను. మంచి డాక్టర్లుగా పేరుతెచ్చుకోవటం, అందరికీ ఆత్మీయులుగా అన్పించుకోవటం మరీ అదృష్టమన్పించింది. ఈ విషయంలో డా॥ గోపీకృష్ణగారు కృతకృత్యులయ్యారు

డిశ్చార్జ్ చేశారు మా అమ్మను. అన్నయ్యవెళ్ళి బిల్లుచెల్లించి అందరికీ స్వీట్స్ పంచి, వచ్చాడు. సామాన్లన్నీ సర్దాను. నా కళ్ళు ధారాపాతంగా వర్షిస్తూనే ఉన్నాయి. ఎవరూ చూడకుండా తుడుచుకుంటూనే ఉన్నాను.

"గుడ్ బై............నా ప్రియాతి ప్రియమైన నా ప్రాణంలో ప్రాణమైన డా॥ గోపీకృష్ణగారూ............గుడ్ బై..............ఈ పిచ్చిదెప్పుడైనా మీకు గుర్తొస్తుందా........వడ్డించిన విస్తరిలాంటి మీజీవితంలో నాలాంటిపిచ్చివాళ్ళ గురించిన ఆలోచన రావటానికి అవకాశమే ఉండదేమో మీకు...." అనుకుంటూ వెక్కి వెక్కి ఏడ్చాను బాత్‌రూంలోకెళ్ళి.


టేబుల్‌పైఉన్న బుల్లి ట్రాన్సిస్టర్‌లోంచి "అందని చందమామకోసమనీ ఆరాట పడినావే చిన్నదానా........నీవు........అల్లాడిపోయినావే చిన్నదానా.... ....!" అంటూ "చివరకు మిగిలేది" చిత్రంలోని ఎం. ఎస్. రామారావుగారు పాడిన పాట వినవస్తోంది భారంగా, నా దుఃఖాన్ని మరింత అధికం చేస్తూ.

## అంకితం

"హైదరాబాద్ నగరంలోని, గాంధీనగర్‌లోగల జగదాంబా నర్సింగ్‌హోమ్ అధిపతి డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి. ఎమ్. ఎస్. గారు యీ కథలోని డా॥ గోపీకృష్ణ పాత్రకు స్ఫూర్తి. వారి పాదపద్మాలవద్ద యీ రచనా పుష్పాన్ని హృదయపూర్వక కృతజ్ఞతలతో సమర్పించుకుంటున్నాను."

— శ్రీమతి [signature]

( మయూరి వీక్లీ, తేది. 23-9-94 )



# "వైద్యబ్రహ్మలు"

నాడు టి. బి. సోకిందంటేనే మనిషి మృత్యువాతబడినట్లు.

నేడో టి బి.ని నార్మల్ ఫీవర్‌లాగే క్యూర్ చేయగల్గుతున్నారు.

బాలింత చావులూ, శిశుమరణాలూ, బహు తక్కువనేడు.

నడుము, మెడ, వగయిరా నొప్పులకు "ఎపిడ్యూరల్ స్టెరాయిడ్స్" ఇంజక్షన్స్ ఆయా భాగాలకిస్తూ, సెర్వికల్ కాలర్స్, లుంబార్ బెల్టులతో, ట్రాక్షన్‌తో రోగులకు ఉపశమనాన్ని ప్రసాదిస్తున్నారు.

రాచపుండుకు శస్త్ర చికిత్స. ఆ తర్వాత రేడియేషన్, కిమోథెరపీలద్వారా మానవుని జీవిత కాలాన్ని పొడిగిస్తున్నారు.

"బ్లడ్ క్యాన్సర్"ను కూడా "బోన్ మేరో" మార్పిడిద్వారా నయంచేస్తున్నారు.

కిడ్నీలలోని రాళ్ళను రోగిని శస్త్రచికిత్స బాధకు గురికానీకుండా ప్రత్యేక [పద్ధ]తులలో తొలగించి రోగిని కాపాడ గలుగుతున్నారు.

చెడిపోయిన మనిషి గుండెకు బైపాస్ సర్జరీలూ లేక గుండె మార్పిడులనూ [వి]జయంగా నిర్వహిస్తున్నారు.

టెస్ట్ ట్యూబ్ బేబీలను సృష్టిస్తున్నారు.

పంచేంద్రియాలు, లివరు, కీళ్ళ నొప్పులు, టైఫాయిడ్, డయాబిటిస్, కుష్ఠు, [వ్య]ాధికాలు, మలేరియాలూ ఒకటేమిటీ? మనిషికొచ్చే సర్వరోగాలనూ రక్తపరీక్షలు, [ఎక్స]్‌రేలు స్కానింగ్‌ల మూలంగా గుర్తిస్తున్నారు.

అత్యాధునిక వైద్య పరికరాలద్వారా ఆపరేషన్లుచేస్తూ సరయిన ఔషధచికిత్సల [ద్వ]ారా నయం చేస్తున్నారు.

రకరకాల అంగవైకల్యాలను [illegible]. [illegible] అందాల ప్లాస్టిక్ సర్జరీలూనూ,

అన్ని ప్రాణులకంటే మిన్నయైన మనిషిని సమూల [illegible] ఉపయో పడేలా వారికి సోకే సకల జబ్బులనూ సమూలంగా [illegible] మనపాలి ప్రత్యక్ష దైవాలై నిలుస్తున్నారు,

ఎవరువారు? ఎవరువారు? ఈ [illegible] ఉంటారు?

వారే కదా! నేటి "వైద్యబ్రహ్మలు".

వారే 'ఎయిడ్స్' వ్యాధిని రూపుమాపుతారిక ముందు.

(13-4-98 కవి సమ్మేళనంలో చదవబడినది. ( సిటీ సెంట్రల్ లైబ్రరీ అశోక్‌నగర్ ).

(విశ్వరచన తేది. 26-4-98)

